
మార్గదర్శకులు
రూ॥ 120/-
పేజీలు: 130

నవచేతన పబ్లిషింగ్ హౌస్
ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

**హార్వర్డ్ వర్సిటీలో ప్రారంభమైన సిఎం తరగతులు**

కేంబ్రిడ్జ్: అమెరికాలోని ప్రఖ్యాత హార్వర్డ్ యూనివర్సిటీకి చెందిన కెనెడీ స్కూల్‌లో (కేంబ్రిడ్జ్, మసాచుసెట్స్) ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ కార్యక్రమానికి ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డిఆదివారం మధ్యాహ్నం (స్థానిక కాలమానం ప్రకారం) హాజరయ్యారు. తొలి రోజు పరిచయ కార్యక్రమాలతో పాటు 21వ శతాబ్దంలో నాయకత్వం, కోర్సులో భాగంగా అధికార విశ్లేషణ.. నాయకత్వం అంశంపై తొలి సెషన్ ప్రారంభమైంది. సోమవారం ఉదయం 7 గంటల నుంచే తరగతులు ప్రారంభమయ్యాయి. సోమవారం సాయంత్రం ఆరు గంటల వరకు (స్థానిక కాలమానం ప్రకారం...) తరగతులు కొనసాగనున్నాయి.

సంపుటి 28, సంచిక: 215 | మంగళవారం | 27-01-2026 | హైదరాబాద్ Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar పేజీలు: 12 | వెల రూ. 5.00

## భారత్ సైనిక పాటవాన్ని చాటిన

# గణతంత్రం








- అబ్బురపడిన విదేశీ అతిథులు
- శుభాంశు శుక్లాకు అశోకచక్ర ప్రదానం చేసిన రాష్ట్రపతి
- తొలిసారి భారత్ పరేడ్‌లో ఇయు సైనిక బృందం

**న్యూఢిల్లీ:** భారతదేశ 77వ గణతంత్ర వేడుకలు సైనిక సామర్థ్యాన్ని, దేశ బహుళ సంస్కృతుల వారసత్వ వైభవాన్ని చాటి చెప్పాయి. న్యూఢిల్లీ కర్తవ్యపథ్‌లో సోమవారం ఉదయం జరిగిన త్రివిధ దళాల కవాతులు, సెంట్రల్ రిజర్వు పోలీస్‌కు చెందిన డేర్ డెవిల్ మోటార్ బైక్ టీమ్, సహస్త్ర సీమా బల్ నారీశక్తి సామర్థ్య విన్యాసాలు, కళా ప్రదర్శనల వేడుకలు చూసి ముఖ్యఅతిథులుగా హాజరైన యూరోపియన్ కమిషన్ ఛైర్మన్ ఉర్సులా వోండ ర్ లేయన్, యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో కోస్టా అబ్బురపడ్డారు. వివిధ రాష్ట్రాల శకటాలకు ఉన్న ప్రాధాన్యతను, ప్రాముఖ్యతను ఉర్సులాకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ వివరించి చెప్పారు. 150 సంవత్సరాలు పూర్తిచేసుకున్న 'వందేమాతర గీతం' నృత్య ప్రదర్శన, భారత మిలిటరీ సైనిక చర్య ఆపరేషన్ సిందూర్ నమూనాలు,ఆపరేషన్ సిందూర్‌కు ఉపయోగించిన దేశీయ క్షిపణులు, శక్తిమంతమైన రక్షణ ఆయుధాలు, కొత్తగా చేరిన యూనిట్లు, నౌకాదళ, వాయుసేన శకటాలు ఈసారి వేడుకల్లో ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. అన్ని కాలాలలో ఎల్లవేళలా రక్షణగా ఉండే అజయ్‌కేతు వాహనం, రణ్ ధ్వజ్ వ్యూహాత్మక రవాణా వ్యవస్థ,ధావన్‌సక్ తేలికపాటి యుద్ధ తరువాయి 2లో

## రాజ్యాంగం ద్వారానే ప్రజలకు

# హక్కులు, బాధ్యతలు



- బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తించడమే రాజ్యాంగ నిర్మాతలకు నిజమైన నివాళులు
- హైదరాబాద్ ప్రతిష్టను పెంచేలా 'తెలంగాణ రైజింగ్ డాక్యుమెంట్-2047'
- 'మూడు ట్రిలియన్ డాలర్ల ఎకానమీ' లక్ష్యంగా ముందుకెళ్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ
- పరేడ్ గ్రౌండ్‌లో గణతంత్ర వేడుకలు



ప్రజాపక్షం/హైదరాబాద్

గత రెండేళ్ల కాలంలో తెలంగాణ రాష్ట్రం సంక్షేమం, వ్యవసాయం, మౌలిక వసతులు, డిజిటల్ విద్య, ఐటి రంగంలో విశేష పురోగతిని సాధించిందని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ అన్నారు. 'రాజ్యాంగం ప్రజలకు హక్కులతో పాటు బాధ్యతలను కూడా కల్పించింది. ఆ బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తించడమే రాజ్యాంగ నిర్మాతలకు మనం అర్పించే నిజమైన నివాళి' అని అన్నారు. హైదరాబాద్ ప్రతిష్టను పెంచే విధంగా 'తెలంగాణ రైజింగ్ డాక్యుమెంట్2047' ఉన్నదని, ఈ డాక్యుమెంట్‌లో సరికొత్త లక్ష్యాలను నిర్దేశించుకుని, 'మూడు ట్రిలియన్ డాలర్ల ఎకానమీ' లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు కొనసాగుతోందన్నారు. ''భారత 77వ గణతంత్ర దినోత్సవం' సందర్భంగా సికింద్రాబాద్‌లోని పరేడ్ మైదానంలో సోమవారం జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకలకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ముఖ్యఅతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అంతకుముందు అమర జవాన్లకు గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, సైనికాధికారులు నివాళులు అ ర్పించారు. అనంతరం పరేడ్ మైదానంలో గవర్నర్ సైనికుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రసంగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం రెండేళ్ల కాలంలో 62,749 ఉద్యోగాలను భర్తీ చేసిందన్నారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేస్తూ ప్రైవేట్ సంస్థలతో సమాంతరంగా పోటీపడేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. రాష్ట్రంలో 1.30 కోట్ల కుటుంబాలకు ఉచితంగా సన్నబియ్యం సరఫరా చేస్తున్నదని, దేశంలోనే సన్న బియ్యం సరఫరా చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని అన్నారు. మహిళలకు బ్యాంకుల ద్వారా రూ.40 వేల కోట్ల రుణాలను సమకూర్చిందని, 7,450 కిలో మీటర్ల పంచాయతీ రోడ్లను ప్రభుత్వం అభివృద్ధి చేయనుందని, తొలి విడత కోసం రూ.11,399 కోట్లు కేటాయించిందని వివరించారు. రాష్ట్రాన్ని సమతుల్య అభివృద్ధి దిశగా మూడు ఆర్థిక మండలాలుగా తరువాయి 2లో



## పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి

# ప్రత్యేక కార్యాచరణ

- ప్రజా ప్రభుత్వంలో రైతు సంక్షేమానికి పెద్దపీట
- రెవెన్యూ, సమాచార పౌర శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి
- మహబూబాబాద్ జిల్లా తొర్రూరు, మరిపెడ మున్సిపల్ కేంద్రాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాపక్షం / మహబూబాబాద్/తొర్రూరు

ఇందిరమ్మ రాజ్యంలో రైతు సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నట్లు రాష్ట్ర హౌసింగ్, రెవెన్యూ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు, మరిపెడ మున్సిపల్ కేంద్రాల్లో పలు అభివృద్ధి పనులకు సోమవారం ఆయన శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. మరిపెడలో వ్యవసాయ పనిముట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనివిధంగా తెలంగాణ ప్రభుత్వం సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేయడం జరుగుతోందని, రైతును రాజు చేయాలనే రైతులకు సంబంధించి రైతు బీమా, రైతు భరోసా, వివిధ పథకాలను ప్రవేశపెట్టడం జరిగిందని అన్నారు. వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా దాదాపు రూ.3 కోట్ల వ్యయంతో మరిపెడ డివిజన్‌లో వ్యవసాయ పనిముట్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పథకం అందుకు నిదర్శనమని, దశలవారీగా అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకొనుటకు ఐదు లక్షల తరువాయి 2లో

## బిజెపికి 400 సీట్లు వచ్చి ఉంటే

# రాజ్యాంగం మారిపోయేది!

- మెజారిటీ రాకపోవడం వల్ల రాజ్యాంగం రక్షించబడుతోంది
- ప్రజాస్వామ్యం, లౌకికత్వం, సమాఖ్య స్ఫూర్తికి బిజెపి ప్రభుత్వం తిలోదకాలు
- ఆర్‌ఎస్‌ఎస్ కనుసన్నల్లో పరిపాలన
- జాతీయ జెండా ఆవిష్కరణలో సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట రెడ్డి విమర్శ




ప్రజాపక్షం/హైదరాబాద్

బిజెపి ఆశించినట్లుగా గత పార్లమెంట్ ఎన్నికల్లో 400 సీట్లు వచ్చి ఉంటే ఇప్పటికే రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా తిరగ రాసేందుకు సకల ప్రయత్నాలు చేసి ఉండేదని సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట రెడ్డి అన్నారు. మెజార్టీ రాకపోవడం వల్ల రాజ్యాంగం రక్షించబడుతోందని ఆయన పేర్కొన్నారు. భారత 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలను హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని సిపిఐ రాష్ట్ర కార్యాలయం మగ్దూంభవన్‌లో ఘనంగా నిర్వహించారు. పల్లా వెంకట రెడ్డి జాతీయ పతకాన్ని ఎగురవేశారు. కార్యక్రమంలో సిపిఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ, మాజీ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్‌పాషా, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటి.నరసింహా, కార్యవర్గ సభ్యులు బొమ్మగాని ప్రభాకర్, నేదునూరి జ్యోతి, ఎస్.ఛాయాదేవి, సిపిఐ రాష్ట్ర నాయకులు ప్రేమ్‌పావని, పల్లె నర్సింహ్మా, రాపోలు సుదర్శన్, ఎం.అనిల్ కుమార్, సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి బి.స్టాలిన్, తరువాయి 12లో




## నేడు బ్యాంకుల

# సమ్మె

- ఐదు రోజుల పని కోసం ఉద్యోగుల డిమాండ్..
- ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో నిలిచిపోనున్న సేవలు

**న్యూఢిల్లీ:** ఐదు రోజుల పని వారాన్ని తక్షణమే అమలు చేయాలనే డిమాండ్‌తో జనవరి 27న దేశవ్యాప్త సమ్మెకు వెళ్లాలని యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (యుఎఫ్‌బియు) నిర్ణయించడంతో, మంగళవారం దేశవ్యాప్తంగా ప్రభుత్వ రంగ బ్యాంకుల కార్యకలాపాలు, సేవలు నిలిచిపోయే అవకాశం ఉంది. అధికారులు, ఉద్యోగులకు ప్రాతినిధ్యం వహించే తొమ్మిది యూనియన్ల సమాఖ్య యుఎఫ్‌బియు ఈ సమ్మెకు పిలుపునిచ్చింది. జనవరి 23న ప్రధాన కార్మిక కమిషనర్‌తో జరిగిన సమావేశం సానుకూల ఫలితం ఇవ్వకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. దీనితో, ఇప్పటికే ఆది, సోమ (గణతంత్ర దినోత్సవం) వారాల్లో పనిచేయని తరువాయి 12లో



## విద్యుత్ బిల్లు ఉపసంహరణకు


# రైతుల ట్రాక్టర్ ర్యాలీలు

**హోషియార్‌పూర్/మోగా :** విద్యుత్ (సవరణ) బిల్లు, 2025 ఉపసంహరణతో సహా తమ డిమాండ్ల సాధనకు సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో రైతులు సోమవారం పంజాబ్‌లోని అనేక చోట్ల ట్రాక్టర్ మార్చ్‌లు నిర్వహించారు. 2021లో న్యూఢిల్లీలోని ఎర్రకోటను ముట్టడించిన రోజున, ప్రస్తుతం రద్దు చేయబడిన మూడు వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్న వేలాది మంది రైతులు బారికేడ్లను తోసేసి ముందుకు వెళ్తుండగా వారిని పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఇరు వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. విద్యుత్ (సవరణ) బిల్లు 2025, విత్తనాల బిల్లు 2025, కార్మిక కోడ్‌లను రద్దు చేయడం, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎం.నరేగా) పునరుద్ధరణ, పంటలపై కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) కోసం చట్టపరమైన హామీని డిమాండ్ చేస్తూ సోమవారం ప్రదర్శనలు నిర్వహించారు. హోషియార్‌పూర్‌లో దోబా కిసాన్ కమిటీ సభ్యులు ముకేరియాన్‌లో తరువాయి 12లో

## బాలిక ప్రాణం తీసిన

# చైనా మాంజా

ప్రజాపక్షం/హైదరాబాద్




తండ్రితో కలిసి బైక్‌పై వెళ్తున్న ఐదేళ్ల చిన్నారిని చైనా మాంజా బలి తీసుకున్న విషాదకర సంఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మేడ్చల్ జిల్లా ఖాజీపల్లి నుంచి తండ్రితో పాటు ఇద్దరు కుమార్తెలు సోమవారం ద్విచక్రవాహనంపై కూకట్‌పల్లి వైపు వెళ్తున్నారు. వివేకానందనగర్ వద్దకు రాగా నే, చైనా మాంజా బాలిక నిష్వికఆదిత్య(5) మెడకు చుట్టుకుని కిందపడిపోయింది. మెడకు తీవ్ర గాయం కావడంతో గమనించిన స్థానికులు సమీప ఆసుపత్రికి తరలించగా, పరీక్షించిన వైద్యులు బాలిక అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కాగా, సంక్రాంతి నేపథ్యంలో చైనా తరువాయి 12లో

# తగ్గనున్న బిఎండబ్ల్యూ, మెర్సిడెస్ కార్ల ధరలు?




- దిగుమతి సుంకాలను 40 శాతం తగ్గించనున్న భారత్!
- నేడు భారత్ – ఇయుల మధ్య ఎఫ్‌టిఎ ప్రకటన
- భారత వస్త్రాలు, పాదరక్షలపై దిగుమతి సుంకం తగ్గించనున్న ఇయు?



**న్యూఢిల్లీ :** ఐరోపా దేశాల కూటమి యూరోపియన్ యూనియన్ (ఇయు)లో తయారైన కార్లపై భారతదేశం దిగుమతి సుంకాలను 40 శాతానికి తగ్గించనుంది. ప్రస్తుతం ఇది 110 శాతంగా ఉంది. ఇది ఫోక్స్‌వ్యాగన్, రెనో, మెర్సిడెస్, బిఎండబ్ల్యు కార్ల ఉత్పత్తిదారులకు ఊతమివ్వనుంది. ఈ మేరకు మంగళవారం భారత్, 27 ఐరోపా దేశాల కూటమి మధ్య స్వేచ్ఛావాణిజ్య ఒప్పందం(ఎఫ్‌టిఎ) ప్రకటించే అవకాశం ఉన్నట్లు 'రాయ్‌టర్స్' సంస్థ ఒక కథనంలో పేర్కొంది. ప్రస్తుతం ఐరోపా కార్లపై దిగుమతి సుంకాలు 15వేల యూరోలకు పైగా ఉన్నాయని, ప్రధాని మోదీ ప్రభుత్వం తక్షణమే పరిమిత సంఖ్యలో కార్లపై పన్నును తగ్గించేందుకు అంగీకరించినట్లు అభిజ్ఞవర్గాల తెలిపాయని రాయటర్స్ వెల్లడించింది. ఏటా 2 లక్షల కార్లుపై 40 శాతం దిగుమతి సుంకాలు తగ్గనున్నట్లు పేర్కొంది. అదే సమయంలో ఐదేళ్ళ పాటు ఎలక్ట్రిక్ వాహనాలపై దిగుమతి సుంకాలను తగ్గించే అవకాశం లేదు. ఆ తరువాత వాటికి కూడా సుంకాలు తగ్గుతాయి. కాగా, బదులుగా భారత వస్త్ర, పాదరక్షలపై ఇయు దిగుమతి సుంకాలను తగ్గించే తరువాయి 2లో

## అమెరికా 23 రాష్ట్రాల్లో మంచు తుఫాను బీభత్సం

### పలుచోట్ల 14 మంది మృతి, అంధకారంలో లక్షలమంది



**వాషింగ్టన్ :** అమెరికాలో గడచిన మూడు రోజులుగా మంచు తుఫాను బీభత్సం సృష్టిస్తోంది. టెక్సాస్ నుండి న్యూ ఇంగ్లాండ్ వరకూ దేశంలో వీధులన్నీ స్తంభించాయి. జనజీవనం ఆగిపోయింది. రోడ్లపై మంచు మేటలు వేసింది. మంచు తుఫాను, చలితో 14మంది మరణించారు. న్యూయార్క్‌లో మంచు బారినపడి ఐదుగురు మరణించినట్లు మేయర్ మమ్దానీ చెప్పారు. మరణించినవారిని ఇళ్లులేని పేదలుగా గుర్తించినట్లు అధికారులు వెల్లడించారు. లూసియానాలో హైపోథెర్మియా కారణంగా ఇద్దరు మరణించారు. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నారు. టెక్సాస్‌లో 16 ఏళ్ల బాలిక ప్రయాణ సమయంలో మంచు తుఫానుకు బలైంది. అనేక రాష్ట్రాలలో లక్షలమంది ప్రజలు విద్యుత్ సరఫరా లేక అంధకారంలో ఉండిపోయారు. సోమవారం 11,000 విమానాలు రద్దయ్యాయి. మరో 2,500 అదనపు విమానాలను కూడా రద్దు చేశారు. వేలాదిమంది ప్రయాణికులు ఎటూపాలుపోక విమానాశ్రయాల్లో నిలిచిపోయారు. స్కూళ్లు, దుకాణాలు కూడా బుధవారం వరకూ మూతబడ్డాయి. టెన్నెసీ, మిస్సిస్సిప్పీ,లూసియానా,జార్జియా,టెక్సాస్ సహా అనేక దక్షిణ రాష్ట్రాలలో ఉష్ణోగ్రతలు మైనస్ స్థాయికి పడిపోవడంతో గందరగోళ పరిస్థితులు నెలకున్నాయి. ఈశాన్య అమెరికా నుండి దక్షిణప్రాంతం వరకూ దాదాపు 23 రాష్ట్రాలు మంచు తుఫాను,వర్షాలు,చలి వాతావరణంలో బిగుసుకుపోయాయి. కొన్ని ప్రాంతాల్లో చలిగాలులు మైనస్ 20 నుండి మైనస్ 30 ఫారెన్‌హీట్‌లో ఉన్నాయి. కొన్ని ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు మైనస్ 40 డిగ్రీలుగా నమోదైనట్లు సిఎన్‌బిసి పేర్కొంది. దేశంలో 213 మిలియన్ ప్రజలు ఈ మంచు తుఫాను పరిధిలో చిక్కుకున్నట్లు అమెరికా జాతీయ వాతావరణ విభాగం తెలియజేసింది. ఆర్కాన్సస్‌లో మంచు ఎనిమిది అంగుళాల మందాన పేరుకుపోగా, ఇల్లినోయిస్, ఒహియో ప్రాంతాలలో 11 అంగుళాల మందాన పేరుకుపోయింది. ఇండియానాలో 13 అంగుళాలు, కాన్సాస్‌లో ఎనిమిది అంగుళాల మందాన మంచు గడ్డకట్టింది. మిస్సోరిలో 12 అంగుళాలు, ఓక్లహోమాలో ఏడు, టెక్సాస్‌లో ఆరు, టెన్నెస్సీలలో ఐదు అంగుళాల మందాన వీధుల్లో మంచు పేరుకుపోయింది. డేవిడ్‌సన్ కౌంటీలో ఆకస్మికంగా విద్యుత్ పోవడంతో 70వేల నివాసాలు అంధకారంలో ఉండిపోయినట్లు ఒక జాతీయుడు చెప్పా డు. కాగా ప్రజలు ముందుగానే ఆహారం నిల్వచేసుకున్నారు. న్యూయార్క్‌సిటీ 96 వీధిలోని సూపర్ మార్కెట్ యజమాని మాట్లాడుతూ, తన దుకాణంలో మొత్తం వస్తువులన్నీ విక్రయించానని, తన దుకాణం ప్రస్తుతం ఖాళీగా ఉందని చె ప్పారు.

## మెక్సికోలో కాల్పులు:11మంది మృతి

**మెక్సికోసిటీ :** సెంట్రల్ మెక్సికోలో జరిగిన కాల్పుల్లో 11 మంది హతులయ్యారు. కాల్పులకు పాల్పడినవారికోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. మెక్సికో నగరం సలమంకలోని ఒక సాకర్ ఫీల్డ్‌లో సాయుధ దుండగులు జరిపిన కాల్పుల్లో 11 మంది మరణించగా, మరో 12 మంది తీవ్రంగా గాయపడ్డారు. మేయర్ సీజర్ ప్రిటో ఫేస్‌బుక్‌లో ఒక పోస్టింగ్ పెడుతూ, దాదాపు ఆట ముగింపు దశకు చేరుకున్న సమయంలో సాయుధులు సాక ర్ ఫీల్డ్‌లోకి ప్రవేశించారని, గాయపడినవారిలో ఒక మహిళ, ఒక బిడ్డ కూడా ఉన్నారని పేర్కొంటూ, దీనిని పిరికి చర్య అని విమర్శించారు. లోమాడి ఫ్లోర్స్ ప్రాంతంలో ఆట జరుగుతుండగా ఘటన జరిగింది. రాష్ట్రం ఎదుర్కొంటున్న విస్తృతహింసలో భాగమైన ఈ ఘటన సామాజిక విచ్ఛిన్నానికి ఒక సంకేతమన్నారు.

# భారత్‌తో వాణిజ్య ఒప్పందాన్ని అడ్డుకుంటున్న వైట్‌హౌస్

### వెలుగుచూసిన రిపబ్లికన్ సెనేటర్ టెడ్ క్రజ్ ఆడియో



**వాషింగ్టన్ :** భారత్‌తో వాణిజ్య ఒప్పందం జరగకుండా వైట్‌హౌస్ అడ్డుకుంటోందని ట్రంప్ రిపబ్లికన్ పార్టీకి చెందిన టెక్సాస్ సెనేటర్ టెడ్ క్రజ్ విమర్శించారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్, వైట్‌హౌస్ వాణిజ్య సలహాదారు పీటర్ నవారో భారత్‌తో వాణిజ్య ఒప్పదం జరగకుండా అడ్డుకుంటున్నారని క్రజ్ ఆరోపించినట్లు అమెరికా మీడియా పేర్కొంది. భారత్‌పై 25 శాతం సుంకాలు తగ్గించుకునే అవకాశాలు ఉన్నాయని అమెరికా ఆర్థికమంత్రి స్కాట్ బెస్సెంట్ ఇటీవల సంకేతాలు ఇచ్చిన నేపథ్యంలో దాదాపు ఆరునెలల క్రితం క్రజ్ చెప్పారన్న ఆడియో బయట పడటంతో భారత్–అమెరికా మధ్య కొత్త ఆటంకాల పరిస్థితి వచ్చింది. రెండుదేశాల మధ్య గత ఏడాదిలో ఆరేడుసార్లు వాణిజ్య ఒప్పందంపై చర్చలు జరిగాయి. అమెరికా వాణిజ్య ప్రతినిధుల బృందం భారత్‌కు వచ్చి చర్చలు జరిపింది. భారత్ బృందం అమెరికా వెళ్లి చర్చలు కొనసాగించింది. ముఖ్యంగా భారత్ వ్యవసాయ మార్కెట్‌లో ప్రవేశించేందుకు అనుమతించాలని ట్రంప్ పట్టుపడుతున్నారు. జన్యుపరంగా మార్పిడి చేసిన వ్యవసాయ ఉత్పత్తులను భారత్‌లోకి డంప్ చేసేందుకు అమెరికా ప్రయత్నం చేస్తోంది. వ్యవసాయ మార్కెట్‌లోకి అమెరికా ప్రవేశాన్ని భారత్ తిరస్కరించడం చర్చల్లో ఒప్పందానికి ప్రధాన ఆటంకంగా ఉందని భావిస్తున్నారు.

ఈ విషయాలన్నీ ట్రెడ్ క్రజ్ దోనర్లతో మాట్లాడినప్పుడు ప్రముఖంగా ప్రస్తావించారు. ఒకవైపు పదే పదే మోదీ గొప్ప వ్యక్తి అని, గొప్ప నాయకుడని ప్రశంసిస్తూ, మరో వైపు విమర్శలు చేయడం, వాణిజ్య ఒప్పందానికి వెనుకాడటం ఏమిటో అర్థం కావడంలేదని దోనర్లతో జరిగిన ప్రైవేటు సమావేశంలో క్రజ్ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. భారతదేశంతో వాణిజ్య ఒప్పందం చేసుకోవడానికి ఎందుకు జాప్యం చేస్తున్నారో అర్థం కావడంలేదని, ఊగిసలాడుతున్నారని, ఈ ఒప్పందాన్ని వైట్‌హౌస్ ఇప్పటికే ఆమోదించాల్సి ఉండగా జాప్యం చేస్తున్నారని విమర్శించారు. ఈ ఒప్పందం చేయడంలో ఎవరు ఆటంకంగా ఉన్నారని దోనర్లు ప్రశ్నించినప్పుడు కొన్నిసార్లు ట్రంప్‌తో పాటు పీటర్ నవారో, జె.డి.వాన్స్ ఉన్నారని క్రజ్ చెప్పారు. గత ఏడాది రెండో అర్థభాగంలో పదినిమిషాల సేపు జరిగిన ఈ సంభాషణ ఆడియో ఉన్నట్లు అమెరికా మీడియా పేర్కొందని, అయితే తాము దీనిని స్వతంత్రంగా తనిఖీ చేయలేదని పిటిఐ వార్తాసంస్థ వెల్లడించింది. టారిఫ్‌లే కాకుండా ఇతర అంశాలు కూడా రెడు దేశాలమధ్య ఉన్నాయి.

గత ఏడాది మే నెలలో భారత్–పాకిస్థాన్ మధ్య యుద్ధాన్ని తానే ముగించానని ట్రంప్ ఇప్పటికి అనేకసార్లు చెప్పారు. ప్రతిసారి భారత్ దీనిని ఖండించింది. పాకిస్థాన్‌పై భారత్ దాడులు విరమించడంలో మూడోదేశం జోక్యం లేదని పదే పదే స్పష్టం చేసింది. ట్రంప్‌కు నరేంద్రమోదీ నేరుగా ఫోన్ చేసి మాట్లాడకపోవడంవల్లనే వాణిజ్య ఒప్పందం కుదరలేదని ఈనెలారంభంలో అమెరికా వాణిజ్యమంత్రి హోవర్డ్ లుట్నిక్ చెప్పారు. రష్యా నుండి చమురు కొనుగోలు చేయడంవల్ల ట్రంప్ ఎంతమాత్రం సంతోషంగా లేరని మోదీకి తెలుసునని, తాము టారిఫ్‌లు పెంచుతామని కూడా తెలుసునని ట్రంప్ అంతకుముందు వ్యాఖ్యానించారు. రెండు దేశాల మధ్య వాణిజ్య చర్చలు జరుగుతున్న సమయంలోనే ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. 2028లో రాబోయే అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేసేందుకు టెక్సాస్ రిపబ్లికన్ సెనేటర్ టెడ్ క్రజ్ చాలా ఆసక్తిగా ఉన్నారు. ట్రంప్ టారిఫ్‌లు అమెరికా ఆర్థిక వ్యవస్థకు నష్టం కలిగిస్తాయని, ఈ విధానాలు చివరకు ఆయనను న్యాయస్థానంలో శిక్షకు గురిచేసేవిగా మారతాయని కూడా క్రజ్ వ్యాఖ్యానించారు. గత ఏడాది ఏప్రిల్ నెలలో ట్రంప్ అన్ని దేశాలపై వరుసగా టారిఫ్‌లను భారీగా పెంచడం ప్రారంభించారు. ఈ టారిఫ్‌ల భారాలు విధించకుండా వెనక్కు తగ్గాలని ఆనాడే కొందరు రిపబ్లికన్ సెనేటర్లు ఆయనకు సలహా ఇచ్చారు. భారత్ నుండి దిగుమతి చేసుకునే సరుకులపై 50 శాతం మేరకు సుంకాలు పెంచడంతో అమెరికాతో భారత్ సంబంధాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. రష్యా నుండి చమురు దిగుమతి చేసుకుంటున్నారన్న ఆరోపణలతో విధించిన 25 శాతం అందనపు సుంకాలు కూడా ఇందులో ఉన్నాయి.

## అమెరికా సెక్యూరిటీ ఒప్పందం సిద్ధం: జెలెన్‌స్కీ



**విల్నియస్ :** ఉక్రేన్‌కు అమెరికా భద్రతాహామీకి సంబంధించిన పత్రాలు సంతకం చేయడానికి సిద్ధంగా ఉన్నాయని ఆ దేశ అధ్యక్షుడు వోలోడిమైర్ జెలెన్‌స్కీ చెప్పారు. అమెరికా, రష్యా ప్రతినిధులతో అబుదాబిలో రెండురోజులపాటు జరిగిన చర్చల తర్వాత జెలెన్‌స్కీ ఈ విషయం చెప్పారు. లిథుయేనియాలో పర్యటన సందర్భంగా విల్నియస్‌లో జెలెన్‌స్కీ పాత్రికేయులతో మాట్లాడుతూ, తన భాగస్వామ్యదేశాలు సంతకాలు చేయడానికి వీలుగా ఒక తేదీని ప్రకటించడంకోసం ఉక్రేన్ ఎదురుచూస్తోందని చెప్పారు. ఉక్రేన్, అమెరికా పార్లమెంటులు ఈ భద్రతా హామీ పత్రాలను సమ్మతించిన తర్వాత ఈ సంతకాలు జరుగుతాయి. అదేవిధంగా 2027 నాటికి యూరోపియన్ యూనియన్‌లో ఉక్రేన్ సభ్యత్వం పొందేవిధంగా తాము గట్టి కృషి చేస్తామని జెలెన్‌స్కీ మరోసారి నొక్కి చెప్పారు. అయితే ఉక్రేన్–రష్యా మధ్య శాంతి చర్చల్లో రష్యాకు ఆటంకంగా ఉన్న రెండు ప్రధానాంశాల్లో ఇదొకటి. ఎట్టి పరిస్థితుల్లోనూ ఉక్రేన్‌కు యూరోపియన్ యూనియన్‌లో సభ్యత్వం ఇవ్వకూడదని రష్యా పట్టుపడుతున్నది. ఆక్రమిత భూభాగాలను తమకు స్వాధీనం చేయడంతో పాటు శాంతి సేనల పేరుతో ఉక్రేన్‌లో అంతర్జాతీయ దళాలు ఉండటాన్ని కూడా పుతిన్ వ్యతిరేకిస్తున్నారు అబుదాబిలో మొట్టమొదటిసారి ఉక్రేన్–అమెరికా–రష్యా ప్రతినిధుల మధ్య జనవరి 24,25 తేదీలలో రెండురోజులపాటు త్రైపాక్షిక చర్చలు జరిగాయి. ఈ చర్చల్లో ఉక్రేన్, రష్యాకు చెందిన సైనిక, దౌత్య ప్రతినిధులు పాల్గొన్నారు. తమ దేశ సార్వభౌమాధికారాన్ని సంపూర్ణంగా గౌరవించాలని, రష్యాతో కాల్పుల విరమణ ఒప్పందం తర్వాత తమ దేశానికి అమెరికా పూర్తి భద్రత ఇవ్వాలని జెలెన్‌స్కీ కోరుతున్నారు. ఈ రెండు దేశాలమధ్య శాంతి ఒప్పందం కుదరడంలో భూభాగాంశమే ప్రధాన ఆటంకంగా మారింది. గడచిన గురువారం (జనవరి 22) ట్రంప్ తరపు దూతలు స్టీవ్ విట్‌కాఫ్, జారెడ్ కుష్నెర్‌లు రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో సుదీర్ఘ మంతనాలు చేశారు. ఉక్రేన్‌తో శాంతి ఒప్పందం చేసుకోవాలంటే, తూర్పు ప్రాంతం నుండి ఆ దేశ సైన్యం వెనక్కు వెళ్లిపోవాలని పుతిన్ కోరుతున్నారు. జెలెన్‌స్కీని ఈ విషయంలో ఒప్పించేందుకు ట్రంప్ ప్రయత్నం చేస్తుండగా రష్యా కూడా రాజీకి సిద్ధంగా ఉండాలని జెలెన్‌స్కీ కోరుతున్నారు.

**అబుదాబి చర్చల్లో పురోగతి లేదు..**

అబుదాబిలో ఉక్రేన్–అమెరికా–రష్యా ప్రతినిధులమధ్య రెండు రోజుల చర్చల్లో ఎలాంటి పురోగతి లేదని రష్యా విదేశాంగ శాఖ సహాయమంత్రి సెర్గీ ర్యాబ్కోవ్ చెప్పారు. టాస్ వార్తాసంస్థతో ఆయన మాట్లాడుతూ, అమెరికాలో ఉన్న రష్యా దౌత్య ఆస్తులపై ఆంక్షలు తొలగించడం, విమానాల రాకపోకలకు సంబంధించి ఎలాంటి పురోగతి లేదన్నారు. ''ఇవన్నీ చికాకు కలిగించే విషయాలు, దౌత్య ఆస్తులను విడుదల చేయడం, విమానాల రాకపోకలను పునరుద్ధరించడంపై ఎలాంటి ఒప్పందం జరగలేదు'' అన్నారు. ర ష్యా అధ్యక్ష భవనంలో పరిపాలనావిభాగం డి ప్యూటీ అధిపతి మాగ్జిమ్ ఒరెష్కిన్ మాట్లాడు తూ, అమెరికాలో స్తంభించిన రష్యా ఆస్తులపై ఆంక్షలు ఎత్తివేస్తే వాటిని ఎలా సద్వినియోగం చేయాలో తాము మార్గదర్శకం చేస్తామన్నారు. ఈ ఆస్తుల లోంచి 100 కోట్ల డాలర్లు తీసి గాజా బోర్డ్ ఆఫ్ పీస్‌కు ఇవ్వాలని పుతిన్ చెప్పారన్నారు.

## ఫిలిప్పీన్స్‌లో ఫెర్రీ మునక.. 15మంది మృతి, 28మంది గల్లంతు




**మనీలా :** దక్షిణ ఫిలిప్పీన్స్‌లో ఒక ఫెర్రీ మునిగిపోవడంతో 15 మంది మరణించారు. మరో 28 మంది గల్లంతయ్యారు. ప్రమాదం జరిగిన సమయంలో ఈ ఫెర్రీలో 350 మంది ప్రయాణం చేస్తున్నారు. ప్రమాదంలో గల్లంతైన వారికోసం భారీ ఎత్తున గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. బాసిలన్ రాష్ట్రం బాలుక్–బాలుక్ గ్రామానికి రెండు కి.మీ సమీపంలో ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఈ ప్రమాదం జరిగింది. రేవు నగరం జాంబోంగా నుండి బయలుదేరిన ఎంవి త్రిష కెర్సిన్–2 ఫెర్రీ దక్షిణ సులులోని జోలో ద్వీపానికి వెళుతుండగా సముద్రంలో మునిగిపోయింది. ప్రమాదం జరిగిన సమయంలో 27 మంది సిబ్బందితోపాటు 332 మంది ప్రయాణికులు ఫెర్రీలో ఉన్నారని ఫిలిప్పీన్స్ తీరప్రాంత గస్తీ దళాలు తెలిపాయి. గడచిన అర్ధరాత్రి నుండి సోమవారం మధ్యాహ్నం వరకూ 316 మందిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చినట్లు సదరన్ మిండనాయో జిల్లా తీరప్రాంత గస్తీదళ కమాండర్ రోమెల్ దుయా చెప్పారు. జాడ తెలియకుండా పోయినవారికోసం నౌకాదళం, గస్తీ హెలికాప్టర్లు ఉమ్మడిగా గాలింపు చర్యలు కొనసాగిస్తున్నట్లు చెప్పారు. మితిమీరిన బరువుగానీ, ప్రతికూల వాతావరణంగానీ బోటు మునిగిపోవడానికి కారణం కాదని, అసలు కారణం తెలియలేదని చెప్పారు. బాసిలన్ గవర్నర్ ముజివ్ హతమన్ బాధితులకు సిబ్బంది సేవలు చేస్తున్న దృశ్యాలను ఫేస్‌బుక్‌లో పోస్టింగ్ చేశారు.

## గణతంత్రం

(మొదటి పేజీ తరువాయి)

వాహనాలు, మనుషులు లేని స్వయం చలిత యుద్ధ వాహనాలు, రోబోటిక్ డాగ్‌లను ప్రదర్శించారు. ఈ పరేడ్ వేడుకల్లో కనిపించిన రాజస్థాన్ ఒంటెల బృందం, విభిన్న సాంస్కృతిక కళాప్రదర్శనలు చూసి ముఖ్యఅతిథులు ఆశ్చర్యపోయారు. ''భిన్నత్వంలో ఏకత్వం'' అనే ఇతివృత్తంతో 100 మంది కళాకారుల ప్రదర్శన దేశ ఐక్యతను ప్రతిబింబింబించింది. కమాండర్ లెఫ్టినెంట్ జనరల్ భవనీశ్ కుమార్ (ఢిల్లీ ఏరియా జనరల్ ఆఫీసర్ కమాండింగ్) ఈ ఏడాది పరేడ్‌కు నాయకత్వం వహించారు. మొట్టమొదటిసారి యూరోపియన్ యూనియన్‌కు చెందిన సైనిక సిబ్బంది పతాకం,ఆపరేషన్ అట్లాంటా–ఆస్పైడ్స్,గ్రూపింగ్ నేవల్ ఆపరేషన్స్ బృందం కూడా భారత గణతంత్ర పరేడ్‌లో పాల్గొంది.



అశ్విక దళం వెంట వస్తుంటే, గుర్రాలకు సంధానించిన సంప్రదాయ బగ్గీలో భద్రతా సిబ్బంది రక్షణలో రాష్ట్రపతి ద్రౌపదీముర్ము విదేశీ ప్రతినిధులతో కలిసి సభావేదిక దగ్గరకు చేరుకున్నారు. తర్వాత ఆమె జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. పరేడ్ వేడుకలు ప్రారంభించడానికి ముందుగా, శుభాంషు శుక్లాకు రాష్ట్రపతి అశోక చక్ర పతకాన్ని ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో అడుగుపెట్టిన తొలి భారతీయ వ్యోమగామిగా గత ఏడాది జూన్‌లో శుభాంషు శుక్లా చరిత్ర సృష్టించారు.

ప్రధానమంత్రి నరేంద్రమోదీ, రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ సహా కేంద్రమంత్రులు, దేశ త్రివిధ దళాల ఉన్నతాధికారులు, విదేశీ దౌత్యవేత్తలు,సీనియర్ అధికారులు, విభిన్న రంగాలకు చెందిన మొత్తం 10,000 మంది ప్రత్యేక అతిథులు కర్తవ్యపథ్‌లో జరిగిన వేడుకలను తిలకించి పులకించారు. నాలుగు హెలికాప్టర్లు కర్తవ్యపథ్‌లో సభికులపై పూలవర్షం కురిపించాయి. యుద్ధ విమానాలు, హెలికాప్టర్ల విన్యాసాలు, సాయుధ బలగాల్లో నారీశక్తిబృందాల మోటారు సైకిల్ విన్యాసాలు, ఆపరేషన్ సిందూర్ జెండాలను ప్రదర్శించిన ధ్రువ్ హెలికాప్టర్లు, మానవరహిత దివ్యాస్త్ర ప్రదర్శనలు, డ్రోన్ ప్రదర్శనలు కర్తవ్యపథ్‌కు కొత్త అందాలు తెచ్చి దేశీయ సామర్థ్యాన్ని చాటి చెప్పాయి. 30 వేలమంది భద్రతాసిబ్బంది, పోలీసులు, డ్రోన్లు, నిఘా నేత్రాల మధ్య విజయవంతంగా ఈ వేడుకలు పూర్తయ్యాయి.ఏటేటా జరుగుతున్న ఈ వేడుకలు ఈసారి భారతదేశ వ్యూహాత్మక స్వయంప్రతిపత్తిని, భిన్నత్వంలో ఏకత్వాన్ని, అమెరికా,రష్యాలకు చెందిన రక్షణరంగ వ్యవస్థలను కూడా ప్రదర్శించారు. బ్రహ్మోస్ సూపర్ సోనిక్ క్షిపణులు, ఆకాశ్ ఆయుధ వ్యవస్థ సూర్యాస్త్ర, సార్వత్రిక రోదసీవవాహక నౌకా వ్యవస్థ, ప్రధాన యుద్ధ శకటం అర్జున్, పదాతిదళ తుపాకులు ధనుష్, దివ్యాస్త్రవ్యవస్థలు వేడుకల్లో ప్రధాన ఆకర్షణలుగా ఉన్నాయి. 30 విభాగాలకు చెందిన శకటాలు చూపరులను ఆకట్టుకున్నాయి. వీటిల్లో 17 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు చెందిన శకటాలు, వివిధ మంత్రిత్వశాఖలు,ప్రభుత్వ విభాగాలకు చెందిన 13 శకటాలు కనువిందు చేశాయి.

గత ఏడాది మే నెలలో ఆపరేషన్ సిందూర్ సందర్భంగా భారత సైన్యం మోహరించిన ప్రధాన ఆయుధ వ్యవస్థల నమూనాలతో కూడిన త్రివిధ దళాల శకటం ఈ వేడుకలలో ప్రధాన ఆకర్షణగా మారింది. బ్రహ్మోస్–ఎస్–400 క్షిపణులు వంటివాటిని ఆపరేషన్ సిందూర్‌లో ఉపయోగించారు.త్రివిధ దళాల సమగ్ర నిర్వహణా కేంద్రం నమూనాలను ఈ శకటంపై ప్రదర్శించారు. భారత సైన్యం యుద్ధ నమూనాను మొదటిసారి ఈ పరేడ్‌లో ప్రదర్శించారు. ఇందులో గగనతల వ్యవస్థను కూడా జోడించారు. యుద్ధ యూనిఫాంలో 61వ దళాన్ని ప్రదర్శించారు. తేలికపాటి ధ్రువ హెలికాప్టర్లను, దేశీయ అస్త్రాలను ప్రదర్శించారు. టి–90 భీష్మ,ప్రధాన యుద్ధ శకటం అర్జున్‌లు భూతలంపై కర్తవ్యపథ్‌లో పురోగమిస్తూ ఉంటే గగనతలంలో వాటికి మద్దతుగా ఆపాచీ ఎహెచ్–64 ఇ, ప్రచండ్ తేలికపాటి యుద్ధ హెలికాప్టర్లు చక్కెర్లు కొట్టాయి. బిఎంపి–2 పదాతిదళ వాహనాలతో పాటు నాగ్ క్షిపణి వ్యవస్థ ఎంకె–2ను కూడా ప్రదర్శించారు.

లెఫ్టినెంట్ కరణ్ నాగ్యాల్ కమాండర్ హోదాలో ఆయన నాయకత్వాన 144 మంది యువ నావికాదళ బృందం పరేడ్‌లో పాల్గొంది. లెఫ్టినెంట్ పవన్ కుమార్ గంది, లెఫ్టినెంట్ ప్రీతీ కుమారి, లెఫ్టినెంట్ వరుణ్ ద్రేవవేరియాలు ప్లటూన్ కమాండర్లుగా వ్యవహరించారు. నావికాదళ సామర్థ్యాన్ని చాటి చెప్పే శకటాన్ని ప్రదర్శించారు. ఐదో శతాబ్దం (ఉమ్మడి శకం)నాటి నౌక నమూనాను ప్రదర్శించారు. ఐఎన్ఎస్‌వి తరిని (నావికాసాగర్ పరిక్రమ–2 సాహసయాత్ర) శకటం దాని వెంట వచ్చింది. భారతవాయుసేనకు చెందిన 144 మంది బృందం నలుగురు ఆఫీసర్ల నాయకత్వంలో పరేడ్‌లో పాల్గొంది. స్క్వాడ్రన్ లీడర్ జగదీశ్ కుమార్,స్క్వాడ్రన్ లీడర్ నికితా చౌధరి, ఫ్లీట్ లెఫ్టినెంట్ ప్రఖార్ చంద్రాకర్,ఫ్లీట్ లెఫ్టినెంట్ దినేశ్‌లు పాల్గొన్నారు. మిగ్–29, ఎస్‌యు–30, జాగ్వార్ విమానం కూడా ఫ్లయ్‌పాస్ట్‌లో పాల్గొన్నాయి. డిఆర్‌డిఓకు చెందిన హైపర్‌సోనిక్ గ్లైడ్ హిపణి ఎల్ఆర్–ఎఎస్‌హెచ్ఎంలను ప్రదర్శించారు.

ఈ ఏడాది పరేడ్‌లో అతిథుల ఎన్‌క్లోజర్లకు నదులపేర్లు రావి, బియాస్, బ్రహ్మపుత్ర, చంబల్,చీనాబ్, గండక్, గంగ,ఘాగ్ర,గోదావరి,సింధు, జీలం,కావేరి, కోసి, కృష్ణ, మహానది,నర్మత,పెన్నార్,పెరియార్, రావి, సోనే, సట్లెజ్, తీస్తా, వైగై, యమున పేర్లతో బోర్డులు పెట్టారు.



## హక్కులు, బాధ్యతలు

(మొదటి పేజీ తరువాయి)

విభజించిందన్నారు. భారత రాజ్యాంగం అమలులోకి వచ్చినప్పటి నుంచి భారత్ ఒక గణతంత్ర దేశంగా అవతరించిందని, ఆ చారిత్రాత్మక క్షణం నుంచే రాజ్యాంగం దేశానికి మార్గనిర్దేశం చేస్తోందని, న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం అనే మూలసూత్రాలతో దేశాన్ని నడిపిస్తోందని ఆయన చెప్పారు. గణతంత్ర దినోత్సవం కేవలం పండుగ మాత్రమే కాదని, స్వాతంత్ర్య సమర యోధుల త్యాగాలను స్మరించుకునే పవిత్ర సందర్భమన్నారు. తెలంగాణ రైజింగ్2047 ప్రణాళిక ద్వారా గాంధీ సరోవర్ ప్రాజెక్ట్ (బాపూఘాట్), గ్రీన్ ఫీల్డ్, డ్రైపోర్టులు, రెండోదశ మెట్రోరైలు, ఔటర్ రింగ్ రోడ్, రీజినల్ రింగ్ రోడ్ల మధ్య రేడియల్ రోడ్లు, వరంగల్, ఆదిలాబాద్ విమానాశ్రయాలు, హైదరాబాద్ – నాగ్‌పూర్, హైదరాబాద్ బెంగళూరు, హైదరాబాద్–విజయవాడ పారిశ్రామిక కారిడార్లను నిర్మించనున్నారని, ఇవన్నీ 2047 నాటికి తెలంగాణాను దేశ పురోగతిలో కీలక పాత్రధారిగా నిలబెడతాయని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రత్యేకమైన సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించేందుకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధను కనబరుస్తోందన్నారు. రాష్ట్ర చరిత్రలోనే తొలిసారిగా మేడారంలో రాష్ట్ర మంత్రివర్గ సమావేశాన్ని నిర్వహించారని, మేడారం సమ్మక్కసారలమ్మ మహా జాతరకు శాశ్వత మౌలిక వసతుల కోసం రూ.251 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసిందని చెప్పారు.

**రైతు సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత..**

రైతు సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోందని, వ్యవసాయ రంగానికి 24 గంటల నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేస్తుందని గవర్మర్ జిష్ణు దేవ్ వర్మ అన్నారు. ధాన్యం ఉత్పత్తిలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే అగ్రస్థానంలో నిలిచిందని, ధాన్యానికి బోనస్‌గా రైతులకు రూ.1,780 కోట్లను చెల్లించిందని, సన్న వడ్లపై క్వింటాల్‌కు రూ.500ల చొప్పున బోనస్‌ను చెల్లిస్తున్నదన్నారు. దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని బృందం తెలంగాణ లక్ష్యాన్ని, ఉద్దేశాన్ని ప్రపంచానికి చాటిందన్నారు. 'తెలంగాణ నెక్ట్స్‌జనరేషన్ లైఫ్ సైన్సెస్ పాలసీ202630'ని ప్రారంభించిందని గవర్నర్ తెలిపారు.

## ప్రత్యేక కార్యాచరణ

(మొదటి పేజీ తరువాయి)

నగదు, రెండు పడకల గదుల నిర్మాణం చేపట్టి అందిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఈ నిర్మాణ పథకంలో ఆర్థిక ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలోస్వయం సహాయక బృందాలలో సభ్యులుగా ఉన్న మహిళలకు వడ్డీ లేని రుణాలను అందించి ఇల్లు నిర్మాణం కోసం ఇతర అవసరాల వ్యాపార అభివృద్ధి కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. తొర్రూరు పట్టణంలో రెండు పడకల గదుల నిర్మాణం పూర్తి చేసుకున్న బ్లాకులను మంత్రి సందర్శించారు. సాధ్యమైనంత త్వరగా నిర్మాణాలు పూర్తి చేసి లబ్ధిదారులకు అందించాలని అందుకు హౌసింగ్ అధికారులు రెవెన్యూ విభాగం సిబ్బంది ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మున్సిపల్ పట్టణ పరిధిలో సుమారు రూ.15 కోట్ల వ్యయంతో అంతర్గత రోడ్ల నిర్మాణం డ్రైనేజీలు, విస్తరణ తదితర పనుల ప్రారంభోత్సవం కోసం భూమి పూజ శంకుస్థాపనలు చేయడం జరిగిందని పట్టణాలు,గ్రామాలు అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించి అధిక నిధులు కేటాయించడం జరుగుతుందని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రామచంద్రునాయక్, పాలకుర్తి ఎమ్మెల్యే మామిండ్ల యశస్విని రెడ్డి, వరంగల్ పార్లమెంటు సభ్యురాలు కడియం కావ్య, జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్, అదనపు కలెక్టర్ రెవెన్యూ అనిల్ కుమార్, రెవెన్యూ డివిజనల్ అధికారి గణేష్, మున్సిపల్ కమిషనర్, వ్యవసాయ శాఖ అధికారిని సరిత, సంబంధిత విభాగాల అధికారులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### విజయవంతమైన భారత్

## ప్రపంచాన్ని మరింత సుస్థిరం చేస్తుంది

### ఉర్సులా వోండర్ లేయన్

**న్యూఢిల్లీ :** విజయవంతమైన భారతదేశం ప్రపంచాన్ని మరింత సుస్థిరం చేస్తుందని యూరోపియన్ కమిషన్ ఛైర్మన్ ఉర్సులా వోండర్ లేయన్ అన్నారు. న్యూఢిల్లీలో సోమవారం ఉదయం జరిగిన 77వ భారత గణతంత్ర వేడుకల వైభవాన్ని తిలకించిన తర్వాత ఆమె భారత్‌ను ప్రశంసించారు. ''భారత గణతంత్ర వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరుకావడం నా జీవితంలో దక్కిన ఒక గొప్ప గౌరవం, విజయవంతమైన భారతదేశం ప్రపంచాన్ని మరింత సుస్థిరం చేస్తుంది, దీనివల్ల మనం అందరం ప్రయోజనం పొందుతాం'' అని ఉర్సులా వ్యాఖ్యానించారు. ఆమెతోపాటు యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో కోస్టా కూడా ముఖ్యఅతిథిగా ఈ వేడుకలకు హాజరయ్యారు. ఈ విధంగా యూరోపియన్ యూనియన్‌కు చెందిన ఇద్దరు అగ్రశ్రేణి నాయకులు మొదటిసారి భారతదేశ గణతంత్ర ఉత్సవాలకు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. వారిద్దరి వెంట ఉన్నతస్థాయి ప్రతినిధిబృందం కూడా వచ్చింది. వీరంతా మంగళవారం జరిగే భారత్–యూరోపియన్ యూనియన్ శిఖరాగ్ర సదస్సులో పాల్గొననున్నారు. భారత రాష్ట్రపతి, ప్రధాన మంత్రి,రక్షణమంత్రి, ఇతర కేంద్రమంత్రులు, త్రివిధ దళాల అధిపతులు, ఉన్నతాధికారులతోపాటు 10,000 మంది అతిథులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు.

ప్రతి సంవత్సరం గణతంత్ర వేడుకలకు విదేశీ ప్రముఖులు హాజరవుతారు. గత ఏడాది వేడుకల్లో ఇండోనేసియా అధ్యక్షుడు ప్రబోవో సుబియంతో ముఖ్య అతిథిగా 2024లో జరిగిన గణతంత్ర వేడుకల్లో ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయేల్ మేక్రాన్ పాల్గొన్నారు. 2023లో ఈజిప్టు అధ్యక్షుడు అబ్దెల్ ఫతా ఎల్–సిసి ముఖ్యఅతిథిగా వచ్చారు.2021, 2022 సంవత్సరాలలో కొవిడ్ మహమ్మారి కారణంగా గణతంత్ర వేడుకలకు విదేశీ ప్రముఖులను ముఖ్యఅతిథులుగా ఆహ్వానించలేదు. 2020లో బ్రెజిల్ అధ్యక్షుడు జైర్ బోల్సొనారో ముఖ్యఅతిథిగా వచ్చారు. అంతకుముందు 2019లో దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సైరిల్ రామఫోసా, 2018లో పది 'ఏసియన్' దేశాలకు చెందిన ప్రతినిధులు అతిథులుగా హాజరయ్యారు.

2017లో అబుదాబి రాజకుమారుడు షేక్ మహ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్,2016లో ఫ్రెంచ్ అధ్యక్షుడు ఫ్రాంకోయిస్ హొల్లాండ్, 2015లో ఆనాటి అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామా ముఖ్యఅతిథిగా వచ్చారు. 2014లో జపాన్ ప్రధానమంత్రి షింజో అబే, 2013లో భూటాన్ రాజు జిగ్మే ఖేసర్ నంగ్యేల్ వాంగ్‌చుక్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అదేవిధంగా నికొలస్ సర్కోజీ, వ్లాదిమిర్ పుతిన్, నెల్సన్ మండేలా, జాన్ మేజర్, మహ్మద్ ఖతామి, జాక్వస్ చిరాక్ (1998 ఫ్రాన్స్ అధ్యక్షుడు), బ్రిటన్ ప్రధాని జాన్ మేజర్, సర్కోజీ (ఫ్రాన్స్ అధ్యక్షుడు 2008), నేపాల్ రాజు బీరేంద్ర బీర్ బిక్రమ్ షా దేవ్ (1999),ఇరాన్ అధ్యక్షుడు ఖతమి (2003), ఇండోనేసియా అధ్యక్షుడు సుసిలో బాంబాంగ్ (2011), మాల్దీవుల అధ్యక్షుడు మామూన్ అబ్దుల్ గయూమ్ (1991) వంటి ప్రముఖ దేశాధిపతులు అంతకు ముందు సంవత్సరాల్లో పాల్గొన్నారు.

## మెర్సిడెస్ కార్లధరలు?

(మొదటి పేజీ తరువాయి)

అవకాశం ఉంది. ఉభయ పక్షాల మధ్య 18 సంవత్సరాల చర్చల తర్వాత ఈ ఒప్పందం ముగింపు దశకు చేరుకుంది. 2007లో ప్రారంభమైన ఈ చర్చలు మంగళవారం ఎఫ్‌టిఏ ప్రకటనతో ముగింపునకు రానున్నాయి.భారతీయ వస్తువులపై ఇయు సుంకాలు సుమారు 3.8 శాతంగా ఉన్నాయి. కానీ అధిక కార్మికులు కలిగిన రంగాలపై సుమారు 10 శాతం దిగుమతి సుంకం విధించబడుతుంది. ఇయు వస్తువులపై భారతదేశం సగటు సుంకం దాదాపు 9.3 శాతం. ముఖ్యంగా ఆటోమొబైల్స్, విడిభాగాలు (35.5 శాతం), ప్లాస్టిక్ (10.4 శాతం), రసాయనాలు , ఔషధాలపై (9.9 శాతం) అధిక సుంకాలు ఉన్నాయి.

మంగళవారం ప్రకటించే ఒప్పందంలో అనేక సేవా రంగాలలో నిబంధనల సరళీకరణ అంశాన్ని కూడా చేర్చనున్నట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపినట్లు 'పిటిఐ' పేర్కొంది. వస్త్రాలు, తోలు, దుస్తులు, రత్నాలు, ఆభరణాలు, చేతివృత్తుల వంటి అధిక కార్మికులు పని చేసే రంగాలకు సుంకం లేని ప్రవేశం కోసం భారతదేశం పట్టుబట్టింది. భారతదేశం ఖరారు చేసిన అన్ని స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలలో ఇది ఒక కీలకమైన డిమాండ్. మరోవైపు తన ఆటోమొబైల్స్, వైన్లతో సహా మద్యంపై సుంకాల తగ్గించాలని ఇయు డిమాండ్ చేస్తోంది. భారతదేశం ఆల్కహాలిక్ పానీయాలపై 100–125 శాతం సుంకం విధిస్తుంది. సున్నితమైన వ్యవసాయ సమస్యలను ఒప్పందం నుండి దూరంగా ఉంచారు. బీఫ్, చక్కెర,బియ్యం మార్కెట్లను ఇయు రక్షిస్తోంది. మరోవైపు, భారతదేశం తన వ్యవసాయ, పాడి రంగాలను పోటీ నుండి రక్షించింది. ఎఫ్‌టిఏలో రెండు వైపులా తమ మధ్య వర్తకం కొనసాగుతున్న 90 శాతానికి పైగా వస్తువులపై దిగుమతి సుంకాలను తగ్గించడం లేదా తొలగించడం జరుగుతుంది. టెలికమ్యూనికేషన్స్, రవాణా, అకౌంటింగ్ , ఆడిటింగ్ వంటి సేవల రంగాలలో వాణిజ్యాన్ని ప్రోత్సహించడానికి నిబంధనలను సడలించడం కూడా ఒక వాణిజ్య ఒప్పందంలో ఉంటుంది.ఎఫ్‌టిఏతో పాటు, పెట్టుబడి రక్షణ, భౌగోళిక సూచికలు (జిఐ)లో కూడా ఇరుపక్షాలు ఒక ఒప్పందం కోసం చర్చలు జరుపుతున్నారు. భారతదేశం – ఇయు ఎఫ్‌టిఏలో వస్తువులు,సేవల వాణిజ్యంతో సహా 24 అధ్యాయాలను కలిగి ఉంది.

**ఇయుతో భారత్ మిగులు వాణిజ్యం**

2024–25లో ఇయుతో భారతదేశం వస్తువుల ద్వైపాక్షిక వాణిజ్యం 136.53 బిలియన్ డాలర్లు. ఇందులో 75.85 బిలియన్ల విలువైన ఎగుమతులు, 60.68 బిలియన్ల విలువైన దిగుమతులు ఉన్నాయి. భారతదేశం అతిపెద్ద వస్తువుల వ్యాపార భాగస్వామిగా ఇయు నిలిచింది. 2024లో సేవల వాణిజ్యం 83.10 బిలియన్ డాలర్లు. 2024–25లో భారతదేశం 15.17 బిలియన్ డాలర్ల వాణిజ్య మిగులును కలిగి ఉంది. భారతదేశం మొత్తం ఎగుమతుల్లో ఇయు మార్కెట్ దాదాపు 17 శాతం వాటా కలిగి ఉంది. భారతదేశానికి ఇయు ఎగుమతులు దాని మొత్తం విదేశీ ఎగుమతుల్లో 9 శాతం ఉన్నాయి.

# రాజ్యాంగ రక్షణకు పోరాడాలి



సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా

**న్యూఢిల్లీ:** మితవాద మతశక్తుల నుండి రాజ్యాంగాన్ని కాపాడుకోవడానికి తీవ్రస్థాయిలో పోరాడాల్సిన సమయం ఆసన్నమైందని సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా పేర్కొన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యాలయం అజయ్‌భవన్‌లో సోమవారం గణతంత్ర దినోత్సవం ఘనంగా నిర్వహించారు. డి.రాజా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడుతూ... భారత గణతంత్ర భావన మితవాద మత శక్తుల నుండి తీవ్రమైన ముప్పు ఎదుర్కొంటోందని ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగ విలువలు దెబ్బతింటున్నాయని హెచ్చరించారు. రాజ్యాంగ రక్షణకు, భారత గణతంత్ర లౌకిక, ప్రజాస్వామ్య, సోషలిస్ట్ లక్షణాన్ని కాపాడుకోడాన్ని తీవ్రస్థాయిలో పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు (ఆహ్వానితుడు) పల్లవ్‌సేన్ గుప్తా, ఢిల్లీ రాష్ట్ర కార్యదర్శి ప్రొఫెసర్ దినేశ్‌వర్ష్నిణి, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ ప్రధాన కార్యదర్శి నిషా సిద్ధూ, ఇతర పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రాజ్యాంగ పరిరక్షణతోనే ప్రజాస్వామ్యానికి భద్రత





సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** రాజ్యాంగ పరిరక్షణతోనే ప్రజాస్వామ్యానికి భద్రత ఉంటుందని, ప్రస్తుత పరిస్థితిలో ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకునే బాధ్యత ప్రతీ భారతీయునిపై ఉందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా సిపిఐ ప్రజా సంఘాలు, పంచాయితీ పాలక వర్గాలు, ఉద్యోగ, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నియోజకవర్గ వ్యాప్తంగా వేడుకలు ఘనంగా నిర్వహించారు. పలు గ్రామ పంచాయితీ కార్యాలయాలు, కార్మిక అడ్డాలు, బస్తీ సెంటర్లు, పార్టీ కార్యాలయాల్లో పర్యటించి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా, జిల్లా కార్యవర్గ సభ్యులు కంచర్ల జమలయ్య, వాసిరెడ్డి మురళీ, కందుల భాస్కర్, దుర్గరాశి వెంకటేశ్వర్లు, సలిగంటి శ్రీనివాస్, భూక్య ధను ఎస్‌కె ఫహీమ్, జిల్లా సమితి సభ్యులు, నాయకులు వంగ వెంకట్, నేరెళ్ల రమేష్, గెద్దాడు నగేష్, యూసుఫ్, ధర్మరాజు, సత్యనారాయణ చారి, రత్నకుమారి, షాహీమ్ విజయలక్ష్మీ, కైసర్, మిర్యాల రాము తదితరులు పాల్గొన్నారు.

# ఈ దేశ స్వాతంత్య్రం అనేక మంది త్యాగధనుల త్యాగాల ఫలితం

సిపిఐ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె.నారాయణ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** భారతదేశ స్వాతంత్య్రం అనేకమంది త్యాగ ధనుల త్యాగాల ఫలితమని సిపిఐ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె.నారాయణ అన్నారు. మణికొండ ల్యాంకోహిల్స్ కమ్యూనిటీలో నిర్వహించిన 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలకు ముఖ్యఅతిథులుగా విచ్చేసిన ఆయన జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం నారాయణ మాట్లాడుతూ అనేక మంది మహానుభావులు, సామాన్య ప్రజలు చేసిన అపూర్వ త్యాగాల ద్వారా సాధించుకున్న ఈ స్వేచ్ఛను పరిరక్షించుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అన్నారు. ముఖ్యంగా విద్యావంతులు సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉందని తెలిపారు. భారతదేశంలో ఉన్న అపార మానవ వనరులు, కష్టపడే ప్రజలు, క్రమంగా బలపడుతున్న ఆర్థిక వ్యవస్థ, ఈ అంశాలన్నీ పేదరిక నిర్మూలనతో పాటు విద్య, ఆరోగ్య రంగాలలో నాణ్యమైన సేవలు సామాన్యులకు అందేలా ఉపయోగపడాలని, ఆ దిశగా మేధావులు చురుకుగా ముందుకు రావాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ల్యాంకో హిల్స్ రెసిడెంట్స్ సొసైటీ అధ్యక్షురాలు ప్రియా తాళ్లూరి, కార్యదర్శి డివిఎల్ఆర్ ప్రసాద్, మాజీ అధ్యక్షులు జనార్ధన్ రెడ్డి, గాంధీ తదితరులు పాల్గొన్నారు.

# రూ.500 నోటుపై గాంధీ ఫొటో మార్చేస్తారేమో?



సిపిఐ సీనియర్ నాయకులు అజీజ్ పాషా

**హైదరాబాద్ :** స్వాతంత్ర్య ఉద్యమంలో భాగస్వామ్యం లేని బిజెపి – ఆర్ఎస్ఎస్ ప్రభుత్వం 500 రూపాయల నోటులో గాంధీ ఫోటోను మార్చేసినా ఆశ్చర్యం లేదని సిపిఐ సీనియర్ నాయకులు, మాజీ ఎంపి సయ్యద్ అజీజ్ పాషా అన్నారు. స్వాతంత్య్రం కోసం పోరాడిన గొప్ప జాతీయ నాయకుల త్యాగాలను, ముఖ్యంగా మహాత్మా గాంధీని ప్రస్తుత ప్రభుత్వానికి కంటగింపుగా మారిందని విమర్శించారు. హైదరాబాద్‌లోని భగత్‌సింగ్‌నగర్‌లో గణతంత్రదినోత్సవం సందర్భంగా ఆయన సోమవారం త్రివర్ణపతాకాన్ని ఆవిష్కరించారు. భారతదేశ ఆర్థిక వ్యవస్థను ప్రపంచంలో మూడవ అతిపెద్దదిగా చేయాలనే భారతదేశ రాష్ట్రపతి ఆకాంక్ష అందరికీ నచ్చుతుంది, కానీ భారతదేశం, జపాన్‌ల మధ్య అంతరం చాలా భారీగా ఉంటుందని, అది సుసాధ్యమైతే, అందరూ సంతోషంగా ఉంటారని అజీజ్ పాషా అన్నారు. నారీశక్తి గురించి రాష్ట్రపతి మాట్లాడటం ప్రశంసనీయమని, అయితే గత ఏడాది నుండి మహిళలపై అత్యాచారాలు నాలుగు వాతం పెరిగాయని, భారతదేశంలో మహిళలు గంటకు 51 కేసులు నమోదు చేస్తున్నారని ఆమె గ్రహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఐవైఎఫ్ కార్యదర్శి ఎం.డి. మహబూబ్, ఆర్.గోపాల్, ఎస్.ఎం.కృష్ణ పాల్గొన్నారు.

# టిజిపిఎస్‌సి బాధ్యత, గౌరవాన్ని కలిగిన రాజ్యాంగ సంస్థ

చైర్మన్ బుర్రా వెంకటేశం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** భారత గణతంత్ర దినోత్సవం సందర్భంగా సోమవారం టిజిపిఎస్‌సి కార్యాలయంలో చైర్మన్ బుర్రా వెంకటేశం జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా కమిషన్ సభ్యులు అమీర్ ఉల్లా ఖాన్, ప్రొఫెసర్ నారి యాదయ్య, లక్ష్మీకాంత్ రాథోడ్, కార్యదర్శి ఎం.హరిత, అధికారులు సిబ్బంది సమక్షంలో బుర్రా వెంకటేశం, గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా బుర్రా వెంకటేశం మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ అనేది గొప్ప బాధ్యత, గౌరవాన్ని కలిగి ఉన్న రాజ్యాంగ సంస్థ అని అన్నారు. గతంలో పలు ఉద్యోగాల భర్తీ ప్రక్రియ ముగిసేందుకు చాలా ఏళ్లు పట్టేదని, కాని ప్రస్తుతం అన్ని నియామకాలని సకాలం పూర్తి చేశామని తెలిపారు.

# రెపరెపలాడిన మువ్వన్నెల జెండా





**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రవ్యాప్తంగా భారత మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. 77వ గణతంత్ర దినోత్స వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు. ప్రభుత్వ , ప్రైవేట్ కార్యాలయాలు, విద్యా సంస్థలు, రాజకీయ పార్టీల కార్యాలయాలు, ప్రజా సంఘాల కార్యాలయాల్లో ఎక్కడి ఎక్కడ జాతీయ పతాకాన్ని ఎగురవేసి సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా శాసన మండలి ప్రాంగణంలో ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాసనసభలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ జాతీయ జెండాను ఆవిష్కరించి రాష్ట్ర ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. సిపిఐ రాష్ట్ర కార్యాలయంలో సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి, గాంధీభవన్‌లో టిపిసిసి అధ్యక్షులు బి.మహేశ్ కుమార్ గౌడ్, బిజెపి రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రామచంద్రరావు, తెలంగాణ భవన్‌లో బిఆర్ఎస్ కార్యనిర్వహక అధ్యక్షులు కె.తారాక రామరావు జాతీయ జెండాను ఎగురవేశారు. తెలంగాణ మీడియా అకాడమీ కార్యాలయంలో ఛైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి, బిసి కమిషన్ కార్యాలయంలో ఛైర్మన్ జి.నిరంజన్, మానవ హక్కుల కమిషన్ కార్యాలయంలో ఛైర్మన్ జస్టిస్ షమీమ్ అక్తర్, టిజిపిఎస్‌సి కార్యాలయంలో ఛైర్మన్ బుర్రా వెంకటేశం జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. డిజిపి కార్యాలయంలో అడిషనల్ డిజిపి డి.ఎస్. చౌహాన్, చంచల్‌గూడలోని జైళ్ల శాఖ కార్యాలయంలో డిజి సౌమ్య మిశ్ర జాతీయ జెండాను ఎగరవేశారు. అగ్నిమాపక శాఖ రాష్ట్ర కార్యాలయంలో డైరెక్టర్ జి.నారాయణరావు, తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ ప్రధాన కార్యాలయం ఎల్‌బిస్టేడియంలో వైస్ ఛైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సోనీ బాలా దేవి జాతీయ జెండాను ఎగురవేశారు.ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయంలో కమిషనర్ సి.హరికిరణ్ జాతీయ పతాకాన్ని అవిష్కరించారు.

**పోలీసు అకాడమీలో..**

ఆర్‌బివిఆర్‌ఆర్ తెలంగాణ పోలీస్ అకాడమీలో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన డిప్యూటీ డైరెక్టర్ డి.మురళీధర్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భారత రాజ్యాంగం 1950 జనవరి 26న అమలులోకి వచ్చిందని, దేశ ప్రజలందరికీ రాజ్యాంగంలో పొందుపరిచిన హక్కులు, స్వేచ్ఛలు, రక్షణలు సమర్థవంతంగా అందుతున్నాయంటే అందుకు ప్రధాన కారణం పోలీసు వ్యవస్థేనని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ కెఆర్‌కె.ప్రసాద్ అడ్మిన్, అసిస్టెంట్ డైరెక్టర్లు ఘంటా వెంకట్రావ్, వివి రమణ, వి.శ్రీనివాసరావు, ఫ్యాకల్టీ డిఎస్‌పిలు సతీష్ కుమార్, పిజి రెడ్డి, ఆదూరి శ్రీనివాసరావు, అమృత రెడ్డి, సందీప్‌రెడ్డి, దేవా రెడ్డి, భాస్కర్, రామారావు, రవీంద్రరాజు, ఇంటెలిజెన్స్ డిఎస్‌పి ఆనందరెడ్డి, కృష్ణ, టి.శ్రీనివాసరావు, జగదీశ్వరావు, తిరుపతి, లా ఫ్యాకల్టీ డాక్టర్ రవికుమార్, వరలక్ష్మి , యూనిట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రమాదేవి, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ యాదమ్మ, రిజర్వ్ ఇన్స్‌పెక్టర్‌లు, ఇతర అధికారులు, ఫ్యాకల్టీ సభ్యులు, శిక్షణార్థులు, క్వార్టర్‌లో ఉన్న అధికారుల ఫ్యామిలీ మెంబర్స్ కూడా పాల్గొని గణతంత్ర దినోత్సవ వేడుకలను విజయవంతం చేశారు.



దేశంలో ప్రస్తుతం ప్రజల హక్కులు, కార్పొరేట్ అవసరాల మధ్య తీవ్రమైన ఘర్షణ కొనసాగుతోందని టిజెఎస్ అధ్యక్షులు ప్రొఫెసర్ ఎం.కోదండరామ్ అన్నారు. కార్పొరేట్ శక్తులకు అనుకూలమైన విధానాలను కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తూ, సామాన్య ప్రజల హక్కులను కాలరాస్తోందని విమర్శించారు. '77వ గణతంత్ర దినోత్సవ' సందర్భంగా హైదరాబాద్‌లోని టిజెఎస్ కార్యాలయంలో జాతీయ జెండాను సోమవారం ఆయన ఆవిష్కరించారు.

# రాజ్యాంగ విలువలను కాపాడటమే లక్ష్యం




ఐద్వా 14వ జాతీయ మహాసభలలో వక్తల పిలుపు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై దేశవ్యాప్తంగా మహిళల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) విమర్శించింది. హైదరాబాద్‌లో జరుగుతున్న ఐద్వా 14వ జాతీయ మహాసభలు రెండవ రోజుకు చేరుకున్నాయి. 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా మాజీ ఎంపి మాలిని భట్టాచార్య జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం రెండవ రోజు సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా జాతీయ, అంతర్జాతీయ రాజకీయ పరిణామాలపై ఐద్వా అధ్యక్షురాలు పి.కె.శ్రీమతి, ప్రధాన కార్యదర్శి మరియం దావులే జాతీయ, అంతర్జాతీయ రాజకీయ పరిణామాలపై నివేదికను సమర్పించారు. మోదీ ప్రభుత్వం ప్రపంచ సామ్రాజ్యవాద ప్రయోజనాలకు లోబడి పనిచేస్తోందని, ఓటు హక్కు, ఉపాధి, ఆహార భద్రత, ఆరోగ్యం, విద్య వంటి రంగాలపై దాడులు జరుగుతున్నాయని ఆ నివేదికలో వెల్లడించింది. ట్రంప్ విధానాలకు, మైనార్టీలపై జరుగుతున్న దాడులను, మత విద్వేషాలను వ్యతిరేకిస్తూ, బీహార్ ఎన్నికల ముందు 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' పేరుతో ఓట్లు తొలగించడాన్ని తప్పుబడుతూ మహాసభ ఏకగ్రీవంగా తీర్మానించింది.

**బిజెపివి బూటకపు హామీలు..**

దేశవ్యాప్తంగా బూటకపు హామీలతో బిజెపి అధికారంలోకి వస్తుందని ఐద్వా అధ్యక్షురాలు పి.కె.శ్రీమతి, ప్రధాన కార్యదర్శి మరియం ధావలే అన్నారు. మీడియా సమావేశంలో ఐద్వా జాతీయ సంయుక్త కార్యదర్శి అర్చన ప్రసాద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి లతో కలిసి వారు మాట్లాడారు. మణిపూర్‌లో కార్పొరేట్ కంపెనీల కోసం విద్వేషాలను రెచ్చగొడుతున్నారని, మహిళలపై జరిగిన హింసలో ఒక్క హంతకుడిని కూడా శిక్షించలేదని మండిపడ్డారు. ఉత్తరప్రదేశ్‌లో మహిళలపై హింసకు వ్యతిరేకంగా పోరాడలేని భయానక పరిస్థితులు ఉన్నాయని, బాధితులను బిజెపి నేతలు బెదిరిస్తున్నారని విమర్శించారు. మహారాష్ట్ర, ఒడిశాల్లో బిజెపి మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేయలేదన్నారు. ఒడిశాలో బిజెపి అధికారంలోకి వచ్చిన వెంటనే గ్రహం స్టెయిన్స్ హత్యకేసు నిందితుడు ధారాసింగ్‌ను విడుదల చేయడం తీవ్ర ఆందోళన కలిగిస్తోందన్నారు. కనీస మద్దతు ధర, ఉచిత విద్యుత్, పెన్షన్లు వంటి హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు. అటవీ భూములను కార్పొరేట్లకు అప్పగించే కుట్రలకు పాల్పడుతున్నారని అన్నారు.

## మహిళల హక్కులను కాలరాస్తున్న మోదీ సర్కార్ : ఎన్ఎఫ్ఐడబ్ల్యూ జాతీయ ప్రధాన కార్యదర్శి నిషాసిద్దు



మహిళల హక్కులను కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కాలరాస్తోందని భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) జాతీయ ప్రధాన కార్యదర్శి నిషాసిద్దు విమర్శించారు. హైదరాబాద్‌లోని ఆర్‌టిసి కళ్యాణమండపంలో జరిగిన 'ఐద్వా జాతీయ 14వ మహాసభ'లో నిషాసిద్దు సౌహార్ద సందేశమిచ్చారు. సామ్రాజ్యవాదం పెరిగిపోతుందని, గజాలో అమానీయ పరిస్థితులు నెలకొన్నాయని, 19 వేల మంది పిల్లలను చంపేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అక్కడ కనీసం ఆహారం లభించని పరిస్థితులు నెలకొన్నాయని, సహాయం చేసే వారిపైన కూడా ఇజ్రాయిల్ దాడులకు పాల్పడుతోందన్నారు. అమెరికా సామ్రాజ్యవాద దాడులకు పాల్పడుతోందని దుయ్యబట్టారు. అనేక పోరాటాల ద్వారా సాధించుకున్న గ్రామీణ ఉపాధి హామీచట్టాన్ని కేంద్రంలోని మోదీ ప్రభుత్వం సవరణ పేరుతో ఆ చట్టం లక్ష్యాన్ని నీరుగార్చిందన్నారు. సమాచర హక్కు చట్టాన్ని కూడా నీరుగార్చారని, ప్రస్తత సవరణ ద్వారా గిరిజన ప్రాంతాల్లో ఉన్న ఖనీజ సంపదను కార్పొరేట్ కంపెనీలకు దోచిపెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. మహిళల ఓటు హక్కును కూడా తొలగిస్తున్నారని నిషా సిద్దు దుయ్యబట్టారు.

# తూటాలను ఎదుర్కొన్న పోలీసుకు గ్యాలంటరీ అవార్డు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఎదురుగా 125 కేసుల్లో నిందితుడైన కరడుగట్టిన నేరస్థుడు. అదును చూసి పోలీసులపైకి తుపాకీ ఎక్కుపెట్టాడు.. రెండు రౌండ్లు కాల్పులు జరిపాడు. తూటా దూసుకుపోయి కాలికి గాయమైనా, రక్తం వస్తున్నా గాయాన్ని పట్టించుకోకుండా ప్రాణాలకు తెగించి ఆ నిందితుడిని హెడ్ కానిస్టేబుల్ వెంకట్ రెడ్డి పట్టుకోగలిగారు. గచ్చిబౌలిలోని ప్రిజం పబ్ వద్దజరిగిన ఈ ఉత్కంఠభరిత పోరులో మోస్ట్ వాంటెడ్ ప్రభాకర్ అలియాస్ రాహుల్ రెడ్డి ఎట్టకేలకు పోలీసులకు చిక్కాడు.

**అసలేం జరిగిందంటే..?**

నానక్‌రామ్‌గూడకు చెందిన ప్రభాకర్ (30) సాదాసీదా నేరస్థుడు కాదు. ఇతనిపై తెలుగు రాష్ట్రాల్లో దాదాపు 125కు పైగా కేసులు ఉన్నాయి. 2022లో విశాఖ సెంట్రల్ జైలు ఎస్కార్ట్ నుంచి తప్పించుకుని అప్పటి నుంచి పోలీసుల నుండి తప్పించుకు తిరుగుతున్నాడు. గౌలిదొడ్డిలోని 'ప్రిజం పబ్'కు ప్రభాకర్ వస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ మర్రి వెంకటరెడ్డికి పక్కా సమాచారం అందింది.వెంటనే అప్రమత్తమైన వెంకటరెడ్డి, తన సహచర సిబ్బంది ప్రదీప్ రెడ్డి, వీరాస్వామిలతో కలిసి పబ్ వద్దకు చేరుకున్నారు. అక్కడ నిందితుడిని గుర్తించి, లొంగిపోవాలని ఆదేశించారు.

**కాల్పులతో విరుచుకుపడ్డ నిందితుడు**

పోలీసులను చూడగానే కంగుతిన్న ప్రభాకర్, తప్పించుకోవాలనే ఉద్దేశంతో తన వద్ద ఉన్న తుపాకీ తీసి పోలీసుల వైపు గురిపెట్టి రెండు రౌండ్లు కాల్పులు జరిపాడు. ఈ క్రమంలో ఒక తూటా వెంకటరెడ్డి ఎడమ కాలి బొటనవేలికి తగిలి రక్తస్రావమైంది. అయినప్పటికీ వెనకడుగు వేయకుండా, తన గాయాన్ని లెక్కచేయకుండా వెంకటరెడ్డి ఇతర కానిస్టేబుళ్లతో కలిసి నిందితుడిపైకి దూకి అతడిని కట్టడి చేశారు. ప్రాణాలకు తెగించి నిందితుడిని పట్టుకోవడంతో పెద్ద ప్రమా దం తప్పినట్లయింది.

**సాహసానికి గుర్తింపు గ్యాలంటరీ అవార్డు**

గత 20 ఏళ్లుగా పోలీస్ శాఖలో అంకితభావంతో పనిచేస్తున్న మర్రి వెంకటరెడ్డి, గతంలోనూ పలువురు భయంకరమైన నేరస్థులను పట్టుకోవడంలో కీలక పాత్ర పోషించారు. గచ్చిబౌలి పిఎస్ పరిధిలో నమోదైన ఉదంతంలో ఆయన చూపిన ధైర్యసాహసాలకు గుర్తింపుగా, 2026 రిపబ్లిక్ డే సందర్భంగా ఆయనను కేంద్ర ప్రభుత్వ 'మెడల్ ఫర్ గ్యాలంటరీ' అవార్డు దక్కింది. ప్రస్తుతం నిందితుడిపై హత్యాయత్నం, ఆయుధాల యాక్ట్ కింద కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# భారత్ సర్వసత్తాక సౌర్వభౌమిక దేశం

మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రజాస్వామ్య వ్యవస్థలో సర్వసత్తాక సౌర్వభౌమిక దేశం మన భారతదేశం అని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సోమవారం నాంపల్లిలోని తెలంగాణ మీడియా అకాడమీ కార్యాలయంలో 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా జాతీయ జెండాను చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి ఎగురవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, 1947లో స్వాతంత్య్రం వచ్చాక ప్రజలకు సంక్షేమ, అభివృద్ధి ఫలాలను ప్రజలకు అందించాలనే సంకల్పంతో డా.బి.ఆర్.అంబేద్కర్ రచించిన ఈ రాజ్యాంగం 1950 జనవరి, 26వ తేదీ నుండి అమలులోకి వచ్చిందన్నారు. అదే విధంగా తెలంగాణ మీడియా అకాడమీ జర్నలిస్టుల సంక్షేమం, శిక్షణా తరగతుల ద్వారా జర్నలిస్టుల వృత్తి నైపుణ్యాలు పెంపొందించడానికి కృషి చేయాలని అన్నారు. రాబోయే రోజులలో జర్నలిస్టుల సంక్షేమం, జర్నలిస్టుల శిక్షణా కార్యక్రమాల నిర్వహణ ద్వారా తెలంగాణ మీడియా అకాడమీ దేశంలోనే మొదటిస్థానంలో ఉండేలా అకాడమీ సిబ్బంది అందరం కలిసి పని చేద్దామన్నారు. ఈ కార్యక్రమంలో మీడియా అకాడమీ సెక్రటరీ నాగులపల్లి వెంకటేశ్వర రావు, అకౌంట్స్ ఆఫీసర్ పూర్ణ చందర్ రావు, మేనేజర్ శైలేశ్వర్ రెడ్డి, ఎమ్.కె. రహమాన్, తదితరులు పాల్గొన్నారు.

# ఇ– ఫైలింగ్‌తో గణనీయమైన మార్పు



డైరెక్టర్ నవీన్ నికోలస్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర పాఠశాల విద్య ప్రధాన కార్యాలయంలో భారత 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ ఇ.నవీన్ నికోలస్ జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2025–26 సంవత్సరంలో ఈఫైలింగ్ పూర్తి అంకితభావం, బాధ్యతతో నిర్వర్తించడం అభినందనీయమన్నారు, తద్వారా డిజిటల్ పరిపాలనకు సజావుగా సమర్థవంతంగా మారడానికి గణనీయంగా దోహదపడిందని పేర్కొన్నారు. ఈ ఫైలింగ్ ప్రక్రియలో విశేష సేవలందించిన పాఠశాల విద్య డైరెక్టరేట్, సమగ్ర శిక్ష, మోడల్ స్కూల్స్, వయోజన విద్య, ఎస్‌సిఈఆర్‌టి విభాగాల నుంచిఎంపిక చేసిన 15 మంది సిబ్బందికి ప్రశంసా పత్రాలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ డైరెక్టర్ పి.మదన్ మోహన్, అదనపు డైరెక్టర్ (మోడల్ స్కూల్స్) ఎస్.శ్రీనివాస చారి, డైరెక్టర్ (వయోజన విద్య) జి.ఉషారాణి, జాయింట్ డైరెక్టర్ రాజీవ్, పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ హైదరాబాద్‌లోని మంత్రుల నివాస సముదాయంలోని తన నివాసంలో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న దృశ్యం

# భారత్‌ను అగ్ర దేశంగా తీర్చిదిద్దాలి

యువతకు రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య పిలుపు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** పేదరికం, దరిద్రం, నిరుద్యోగం, నిరక్షరాస్యత లేని దేశంగా, ఆకలి, అజ్ఞానం, అసమానతలు, దోపిడి, పీడన, వివక్ష, అణచివేతలు లేని దేశంగా భారతదేశాన్ని తీర్చిదిద్దాలని, అందుకోసం విద్యార్థులు, యువకులు కృషి చేయాలని జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య పిలుపునిచ్చారు. హైదరబాద్‌లో జరిగిన 77వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో కృష్ణయ్య విద్యానగర్‌లో జాతీయ జెండా ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో నీల వెంకటేష్, జి.అనంతయ్య, పగిళ్ళ సతీష్, శివ కుమర్ యాదవ్, మోడీ రాందేవ్, అఖిల్ ముదిరాజ్, జితేందర్ యాదవ్, విశాల, వంశీ, వేణుమాధవ్ యాదవ్, కర్రే సిద్దార్ధ సాయి, తన్వీర్, మోహిత్, రోహిత్ తదితరులు పాల్గొన్నారు.





రాజస్థాన్ రాష్ట్రం జోధ్‌పూర్ అలహాబాద్ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి గోవింద్ మాథుర్(ఎడమ నుండి మూడవ వ్యక్తి)ను ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసిన ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఎల్) అధ్యక్షులు ఆర్.ఎస్.చీమా, ప్రధాన కార్యదర్శులు బొమ్మగాని ప్రభాకర్, మురళీధర్, లోహిత్, కార్యదర్శి కునాల్ రావత్

## ఫోన్ ట్యాపింగ్ కేసులో బిఆర్‌ఎస్ మాజీ ఎంపి సంతోష్‌కు నోటీసు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఫోన్ ట్యాపింగ్ కేసులో బిఆర్‌ఎస్ పార్టీకి చెందిన రాజ్యసభ సభ్యుడు జోగినిపల్లి సంతోష్‌రావుకు హైదరాబాద్ పోలీసులు నోటీసులు జారీ చేశారు. సిట్ అధికారి అయిన జూబ్లీహిల్స్ ఎసిపి పి. వెంకటగిరి ఆయనకు సెక్షన్ 160 కింద ఈ నోటీసులు ఇచ్చారు. పంజాగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన క్రైమ్ నంబర్ 243/2024 కేసుకు సంబంధించి మరింత విచారణ నిమిత్తం సంతోష్‌రావు హాజరుకావాలని నోటీసుల్లో పేర్కొన్నారు. ఈ కేసులో ఐపిసి 166, 409, 427, 201, 120(బి) రెడ్‌విత్ 34 సెక్షన్‌లతో పాటు పిడిపిపి యాక్ట్, ఐటి యాక్ట్ సెక్షన్లు 65, 66, 66(ఎఫ్), 70 కింద కేసు నమోదు అయి ప్రస్తుతం విచారణ కొనసాగుతోంది. పోలీసుల విచారణలో ఈ కేసుకు సంబంధించిన కొన్ని అంశాలు, పరిస్థితులపై ఎంపి సంతోష్‌రావుకు అవగాహన ఉన్నట్లు వెల్లడైన నేపథ్యంలో, ఆయనను విచారణకు పిలిచినట్లు నోటీసుల్లో పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం మధ్యాహ్నం 3జూబ్లీహిల్స్‌లోని ఎసిపి కార్యాలయంలో వ్యక్తిగతంగా హాజరై వివరణ ఇవ్వాలని పోలీస్ అధికారులు ఆదేశించారు.
ఈ నోటీసులు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ఈ వ్యవహారంలో తదుపరి పరిణామాలపై ఆసక్తి నెలకొంది.

## క్యాన్సర్ వైద్య నిపుణుడికి మంత్రి దామోదర్ అభినందనలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రముఖ క్యాన్సర్ వైద్య నిపుణులు నోరి దత్తాత్రేయుడుకు కేంద్ర ప్రభుత్వం పద్మ భూషణ్ అవార్డు ప్రకటించడం పట్ల వైద్య, ఆరోగ్య శాఖమంత్రి మంత్రి దామోదర్ రాజనర్సింహ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా దత్తాత్రేయుడుకు మంత్రి దామోదర్ రాజ నర్సింహ ఫోన్ ద్వారా శుభాకాంక్షలు తెలిపారు. క్యాన్సర్ పేషెంట్లకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఆయన చేసిన కృషికి సరియైన గుర్తింపు లభించిందన్నారు. నోరి దత్తాత్రేయుడు సేవలను ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వం గుర్తించి, ఆయనను సలహాదారుగా నియమించుకున్న విషయాన్ని మంత్రి గుర్తు చేశారు.రాష్ట్రంలో క్యాన్సర్ మహమ్మారి నివారణ, పేషెంట్లకు మెరుగైన వైద్య సేవలు అందించే విషయంలో దత్తాత్రేయుడు సలహాలు, సూచనలను ప్రభుత్వం తీసుకుంటుదని తెలిపారు.

## రాజ్యాంగ వ్యతిరేక శక్తుల నుండి రాష్ట్రాన్ని కాపాడుకోవాలి :కెటిఆర్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాజ్యాంగం ఎంత గొప్పదైనప్పటికీ, దీనిని అమలు చేసే వారిలో చిత్తశుద్ధి లేకపోతే ప్రయోజనం శూన్యమని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు అన్నారు. కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని కాంగ్రెస్ పోటీ పడి రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరిస్తున్నాయని మండిపడ్డారు. 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో సోమవారం జాతీయ జెండాను కెటిఆర్ ఆవిష్కరించారు. అనంతరం హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సియు) విద్యార్థులు ప్రస్తుత రాజకీయ పరిస్థితులు,రాజ్యాంగ ఉల్లంఘనలపై లఘు నాటికను ప్రదర్శించారు. అనంతరం కెటిఆర్ మాట్లాడుతూ రేవంత్ రెడ్డి పాలనలో 'ప్రజా పాలన' మృగ్యమై 'అనుముల రాజ్యాంగం' నడుస్తోందని, ఈ రాజ్యాంగ వ్యతిరేక శక్తుల నుండి రాష్ట్రాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. మతాల మధ్య చిచ్చు పెడుతున్న బిజెపి ఒక వైపు, రాజ్యాంగాన్ని పరిహసిస్తున్న కాంగ్రెస్ మరోవైపు దేశానికి పెనుముప్పుగా మారాయని, వీరి నుంచి రాష్ట్రాన్ని, దేశాన్ని కాపాడుకోవాలన్నారు. రాష్ట్రంలో దళితులు, గిరిజనులు,జర్నలిస్టులపైన రాష్ట్ర ప్రభుత్వం దాడులకు పాల్పడుతోందని ఆరోపించారు. ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభమైన జర్నలిస్టులను ఉగ్రవాదుల తరహా అరెస్ట్ చేస్తున్నారని, ఇది రాజ్యాంగ విలువల హననం కాదా అని కెటిఆర్ ప్రశ్నించారు. నేతి బీరకాయలో నెయ్యి ఎంత ఉంటుందో, కాంగ్రెస్ న్యాయ పత్రంలో న్యాయం అంతే ఉందని కెటిఆర్ ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో ప్రస్తుతం రాజ్యాంగబద్ధమైన 'ప్రజా పాలన' సాగడం లేదని, కేవలం రాజ్యాంగాన్ని పరిహసిస్తున్న 'రాక్షస పాలన' కొనసాగుతోందన్నారు.

## బిసి కులగణనపై మోసానికి బిజెపి తెర



**ప్రజాపక్షం/హైదరాబాద్:** జనగణనలో బిసిల కుల గణనపై కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కొత్త మోసానికి తెరతీసిందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత విమర్శించారు. జనగణన విషయంలో కేంద్రం చేసిన మోసంపై తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో ఈ నెల 29న రౌండ్ టేండ్ సమావేశాన్ని నిర్వహిస్తామని వెల్లడించారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా సోమవారం బంజారాహిల్స్ లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో జాతీయ జెండాను కవిత ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన సెన్సెస్ 2026 డాక్యుమెంట్‌లో బిసిల క్లాసిఫికేషన్‌కు ఆప్షన్ పెట్టలేదన్నారు. ఎస్‌సి,ఎస్‌టి,ఇతరులుగా సెన్సెస్ నిర్వహిస్తే దేశంలో బిసిల సంఖ్య ఎంత ఉన్నదనే విషయం ఎలా తెలుస్తుందని ప్రశ్నించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించిన కుల గణనలో బిసిల సంఖ్య తక్కువ చేసి చూపించారని, కేంద్రం చేయబోయే కుల గణనలోనైనా బిసిల లెక్క తేలుతుందని అందరూ ఆశలు పెట్టుకున్నామని , కానీ కేంద్రం జారీ చేసిన డాక్యుమెంట్ లో బిసిల కాలమ్ లేకపోవడంతో పాటు సబ్ క్యాస్ట్ ను సూచించే కాలమ్ కూడా పెట్టలేదని మండిపడ్డారు. బిసిలతో పాటు బిసిలలోని ఉప కులాలను, ఎస్‌సి,ఎస్‌టి ఉప కులాలు, ఇతర కులాల్లోని ఉప కులాలను కూడా వేర్వేరుగా లెక్కించాల్సిందేనని కవిత డిమాండ్ చేశారు. ఈనెల 29న నిర్వహించబోయే రౌండ్ టేండ్ సమావేశానికి బిసి,ఎస్‌సి,ఎస్‌టి, సంచార జాతులతో పాటు ఇతర కులాల్లోని అన్ని ఉప కులాల వారిని ఆహ్వానిస్తున్నామన్నారు.

# లోక్‌భవన్‌లో 'ఎట్‌హోమ్'




**ప్రజాపక్షం/హైదరాబాద్:** గణతంత్ర దినోత్సవం సందర్భంగా గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ లోక్‌భవన్‌లో సోమవారం 'ఎట్‌హోమ్' నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హైకోర్ట్ ప్రధాన న్యాయమూర్తి ఎకె.సింగ్, కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క,స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, మంత్రులు ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, బిఆర్‌ఎస్ ఎంఎల్‌ఎ కె.పి. వివేకానంద, ఎంఎల్‌సిలు ఎల్.రమణ, దాసోజు శ్రవన్, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావుతో పాటు పలువురు కాంగ్రెస్, బిజెపి, బిఆర్‌ఎస్ నాయకులు, ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా 'గవర్నర్ అవార్డ్స్ ఫర్ ఎక్సలెన్స్' అవార్డులను గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ప్రదానం చేశారు. 2025 సంవత్సరానికి గాను మహిళా సాధికారత, గిరిజన అభివృద్ధి, రూరల్ హెల్త్ ,మెడికల్ ఫిలాంత్రపీ, కార్పొరేట్ వాలంటీరింగ్ అనే నాలుగు విభాగాలలో విశిష్ట స్వచ్ఛంద సేవలు అందించిన వ్యక్తులు, సంస్థలను గుర్తించి వారికి పురస్కారాలను అందజేశారు. ప్రతి అవార్డుకు రూ.2 లక్షల నగదు బహుమతితో పాటు విశిష్ట సేవలను గుర్తించే ప్రశంసా పత్రాన్ని కూడా అందజేశారు. అవార్డులు అందుకున్న వారు: రమాదేవి కన్నెగంటి, తోడసం కైలాస్, ప్రద్యుత్ వాఘ్రే, వి.రాజన్న, అవార్డులు పొందిన సంస్థలు : మహిళా సాధికారత సాయి సోషల్ ఎంపవర్‌మెంట్ సొసైటీ,(ఘట్‌కేసర్), ఇండిజినియస్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (గట్టుమల్ల, భద్రాద్రికొత్తగూడెం), రామదేవ్‌రావు హాస్పిటల్(హైదరాబాద్), గివ్ ఫర్ సొసైటీ(ఘట్‌కేసర్).

# సౌమ్య పూర్తిగా కోలుకునేంతవరకు వైద్య సేవల బాధ్యత ప్రభుత్వానిదే

### మంత్రి దామోదర్ రాజ నర్సింహ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నిజామాబాద్‌లో గంజాయి స్మగ్లర్ల దాడిలో గాయపడి నిమ్స్‌లో చికిత్స పొందుతున్న ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్య పూర్తిగా కోలుకునే వరకూ మెరుగైన వైద్య సేవలు అందించే బాధ్యత ప్రభుత్వానిదేనని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. సోమవారం నిమ్స్‌లో సౌమ్యను మంత్రి పరామర్శించారు. సౌమ్యకు ఇలా జరగడం అత్యంత దురదృష్టకరమని మంత్రి పేర్కొన్నారు. ధైర్యంగా ఉండాలని, సౌమ్య పూర్తిగా కోలుకుంటుందని సౌమ్య తల్లి చంద్రకళ, సోదరుడు శ్రావణ్‌లను ఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజ నర్సింహ ఓదార్చారు.సౌమ్య ఆర్యోగ పరిస్థితిని నిమ్స్ డైరెక్టర్ బీరప్ప, ఇతర వైద్యులు మంత్రికి వివరించారు. సౌమ్యను పరామర్శించిన అనంతరం మంత్రి దామోదర్ రాజ నర్సింహ మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో గంజాయి, ఇతర మత్తు పదార్థాల వినియోగాన్ని పూర్తిగా అరికట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ఎక్సైజ్, పోలీస్, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది ఈ లక్ష్యాన్ని చేరుకునేందుకు ఎంతగానో కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.ఈ క్రమంలో నిజామాబాద్‌లో జరిగిన ఘటన అత్యంత దురదృష్టకరమని ఇందుకు కారణమైన ప్రతి ఒక్కరినీ చట్టప్రకారం కఠినంగా శిక్షిస్తామన్నారు.సౌమ్య ఆరోగ్య పరిస్థితి కొంత మెరుగైనప్పటికీ, ఇంకా క్రిటికల్‌గానే ఉందని తెలిపారు.నిమ్స్‌లో సుశిక్షితులైన సీనియర్ వైద్యుల బృందం, సౌమ్యకు అత్యాధునిక వసతులతో కూడిన మెరుగైన వైద్య సేవలు అందిస్తోందని , ఆమె సంపూర్ణంగా కోలుకుటుందని ఆశిస్తున్నమన్నారు.సౌమ్య కుటుంబాన్ని అన్నిరకాలుగా ఆదుకునే బాధ్యత ప్రభుత్వానిదని, విధి నిర్వాహణలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగులపై దాడులను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని స్పష్టం చేశారు. నిందితులపై ఇప్పటికే పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారని మంత్రి తెలిపారు.

# గంజాయి స్మగ్లర్ల దాడి హేయమైన చర్య: జూపల్లి

### సౌమ్య ఆరోగ్య పరిస్థితిపై ఆరా



**ప్రజాపక్షం/హైదరాబాద్:** గంజాయి అక్రమ రవాణాను అడ్డుకునే క్రమంలో ఎక్సైజ్ సిబ్బందిపై జరుగుతున్న దాడులను ప్రభుత్వం అత్యంత సీరియస్‌గా తీసుకుంటుందని ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. నిజామాబాద్ జిల్లాలో గంజాయి స్మగ్లర్లు కారుతో డీకొట్టిన ఘటనలో తీవ్రంగా గాయపడి నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్య ఆరోగ్య పరిస్థితిపై మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదివారం ఆరా తీశారు. నిమ్స్ డైరెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడిన మంత్రి, సౌమ్యకు అందుతున్న వైద్య సేవల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆమెకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ఆమె త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. విధి నిర్వహణలో గాయపడిన సౌమ్యకు ప్రభుత్వం పూర్తి స్థాయిలో అండగా ఉంటుందని మంత్రి జూపల్లి భరోసా ఇచ్చారు. ఈ ఘటనపై ఎక్సైజ్ కమీషనర్ హరికిరణ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ షానవాజ్ ఖాసీంతో మంత్రి జూపల్లి ఫోన్ లో సంభాషించారు. కేసు పు రోగతి, నిందితుల అరెస్టులు, గంజాయి అక్రమ రవాణా మార్గాలు, ముఠాల కార్యకలాపాలపై సమగ్రంగా చర్చించారు.ఇప్పటికే ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు అధికారులు మంత్రికి వివరించారు. పరారీలో ఉన్న మిగిలిన నిందితులను గుర్తించి తక్షణమే అరెస్ట్ చేయాలని, గంజాయి ముఠాలపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి ఆదేశించారు. రాష్ట్రంలో గంజాయి అక్రమ రవాణా, మత్తు పదార్థాల వ్యాప్తిని పూర్తిగా అరికట్టడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు.

# ఉపాధి హామీ చట్టం మార్పునకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పోరాటం

- ఈ నెల 28 నుంచి 31 వరకు జిల్లా పర్యటనలు
- పాల్గొననున్న టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, ఎఐసిసి తెలంగాణ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేసి, మహాత్మాగాంధీ పేరును తొలగించేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు వ్యతిరేకంగా ఎఐసిసి పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా పోరాట కార్యక్రమాలు చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. అందులో భాగంగా ఈ నెల 28వ తేదీ నుంచి 31వ తేదీ వరకు టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్ కుమార్ గౌడ్, ఎఐసిసి తెలంగాణ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ జిల్లాలలో పర్యటించనున్నట్లు టిపిసిసి ప్రకటించింది. ఈ నెల 28న మెదక్, మానకొండూరు, 29న వేములవాడ, ఎల్లారెడ్డి, 30న మేడారం సమ్మక్కసారలమ్మ దర్శనం అనంతరం సాయంత్రం ఆలేరు నియోజకవర్గంలో, 31న నకిరేకల్, ఇబ్రహీంపట్నం నియోజకవర్గాలలో గ్రామ సభలు నిర్వహించనున్నట్లు తెలిపింది. ఈ పర్యటనలో భాగంగా గ్రామస్థాయిలో గ్రామ సభలు నిర్వహించి, జాతీయ ఉపాధి హామీ కూలీలు, జాబ్ కార్డు హోల్డర్లతో కాంగ్రెస్ నాయకులు నేరుగా చర్చలు జరుపుతారు. ప్రతి నియోజకవర్గంలో ఒక గ్రామ సభలో పాల్గొని, ఉదయం ఒక గ్రామంలో, సాయంత్రం మరో గ్రామంలో సభలు నిర్వహించడంతో పాటు ఉపాధి హామీ కూలీలతో సమావేశం నిర్వహించి, సహాపంక్తి భోజన కార్యక్రమంలోనూ పాల్గొంటారు. ఇదిలా ఉండగా, టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ సోమవారం ఢిల్లీకి వెళ్లి, అక్కడ ఎఐసిసి ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్‌తో కలిసి ఎఐసిసి అగ్రనేతలతో సమావేశమయ్యారు.
ఈ సమావేశంలో పార్టీ సంస్థాగత నిర్మాణం, ఎఐసిసి ఇటీవల ప్రకటించిన ఉద్యమ కార్యాచరణ, అలాగే తాజా రాజకీయ పరిణామాలపై విస్తృతంగా చర్చించినట్లు కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటాన్ని మరింత ఉధృతం చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలు చేపట్టినట్లు నాయకులు స్పష్టం చేశారు.

## హైదరాబాద్ ఎస్‌బిఐ కేంద్ర కార్యాలయంలో గణతంత్ర వేడుకలు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) స్థానిక కేంద్ర కార్యాలయంలో సోమవారం ఉదయం 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనం గా జరిగాయి. వందేమాతర గీతం రచించి 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆ గీతాన్ని ఇతివృత్తంగా తీసుకుని నిర్వహించిన ఈ వేడుకలలో ఎస్‌బిఐ చీఫ్ జనరల్ మేనేజర్ ఎస్.రాధాకృష్ణన్ (హైదరాబాద్) జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. మానవ తప్పిదాలు, సైబర్ దాడులు, యాంత్రిక సమస్యలు లేకుండా ఖాతాదారులకు మొబైల్ యాప్‌లు, ఎటిఎం నెట్‌వర్క్ వంటి కీలకమైన బ్యాంకింగ్ సేవల్లో ఎలాంటి లోపాలు, వైఫల్యాలు లేకుండా చూస్తామన్నారు. తెలంగాణలోని ప్రతి జిల్లాలో బ్యాంకింగ్ మార్కెట్ షేరును ఒకశాతం మేరకు పెంచాలన్న ఛైర్మన్ వ్యూహాత్మక దార్శనికతను సాధించే లక్ష్యంతో పనిచేయాల్సి ఉందన్నారు. సంపూర్ణమైన వృత్తినైపుణ్యంతో,నైతికపరమైన అప్రమత్తత ప్రాధాన్యతను ఆయన ఉద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో జనరల్ మేనేజర్లు, సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లు, సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.అనంతరం దేశభక్తి గీతాలాపన, నృత్యాలు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించినట్లు చీఫ్ మేనేజర్ ఎం.ముఖేశ్ (ఎంసి–సిఎస్‌ఆర్) ఒక ప్రకటనలో తెలియజేశారు.



## హైకోర్టులో గణతంత్ర వేడుకలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర హైకోర్టులో సోమవారం రిపబ్లిక్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. మెయిన్ బిల్డింగ్ వద్ద హైకోర్టు చీఫ్ జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్ జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. రాజ్యాంగం ద్వారా దేశ ప్రజలకు అనేక హ క్కులు లభించాయని, వాటిని ప్రజలకు చేకూర్చే బాధ్యత న్యాయస్థానాలపై ఉం దని చెప్పారు. రాజ్యాంగ స్ఫూర్తి ప్రతి పౌరుడికీ చేరాలని, రాజ్యాంగాన్ని కాపాడాల్సిన బాధ్యత కోర్టులు, న్యాయవాదులపై ప్రధానంగా ఉందని చెప్పారు. ప్రజలకు అందడంలో ఎదురయ్యే సమస్యలను కోర్టులే పరిష్కరించే అధికారం రా జ్యాంగం కల్పించిందన్నారు. గత ఏడాది దాఖలైన కేసుల్లో 95 శాతం హైకోర్టు లో పరిష్కారం అయ్యాయని చెప్పారు. ఇందుకు కోర్టు ఆఫీసర్లు, లాయర్ల సహకారం ఉందన్నారు. కార్యక్రమంలో ఏజీ సుదర్శన్‌రెడి, బార్ కౌన్సిల్ చైర్మన్ నరసింహారెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్ మాట్లాడారు. జడ్జీలు, రిటైర్డు జడ్జీలు, లాయర్లు, కోర్టు ఆఫీసర్లు పాల్గొన్నారు.

# మీడియా అక్రిడిటేషన్ నిబంధనలలో కీలక మార్పులు

- డెస్క్‌లోని మహిళా జర్నలిస్టులకు 33 శాతం కోటా తప్పనిసరి
- సర్క్యులేషన్ ఆధారంగా అదనపు అక్రిడిటేషన్ కార్డులు
- ఎస్‌ఎంఎసిలో హైదరాబాద్ ప్రెస్ క్లబ్ ప్రతినిధికి, డెస్క్ జర్నలిస్టుల ప్రతినిధికి ప్రాతినిధ్యం
- అక్రిడిటేషన్ జారీ నిబంధనలను సవరిస్తూ తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రంలో జర్నలిస్టులకు అక్రిడిటేషన్ జారీ నిబంధనలకు ప్రభుత్వం పలు సవరణలు చేసింది. ఈ మేరకు సమాచార, ప్రజాసంబంధాల శాఖ పరిధిలోని 'తెలంగాణ మీడియా అక్రిడిటేషన్ రూల్స్–2025'కు మార్పులు చేస్తూ సాధారణ పరిపాలన శాఖ జిఒ 103ను జారీ చేసింది. ఈ సవరణల ప్రకారం, మీడియా సంస్థలు అక్రిడిటేషన్‌ల కోసంప్రతిపాదించే డెస్క్ జర్నలిస్టుల జాబితాలో కనీసం 33 శాతం మహిళలకు కేటాయించాల్సి ఉంటుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ నిబంధన తప్పనిసరిగా అమలు చేయాల్సి ఉంటుందని ఉత్తర్వుల్లో పేర్కొంది. అలాగే మీడియా సంస్థల అక్రిడిటేషన్ కోటాలో మహిళా జర్నలిస్టులకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించింది. 'తెలంగాణ మీడియా అక్రిడిటేషన్ రూల్స్–2025' లోని నిబంధనలలో పొందుపర్చిన 'మీడియా కార్డు' అనే పదాన్ని 'అక్రిడిటేషన్ కార్డు'గా పరిగణించనున్నట్లు తెలిపింది. ప్రింట్ మీడియా విభాగంలో 2.5 లక్షలకుపైగా సర్క్యులేషన్ ఉన్న పత్రికలకు అదనంగా అక్రిడిటేషన్ కార్డు మంజూరు చేయనున్నారు. 1.50 లక్షలకు పైగా జనాభా ఉన్న మండలాల్లో ఈ సౌకర్యం వర్తించనుంది. అలాగే, 2.5 లక్షలకుపైగా సర్క్యులేషన్ ఉన్న పత్రికలకు రాష్ట్రస్థాయిలో క్రీడలు, సంస్కృతిక, సినిమాల విభాగాల్లో ఒక్కో అదనపు అక్రిడిటేషన్ కార్డు ఇవ్వాలని నిర్ణయించారు.75,001 నుంచి 2.5 లక్షల వరకు సర్క్యులేషన్ ఉన్న పత్రికలకు కూడా రాష్ట్రస్థాయిలో క్రీడలు లేదా సంస్కృతిక లేదా సినిమాల విభాగంలో ఒక అదనపు అక్రిడిటేషన్ కార్డు ఇవ్వనున్నారు.

### రాష్ట్ర కమిటీలో ప్రెస్ క్లబ్ ప్రతినిధికి ప్రాతినిధ్యం

రాష్ట్ర మీడియా అక్రిడిటేషన్ కమిటీ (ఎస్‌ఎంఎసి) ఏర్పాటులోను ప్రభుత్వం మార్పులు చేసింది. కమిటీలో హైదరాబాద్ ప్రెస్ క్లబ్ ప్రతినిధి, పెద్ద దినపత్రికల డెస్క్ జర్నలిస్టుల ప్రతినిధికి సభ్యులుగా ఉంటారు.అలాగే నిబంధనలలో ఉన్న ఉర్దూ బిగ్ న్యూస్‌పేపర్ అనే పదాన్ని ఉర్దూ డైలీ న్యూస్‌పేపర్‌గా మార్చారు. ఈ మార్పుల అమలుకు అవసరమైన తదుపరి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర సమాచార, పౌరసంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్‌ను ప్రభుత్వం ఆదేశించింది.

## రికార్డు స్థాయిలో ప్రగతి సాధించాం : జిఎం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** దక్షిణ మధ్య రైల్వే సరుకు రవాణా, ప్రయాణికుల విభాగాల్లో చరిత్రలోనే రికార్డు స్థాయి ప్రగతి సాధించిందని జనరల్ మేనేజర్ సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ పేర్కొన్నారు. సికింద్రాబాద్‌లోని రైల్వే స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరిగిన గణతంత్ర దినోత్సవం సందర్భంగా సంజయ్ కుమార్ శ్రీవాస్తవ త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..గత ఏడాది ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకు రూ.15,579 కోట్ల స్థూల ఆదాయం నమోదు కాగా, ఇది గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంతో పోలిస్తే 4 శాతం వృద్ధి అని తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025–26)లో జోన్ చరిత్రలో తొలిసారిగా కేవలం 257 రోజుల్లోనే సరుకు రవాణా 100 మిలియన్ టన్నుల మైలురాయిని అధిగమించడం గర్వకారణమని చెప్పారు. భద్రతను మరింత పెంపొందించే దిశగా, ఈ ఆర్థిక సంవత్సరం డిసెంబర్ వరకు 643 కిలోమీటర్ల ట్రాక్ పునరుద్ధరణ పూర్తయిందని, అలాగే 30 కిలోమీటర్ల డబ్లింగ్, 115 కిలోమీటర్ల ట్రిప్లింగ్, 2 కిలోమీటర్ల బైపాస్ లైన్ పనులు పూర్తి చేశామని వివరించారు.ప్రయాణికుల సౌకర్యార్థం ఏప్రిల్–డిసెంబర్ మధ్య కాలంలో 39 లిఫ్టులు, 19 ఎస్కలేటర్లు ప్రారంభించామని, దీంతో జోన్ వ్యాప్తంగా మొత్తం 241 లిఫ్టులు, 100 ఎస్కలేటర్లు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. చర్లపల్లి నుంచి ముజఫర్‌పూర్, తిరువనంతపురం దిశగా రెండు నూతన అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను ప్రారంభించినట్లు చెప్పారు.

## రౌడీషీట్ రద్దు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రజలను ప్రభావితం చేసే నేరాలకు పాల్పడే వ్యక్తిపై రౌడీ షీట్ లేదా అనుమానిత షీట్ తెరవడానికి పోలీసులకు అధికారం ఉందని హైకోర్టు తేల్చింది. శాంతి లేదా ప్రశాంతతను దెబ్బతీసే నేరాలు చేసే వ్యక్తిపై రౌడీషీట్ ఓపెన్ చేసే అధికారం పోలీసులకు ఉందని, అయితే, ఆ అధికారం సంపూర్ణమైనది చెప్పింది.. రౌడీషీట్ ఓపెన్ చేసేప్పుడు చట్టం ప్రకారం నిబంధనలను పాటించాలంది. హైదరాబాద్‌లోని తలబ్కట్టాకు చెందిన 29 ఏళ్ల మహమ్మద్ ఖలీద్‌పై రౌడీ షీట్ నమోదు చేయడాన్ని రద్దు చేసింది. రౌడీషీట్ పెట్టాక ఆరు నెలలకు ఒకసారి పోలీసులు సమీక్షించి కొనసాగించాలో లేదో నిర్ణయం తీసుకోవాలని, సమీక్ష చేయకుండా రౌడీషీట్ కొనసాగింపు సరికాదని తీర్పులో పేర్కొంది. ఏడు క్రిమినల్ కేసుల్లో ప్రమేయం ఉన్నందుకు 2008లో పోలీసులు ఖలీద్‌పై అనే వ్యక్తిపై రౌడీ షీట్ తెరిచారు. అప్పటి నుండి ఎటువంటి సమీక్ష లేకుండా షీట్‌ను కొనసాగించడం, యాంత్రికంగా దానిని పొడిగించడం సరికాదని హైకోర్టు స్పష్టం చేసింది. పిటిషనర్ 2019లో నిర్దోషిగా విడుదలయ్యారని, ప్రస్తుతం అతనిపై కేసులు లేవని చెప్పింది. దీంతో పిటిషనర్‌పై ఉన్న రౌడీ షీట్‌ను కొట్టివేస్తూ, జస్టిస్ ఎన్ తుకారాంజీ తీర్పు చెప్పారు. ఈ విషయాన్ని సంబంధిత రికార్డుల్లో నమోదు చేయాలంది. పిటిషనర్ పేరును నౌడీ షీట్ లిస్ట్ నుంచి తక్షణమే తొలగించాలంది.

## రాహుల్‌గాంధీ రాష్ట్ర పర్యటనను అడ్డుకుంటాం

### బిసి జెఎసి చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ డిమాండ్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రస్తుతం జరిగే మున్సిపల్ ఎన్నికల్లో బిసిలకు జనాభా దామాషా ప్రకారం 56 శాతం టికెట్లు ఇవ్వకుంటే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తెలంగాణ రాష్ట్ర పర్యటనను అడ్డుకుంటామని బిసి జెఎసి చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ హెచ్చరించారు. హైదరాబాద్‌లోని అ భినంద్ గ్రాండ్ హోటల్‌లో సోమవారం బిసి జెఎసి కో చైర్మన్ ఉప్పరి శేఖర్ సగర అధ్యక్షతన జరిగిన మీడియా సమావేశంలో జెఎసి వర్కింగ్ చైర్మన్ గుజ్జకృష్ణలతో కలిసి శ్రీనివాస్ గౌడ్ మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిసిల ఓట్ల కోసం అధికారంలోకి రాకముం దు దేశంలో కులగణన జరగాలని, ఎవరి వాటా వారికి దక్కాలని రాహుల్ గాంధీ ఊరూరా ప్రచారం చేశాడని, తెలంగాణలోను రాహుల్ గాంధీ ఇదే విషయం పదేపదే చెప్పి బిసిల ఓట్లు వేయించుకున్నారన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీని విస్మరించి బిసిలకు అన్యాయం చేస్తూ, గ్రామపంచాయతీ ఎన్నికలు నిర్వహించారని, అలాగే ప్రస్తుతం మున్సిపల్ ఎన్నికలు నిర్వహించడం కోసం రేపో మాపో ఎన్నికల నోటిఫికేషన్ కూడా విడుదల చేస్తామని చెప్పడం చాలా అన్యాయమని మండిపడ్డారు.బిసి విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షులు తాటికొండ విక్రమ్ గౌడ్ మాట్లాడుతూ రాహుల్ గాంధీ బిసిలకు ఇచ్చిన మాట నిలుపుకోవాలని, హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిసి సంక్షేమ సంఘం కార్యనిర్వహక అధ్యక్షులు కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, బిసి యువజన సంఘం జాతీయ అధ్యక్షులు కనకాల శ్యామ్ కురుమ, బిసి జెఎసి వైస్ చైర్మన్ పిట్ల శ్రీధర్, బిసి యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెం శ్రీనివాస్ గౌడ్‌తదితరులు పాల్గొన్నారు.

## కాంగోలో ఎడిఎఫ్ ఉగ్రవాదుల పైశాచికత్వం

**గోమా:** తూర్పు కాంగోలో ఉగ్రవాదులు చేసిన దాడిలో 25 మంది మరణించారు. ఇస్లామిక్ స్టేట్ సంస్థ మద్దతు ఉన్న ఉగ్రవాదుల గ్రూపు ఎడిఎఫ్ (డెమోక్రటిక్ ఫోర్స్ అనుబంధ గ్రూపు) ఆదివారం తెల్లారుజామున ఇటురి రాష్ట్రంలో చేసిన దాడుల్లో వీరంతా మరణించారు. ఐతే వీరిలో 15 మంది పురుషులను ఉగ్రవాదులు ఇళ్ళల్లోనే బంధించి నిప్పుపెట్టి సజీవ దహనం చేశారు. ఇదే రాష్ట్రంలోని ఇరుము ప్రాంతంలో ఉన్న అపకులు గ్రామంలో ఏడుగురిని కాల్చి చంపారు. మిగిలిన ముగ్గురూ వాలెస్ వొంకుటు పాలనాప్రాంతంలో వారు. వారిని కూడా కాల్చి చంపారు. పశ్చిమ ఉగాండా, తూర్పు డెమోక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగోలో డెమోక్రటిక్ ఫోర్స్ అని పేరు పెట్టుకున్నప్పటికీ వీరిలో ఎక్కువమంది ఉగ్రవాదులే. వారిని ఐఎస్–క్యాప్ లేదా ఐఎస్–డిఆర్‌సి పిలుస్తారు.

# అలరించిన శకటాల ప్రదర్శన














**న్యూఢిల్లీ:** భారత 77వ గణతంత్ర దినోత్సవ పరేడ్ ఢిల్లీలోని కర్తవ్య పథ్‌లో సోమవారం అంగరంగ వైభవంగా జరిగింది. ఈసందర్భంగా పలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విభాగాలు ప్రదర్శించిన 30 శకటాలు అలరించాయి. వీటిలో 4 శకటాలు వందేమాతరం థీమ్‌తో, మరో 7 శకటాలు ఆత్మనిర్భర్ భారత్ థీమ్‌తో ఆకట్టుకున్నాయి. మిగతా శకటాలను రాష్ట్రాల సంస్కృతులు, సంప్రదాయాలు, కళలను అద్దంపట్టేలా, ప్రభుత్వ పథకాల విజయాన్ని చాటిచెప్పేలా కళాత్మకంగా రూపొందించారు. మొత్తం 30 శకటాల్లో 17 రాష్ట్రాలు/కేంద్ర పాలిత ప్రాంతాలవి కాగా, 13 కేంద్ర మంత్రిత్వ శాఖలవి.

**పుదుచ్చేరి:** కేంద్రపాలిత ప్రాంతం పుదుచ్చేరికి చెందిన శకటం అక్కడి సంస్కృతి, సంప్రదాయ హస్తకళల వారసత్వాన్ని అద్దంపట్టింది. యునెస్కో గుర్తింపు పొందిన ఆరో విల్ టౌన్‌షిప్ నమూనాను ఇందులో హైలైట్ చేశారు. కులం, మతం, రాజకీయాలకు అతీతంగా మానవ ఐక్యతను ప్రదర్శించే ప్రతీకగా ఆరో విల్‌ను చూపించారు.

**తమిళనాడు:** 'అభివృద్ధి మంత్రం : స్వయం సమృద్ధ భారత్ ఈవీ మ్యానుఫ్యాక్చరింగ్ హబ్' అనే థీమ్‌తో తమిళనాడు రాష్ట్ర సర్కారు శకటాన్ని ప్రదర్శించింది. ప్రత్యేకించి ఎలక్ట్రిక్ వాహనాల తయారీ హబ్‌గా రాష్ట్రం మారుతున్న తీరును ఇందులో చూపించారు.

**కేరళ:** వాటర్ మెట్రో 100 శాతం **డిజిటల్:** ఆత్మనిర్భర్ కేరళ ఫర్ ఆత్మనిర్భర్ భారత్' థీమ్‌తో కేరళ రాష్ట్ర సర్కారు శకటాన్ని ప్రదర్శించింది. కొచ్చి పరిధిలోని అన్ని ద్వీపాలను వాటర్ మెట్రో వ్యవస్థకు చెందిన బోట్ల ద్వారా అనుసంధానించిన తీరును ఇందులో చూపించారు. వాటర్ మెట్రో వ్యవస్థను నూటికి నూరుశాతం డిజిటలైజ్ చేసిన అంశాన్ని శకటంలో హైలైట్ చేశారు.

**మహారాష్ట్ర :** 'గణేశోత్సవ్ : ఆత్మనిర్భరతకు ప్రతీక' అనే థీమ్‌తో శకటాన్ని మహారాష్ట్ర ప్రభుత్వం ప్రదర్శించింది. గణేశోత్సవ్‌లో ఢంకా బజాయిస్తున్న మహిళ ప్రతిమను ఇందులో హైలైట్ చేశారు.

**ఒడిశా:** 'నేల నుంచి సిలికాన్ దాకా : సంప్రదాయంతో మమేకం, వైవిధ్యంతో వికాస పయనం' అనే థీమ్‌తో ఒడిశా రాష్ట్రం శకటాన్ని ప్రదర్శించింది. ఈ సందేశాన్ని చెబుతున్న విధంగా ఒకరి వెనుక మరొకరు నిలబడిన మహిళల ప్రతిమలను ఇందులో హైలైట్ చేశారు.

**గుజరాత్:** 'స్వతంత్రతా కా మంత్ర వందేమాతరం' అనే థీమ్‌తో గుజరాత్ రాష్ట్రం శకటాన్ని ప్రదర్శించింది. ఇందులో భారత స్వాతంత్ర్య సమరయోధురాలు భిఖాజీ కామా ప్రతిమను హైలైట్ చేశారు. 1906 నుంచి 1947 వరకు భారత జాతీయ పతాకం రూపాంతరం చెందిన తీరును ఇందులో చూపించారు. శకటంపై గాంధీజీ, చరఖా, అశోక ధర్మ చక్రం ప్రతిమలను కూడా ప్రదర్శించారు. వందేమాతర గేయం 150 వసంతాలను పూర్తి చేసుకున్న అంశాన్ని చూపించారు.

**మధ్యప్రదేశ్:** 'పుణ్య శ్లోక్ లోకమాతా దేవి అహల్యా బాయి హోల్కర్' థీమ్‌తో మధ్యప్రదేశ్ రాష్ట్ర సర్కారు శకటాన్ని ప్రదర్శించింది. అహల్యాబాయి శివలింగాన్ని చేతుల్లో పట్టుకున్న ప్రతిమను ఇందులో హైలైట్ చేశారు. మాల్వా రాజ్యపు రాణిగా ఆమె అందించిన సేవలను గుర్తుచేసేలా ఈ శకటాన్ని తీర్చిదిద్దారు.

**ఛత్తీస్‌గఢ్ :** 'స్వాతంత్ర్య మంత్రం : వందేమాతరం' అనే థీమ్‌తో ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర సర్కారు శకటాన్ని ప్రదర్శించింది. ఇందులో ధుర్వ సామాజిక వర్గం దిగ్గజ నేత వీర్ గుండాధుర్ ప్రతిమను హైలైట్ చేశారు. 1910లో జరిగిన భూమ్కల్ తిరుగుబాటుకు ఆయనే సారథ్యం వహించారు.

**ఉత్తర్‌ప్రదేశ్:** 'బుందేల్‌ఖండ్ సంస్కృతి' అనే థీమ్‌తో ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్ర సర్కారు శకటాన్ని ప్రదర్శించింది. బుందేల్‌ఖండ్ ప్రాంతంలోని కాళింజర్‌లో ఉన్న ఏకముఖ లింగం, అక్కడి హస్తకళలు, కాళింజర్ కోట, నీలకంఠ మహాదేవ ఆలయాలను శకటంపై హైలైట్ చేశారు.

బెంగాల్ : 'భారత స్వాతంత్ర్య ఉద్యమంలో బెంగాల్' అనే థీమ్‌తో బంగాల్ రాష్ట్ర సర్కారు శకటాన్ని ప్రదర్శించింది. వందేమాతరం గేయాన్ని రచించిన స్వాతంత్ర్య సమరయోధుడు బంకిమ్ చంద్ర ఛటోపాధ్యాయ్ ప్రతిమను ఇందులో హైలైట్ చేశారు. దేశ స్వాతంత్ర్య ఉద్యమం సందర్భంగా బెంగాల్‌లో చోటుచేసుకున్న చారిత్రక ఘట్టాలను శకటంపై ప్రదర్శించారు.

**రాజస్థాన్:** 'ఒంటెల స్వారీ, గోల్డెన్ ఆర్ట్' అనే థీమ్‌తో రాజస్థాన్ రాష్ట్ర సర్కారు శకటాన్ని ప్రదర్శించింది. ఒంటెలపై స్వారీ చేస్తున్న మనుషుల ప్రతిమలను ఇందులో హైలైట్ చేశారు. బికనీర్‌కు చెందిన ఉస్తా కళారూపాలను ప్రత్యేకంగా చూపించారు.

**పంజాబ్:** 'శ్రీ గురుతేజ్ బహదూర్ అమర వీరుడైన 350వ వసంతం అనే థీమ్‌తో పంజాబ్ రాష్ట్ర సర్కారు శకటాన్ని ప్రదర్శించింది. శ్రీ గురుతేజ్ బహదూర్ ఆశీర్వాదాన్ని అందించే హస్తం ప్రతిమను ఇందులో హైలైట్ చేశారు. ఏక్ ఓంకార్, హింద్ దీ చాదర్, షాబాద్ కీర్తన్, గురుద్వారా సిస్ గంజ్ సాహిబ్, గురుతేజ్ బహదూర్ సహచరుల త్యాగాల ప్రతిమలను ఈ శకటంపై చూపించారు.

**హిమాచల్ ప్రదేశ్ :** 'హిమాచల్ ప్రదేశ్ దేవ భూమి, వీర భూమి' అనే థీమ్‌తో ఈ రాష్ట్రం శకటాన్ని ప్రదర్శించింది. భారత సాయుధ దళాల్లో రాష్ట్ర ప్రజలు అందించిన సేవలను గుర్తు చేసుకుంటూ గ్యాలంటరీ అవార్డులు గెల్చుకున్న సైనికుల ప్రతిమలను ఇందులో హైలైట్ చేశారు.

**జమ్ముకశ్మీర్:** 'హస్తకళలు, జానపద నృత్యాలు' అనే థీమ్‌తో జమ్ముకశ్మీర్ శకటాన్ని ప్రదర్శించారు. ఇక్కడి హస్తకళలు, జానపద నృత్యాలను ఇందులో హైలైట్ చేశారు. కశ్మీరు సాంస్కృతిక వైవిధ్యాన్ని, సామాజిక సమీకరణాలను చాటేలా శకటాన్ని అలంకరించారు.



**అసోం:** 'ఆశిరా కాండీ : హస్తకళా గ్రామం' థీమ్‌తో అసోం సర్కారు శకటాన్ని ప్రదర్శించింది. ధుబ్రి జిల్లా అనేది ఆశిరా కాండీ ఎర్రమట్టి హస్తకళా ఉత్పత్తుల తయారీకి పెట్టింది పేరు. వీటినే శకటంపై హైలైట్ చేశారు. అసోం ప్రాచీన నదీ వారసత్వాన్ని గుర్తుచేసేలా నెమలి ఆకారంలోని బోటు నమూనాను కూడా శకటంపై ప్రదర్శించారు.

**మణిపూర్:** 'వికాసం దిశగా పయనం : పంట పొలాల నుంచి అంతర్జాతీయ మార్కెట్ల దాకా' అనే థీమ్‌తో మణిపూర్ శకటాన్ని ప్రదర్శించారు. రైతుల పంట దిగుబడిని పెంచడంలో మణిపూర్ సాధించిన వికాసాన్ని ఇందులో హైలైట్ చేశారు.

**నాగాలాండ్:** 'హార్న్‌బిల్ ఫెస్టివల్ సాంస్కృతిక వికాసం, పర్యాటక పురోగతి, ఆర్థిక స్వయం సమృద్ధిలతో కూడిన వేడుక' అనే థీమ్‌తో నాగాలాండ శకటాన్ని ప్రదర్శించింది. రాష్ట్ర పక్షి బ్లిత్స్ ట్రాగోపన్ ప్రతిమను ఇందులో హైలైట్ చేశారు.



## కేంద్ర ప్రభుత్వ శకటాల థీమ్‌లు

* యుద్ధాలలో వీరత్వాన్ని చూపించి దేశ నిర్మాణానికి పాటు పడిన సైనిక యోధులను గుర్తు చేసుకుంటూ దేశ వాయుసేన శకటాన్ని ప్రదర్శించింది.
* సముద్రం నుంచి సమృద్ధి వరకు అనే థీమ్‌తో దేశ నౌకాదళం శకటాన్ని ప్రదర్శించింది.
* త్రివిధ దళాల సంయుక్త పోరాటంతో ఆపరేషన్ సిందూర్‌లో సాధించిన విజయాన్ని సైనిక వ్యవహారాల విభాగం శకటంలో చూపించారు.
* గుజరాత్‌లోని భుజ్‌లో భూకంపం వచ్చి 25 ఏళ్లు గడిచాయి. అప్పట్లో ఎన్‌డీఎంఏ, ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది సాహసోపేతంగా సహాయక చర్యలను చేపట్టారు. ఆ సందర్భాన్ని గుర్తు చేసుకుంటూ శకటాన్ని కేంద్ర హోం శాఖ ప్రదర్శించింది.
* భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక సురక్షా సంహిత, భారతీయ సాక్ష్య అధినియం అనే మూడు కొత్త చట్టాలు దేశంలో అమల్లోకి వచ్చిన అంశాన్ని గుర్తు చేస్తూ ఒక శకటాన్ని కేంద్ర హోంశాఖ ప్రదర్శించింది.
* కేంద్ర సాంస్కృతిక, పట్టణ వ్యవహారాల శాఖలు వందేమాతరం థీమ్‌తో శకటాలను ప్రదర్శించాయి.
* కేంద్ర విద్య, పంచాయతీరాజ్, ఇంధన, నైపుణ్య వికాస శాఖలు ఆత్మనిర్భర్ భారత్, వికసిత భారత్ థీమ్‌లతో శకటాలను ప్రదర్శించాయి.
* ఆయుష్ కా తంత్ర, స్వాస్థ్ కా మంత్ర అనే థీమ్‌తో కేంద్ర ఆయుష్ శాఖ శకటాన్ని ప్రదర్శించింది.
* భారత్ కథ : శ్రుతి, క్రితి, ద్రిష్టి అనే థీమ్‌తో కేంద్ర సమాచార ప్రసార శాఖ శకటాన్ని ప్రదర్శించింది.

### శుభాన్షు శుక్లాకు
# అశోక చక్ర ప్రదానం

**న్యూఢిల్లీ :** అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలోని అడుగుపెట్టిన తొలి భారతీయుడు గ్రూప్ కెప్టెన్ శుభాన్షు శుక్లాను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము దేశ అత్యున్నత శౌర్య పురస్కారం అశోక చక్రతో గౌరవించారు. దేశ రాజధాని న్యూఢిల్లీలో జరిగిన గణతంత్ర దినోత్సవంలో కెప్టెన్ శుభాన్షు శుక్లాకు ఆమె ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి వెళ్లేందుకు యాక్సియమ్4 మిషన్ చేపట్టిన సమయంలో గ్రూప్ కెప్టెన్ శుభాన్షు శుక్లా అసాధారణ ధైర్యంతో పాటు ఆయన సంకల్పానికి గౌరవంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సత్కరించారు. ఈ మేరకు రాష్ట్రపతి భవన్ ఎక్స్ వేదికగా వెల్లడించింది. 2025 జూన్‌లో 'యాక్సియమ్4' మిషన్ ద్వారా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలోకి శుభాన్షు శుక్లా అడుగుపెట్టారు. దాదాపు 18 రోజుల పాటు ఆయన అక్కడే ఉండి అంతరిక్ష పరిశోధనలకు అవసరమైన కీలక ప్రయోగాలు చేశారు. ఖగోళంలో జీరో గ్రావిటీ పరిస్థితుల్లో మానవ కండరాలకు కలిగే నష్టం, మానవ జీర్ణ వ్యవస్థ ఎలా పని చేస్తుందనే అంశాలపై ఆయన వీడియో చిత్రీకరించారు. అలాగే అంతరిక్షంలో మానవ వ్యోమగాముల పరిస్థితిపై సైతం ఆయన అధ్యయనం చేశారు.



## ఆకట్టుకున్న మోదీ తలపాగా, ఉర్సులా డ్రెస్

**న్యూఢిల్లీ:** దేశంలో గణతంత్ర వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ ధరించిన తలపాగా అందరి దృష్టిని ఆకర్షించింది. అలాగే ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఐరోపా కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డెర్ లేయెన్ భారతీయత ఉట్టిపడేలా డ్రెస్ ధరించారు. ప్రధాని మోదీ ప్రకాశవంతమైన ఎరుపు, పసుపు, ఊదా, ఆకుపచ్చ రంగులు కలగలిసిన తలపాగాను ధరించారు. జరీతో నేసిన బంగారు రంగు మోటిఫ్‌లతో అది ఆకర్షణీయంగా కనిపించింది. ఈ రాజస్థానీ సంప్రదాయ తలపాగా.. పండగ వాతావరణాన్ని ప్రతిబింబించింది. అందులోని ఎరుపు.. అభిరుచి, ఉత్సుకత, ధైర్యసాహసాలకు నిదర్శనంగా చెప్తారు. అలాగే ముదురునీలం, తెలుపు రంగుల్లో ఉన్న కుర్తా పైజామా ధరించారు. పైన లేత నీలంలో ఉన్న జాకెట్ వేసుకున్నారు. మరోవైపు ఉర్సులా.. మెరూన్ రంగులో గోల్డ్ డిజైన్ చేసిన డ్రెస్ ధరించారు. ఈ వస్త్రధారణతో ఈ వేడుకకు తగ్గట్టుగా ఆమెలో భారతీయ సంప్రదాయం ఉట్టిపడింది. ఆమె సాధారణంగా ధరించే ప్యాంట్ సూట్స్‌కు భిన్నంగా ఈ దుస్తులు వేసుకున్నారు.



### భారత్–అమెరికాల మధ్య చారిత్రాత్మక అనుబంధం

"భారతదేశానికి 77వ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు. అమెరికా ప్రజల తరఫున భారత ప్రభుత్వానికి, ప్రజలకు నా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. ప్రపంచంలోనే పురాతన, అతి పెద్ద ప్రజాస్వామ్యదేశాలుగా అమెరికా, భారతదేశం చారిత్రాత్మక అనుబంధాన్ని పంచుకుంటున్నాయి."

**– అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్**

### భారత–చైనాలు మంచి ఇరుగుపొరుగులు

"భారతదేశం, చైనా 'మంచి ఇరుగుపొరుగులు, స్నేహితులు, భాగస్వాములు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు శుభాకాంక్షలు. డ్రాగన్, ఏనుగు కలిసి నృత్యం చేయడమనేది ఇరు దేశాలకు సరైన ఎంపిక. ఉభయ దేశాలు, ప్రజల మౌలిక ప్రయోజనాలను సమరేఖలో మెరుగుపడడం, అభివృద్ధి చెందడం కొనసాగుతోంది. ఇది ప్రపంచ శాంతి, శ్రేయస్సును కొనసాగించడంలో, ప్రోత్సహించడంలో గొప్ప ప్రాముఖ్యత కలిగి ఉంది. ఉభయపక్షాలు సహకారంలో భాగస్వామ్యం, అభివృద్ధిలో అవకాశాల విషయంలో ఏకాభిప్రాయానికి కట్టుబడి ఉండడం ముఖ్యం"

**– జిన్హువా వార్తాసంస్థతో చైనా అధ్యక్షుడు షీ జిన్ పింగ్**

### వ్యూహాత్మక భాగస్వామ్య బలానికి శక్తివంతమైన..

"హ్యాపీ రిపబ్లిక్ డే ఇండియా! భారత రాజ్యాంగం, ప్రజాస్వామిక స్ఫూర్తి ఉత్సవాలు జరుగుతున్న సందర్భంలో రిపబ్లిక్ డే పరేడ్‌కు మొదటిసారి హాజరవ్వటాన్ని గౌరవంగా భావిస్తున్నాను. అమెరికా రూపొందించిన ఎయిర్ క్రాఫ్ట్‌లు భారతీయ గగనంలో దూసుకపోవటాన్ని చూసి ఉద్వేగానికి గురయ్యా. ఇది అమెరికా – భారత వ్యూహాత్మక భాగస్వామ్య బలానికి శక్తివంతమైన సంకేతం"

**– భారత్‌లో అమెరికా రాయబారి సెర్జియో గోర్**

## ప్రజాహక్కుల రక్షణకు 'రాజ్యాంగం' కవచం

ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ



**న్యూఢిల్లీ:** రాజ్యాంగం ప్రతి భారతీయుడికి గొప్ప ఆయుధం, కవచం అని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ పేర్కొన్నారు. రాజ్యాంగాన్ని రక్షించాలనే సంకల్పం శిలలా బలమైనదన్నారు. భారత 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే జాతీయ జెండాను ఆవిష్కరించారు. మన రాజ్యాంగ సూత్రాలు, స్ఫూర్తిని రక్షించడంలో దృఢంగా నిలబడటం ఈ సమయంలో అవసరమన్నారు. 'న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సోదరభావం మన వ్యవస్థాపక పితామహులు మనకు అందించిన శాశ్వత విలువలు. వాటిని రక్షించడం మన పవిత్ర కర్తవ్యం. రాజ్యాంగాన్ని కాపాడుకోవడానికి అవసరమైన ప్రతి త్యాగం చేయడానికి మనం సిద్ధంగా ఉండాలి' అని ఖర్గే ఎక్స్‌లో హిందీలో పోస్ట్ చేశారు. 'ఇది మన పూర్వీకుల త్యాగాలకు మా నిజమైన నివాళి అవుతుంది' అని ఆయన అన్నారు. మరోసారి హృదయపూర్వకంగా గణతంత్ర దినోత్సవం శుభాకాంక్షలు తెలియజేస్తున్నానన్నారు. రాహుల్‌గాంధీ కూడా శుభాకాంక్షలు తెలిపారు. 'మన రాజ్యాంగం ప్రతి భారతీయుడికి గొప్ప ఆయుధం. అది మన గొంతు, మన హక్కులను కాపాడే కవచం. మన గణతంత్రం ఈ బలమైన పునాదిపై నిలుస్తుంది. సమానత్వం, సామరస్యం ద్వారా మాత్రమే బలోపేతం అవుతుంది' అని గాంధీ ఎక్స్‌లో హిందీలో పోస్ట్‌లో అన్నారు. రాజ్యాంగాన్ని రక్షించడం అంటే భారత గణతంత్రాన్ని రక్షించడం అని, ఇది మన స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలకు నిజమైన నివాళి అని అన్నారు. జై హింద్! జై సంవిధాన్! అని కర్తవ్య పథంలో జరిగిన గణతంత్ర దినోత్సవ కవాతుకు హాజరైన ప్రతిపక్ష నేత అన్నారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా కూడా గణతంత్ర దినోత్సవం సందర్భంగా పౌరులకు స్వాగతం పలికారు. 'నేడు మన రాజ్యాంగం అమలులోకి వచ్చింది. ప్రతి భారతీయుడికి స్వేచ్ఛ, సమానత్వం, న్యాయం, సోదరభావం విలువలను హామీ ఇస్తుంది. మన రాజ్యాంగం 140 కోట్ల మంది భారతీయులందరినీ రక్షించే కవచం. దానిని రక్షించాలనే మా సంకల్పం ఒక శిలలా బలంగా ఉంది. రాజ్యాంగం వర్థిల్లాలి! జై హింద్!' అని ఆమె ఎక్స్‌పై హిందీలో పోస్ట్‌లో అన్నారు.

## కర్తవ్యపథ్ వెంబడి ఎన్‌క్లోజర్లకు నదుల పేర్లు

**న్యూఢిల్లీ:** గణతంత్ర దినోత్సవ పరేడ్ కోసం కర్తవ్య మార్గం వెంబడి ఏర్పాటు చేసిన ఎన్‌క్లోజర్‌లకు గంగా, యమునా, కృష్ణ, నర్మద, పెరియార్ వంటి భారతదేశ నదుల పేర్లు పెట్టారు. కవాతు వేదిక సమీపంలోని వీధుల్లో లేఅవుట్ మ్యాప్‌లు, బ్యానర్‌లను ఉంచారు. తద్వారా అతిథులను వారి ఎన్‌క్లోజర్‌లకు మార్గనిర్దేశం చేశారు. సాంప్రదాయ ఆచారం నుండి నిష్క్రమించి, ఎన్‌క్లోజర్‌లను గుర్తించడానికి వివిఐపి, ఇతర లేబుల్‌లను ఉపయోగించలేదు. బదులుగా, వీటికి భారతదేశంలో ప్రవహించే నదుల పేర్లు పెట్టారని రక్షణ మంత్రిత్వ శాఖ సీనియర్ అధికారులు ఈ నెల ప్రారంభంలో తెలిపారు. వీటిలో బియాస్, బ్రహ్మపుత్ర, చంబల్, చీనాబ్, గండక్, గంగా, ఘాగ్రా, గోదావరి, సింధు, జీలం, కావేరి, కోసి, కృష్ణ, మహానది, నర్మద, పెన్నార్, పెరియార్, రావి, సోన్, సట్లెజ్, తీస్తా, వైగై, యమునా ఉన్నాయి. అదేవిధంగా, ఈనెల 29న జరిగే బీటింగ్ రిట్రీట్ వేడుక కోసం, బాన్సూరి, డమరు, ఏక్తారా, ఎస్రాజ్, మృదంగం, నాగడ, పఖావాజ్, సంతూర్, సారంగి, సరిందా, సరోద్, షెహనాయ్, సితార్, సుర్బహార్, తబలా, వీణ వంటి భారతీయ వాయిద్యాలపై ఎన్‌క్లోజర్‌లకు పేర్లు పెట్టనున్నారు. 'వందేమాతరం' 60వ వార్షికోత్సవం ఈ సంవత్సరం గణతంత్ర దినోత్సవ వేడుకలకు ప్రధాన ఇతివృత్తం. కర్తవ్య మార్గం వెంబడి పాత చిత్రాలను ప్రదర్శించే ఎన్‌క్లోజర్ నేపథ్యాలు, దాని ప్రారంభ చరణాలను వివరిస్తాయి. 'వందేమాతరం'ను 1875లో బంకిం చంద్ర ఛటర్జీ స్వరపరిచిన విషయం తెలిసిందే. 'వందేమాతరం'తో పాటు 'సారే జహాన్ సే అచ్చా', 'కదం కదం బఢాయి జా', ఇతర పాటల ట్యూన్‌లు లౌడ్‌స్పీకర్లలో 'వందేమాతరం'తో పాటు ప్లే చేశారు. ఇది ఈ సందర్భంగా దేశభక్తి ఉత్సాహాన్ని పెంచింది. యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డెర్ లేయన్, యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో కోస్టా ఈ కవాతుకు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.



**వందేమాతరం ప్రారంభ చరణాల చిత్రీకరణ**

గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో కర్తవ్య మార్గం వెంబడి ఉన్న ఆవరణకు 'వందేమాతరం' ప్రారంభ చరణాలను చిత్రీకరిస్తూ కళాకారుడు తేజేంద్ర కుమార్ మిత్రా గీసిన పాత చిత్రాల ప్రింట్లు అలంకరించారు. 1875లో బంకిం చంద్ర ఛటర్జీ రాసిన 'వందేమాతరం' స్వాతంత్ర్య ఉద్యమ సమయంలో ఒక ర్యాలీ నినాదంగా మారింది. దీనిని 1950లో రాజ్యాంగ సభ భారత జాతీయ గీతంగా స్వీకరించింది. ఈ సంవత్సరం ఉత్సవ కవాతులో 'వందేమాతరం' నూటయాభైవ వార్షికోత్సవం ప్రధాన ఇతివృత్తం. ఇక్కడ ఉత్సవ కవాతుకు ఆహ్వాన కార్డులు పాట నూటయాభైవ వార్షికోత్సవం లోగోను, ఛటర్జీ సిల్హౌట్ చిత్రం, 'వందేమాతరం' వాటర్‌మార్క్‌గా ఏర్పాటు చేశారు. అలాగే, జనవరి 19 నుండి 26 వరకు అనేక నగరాల్లో జరిగిన సైనిక, కేంద్ర సాయుధ పోలీసు దళాల బ్యాండ్‌ల ప్రదర్శనలు 'వందేమాతరం' అనే థీమ్‌పై ఉన్నాయి.

## ఢిల్లీలో 30 వేల మందితో భద్రత

**న్యూఢిల్లీ:** గణతంత్ర దినోత్సవ వేడుకల కోసం ఢిల్లీ పోలీసులు నగరవ్యాప్తంగా 30,000 మందికి పైగా సిబ్బందిని బహుళ అంచెల భద్రతా వలయంలో మోహరించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అప్రమత్తమయ్యారు. సెరిమోనియల్ పరేడ్ రూట్, హైసెక్యూరిటీ జోన్‌లను కలిగి ఉన్న న్యూఢిల్లీ జిల్లాలోనే దాదాపు 10,000 మంది పోలీసు సిబ్బందిని మోహరించినట్లు అధికారులు తెలిపారు. అదనపు పోలీసు కమిషనర్ (న్యూఢిల్లీ) దేవేష్ కుమార్ మహాలా మాట్లాడుతూ 'గణతంత్ర దినోత్సవ వేడుకల భద్రతకు న్యూఢిల్లీ ప్రాంతంలో దాదాపు 10,000 మంది పోలీసు సిబ్బందిని మోహరించామన్నారు. పికెట్లు, బారికేడ్లు, అన్ని ప్రామాణిక ఆపరేటింగ్ విధానాలు అమలులో ఉన్నాయని చెప్పారు. విస్తరణ ప్రణాళికలు, పాయింట్ల వారీగా బ్రీఫింగ్‌లు, ఆకస్మిక చర్యలను సిబ్బంది అందరికీ వివరించామన్నారు. రిహార్సల్స్ కూడా నిర్వహించామని చెప్పారు. పరేడ్‌రూట్, సమీప ప్రదేశాలతో సహా న్యూఢిల్లీ ప్రాంతంలో అధునాతన వీడియో విశ్లేషణలు, ముఖ గుర్తింపు వ్యవస్థ (ఎఫ్ఆర్ఎస్)తో కూడిన 3,000 కంటే ఎక్కువ సిసిటివి కెమెరాలను ఏర్పాటు చేసినట్లు ఆయన చెప్పారు. ఈ కెమెరాల నుండి ప్రత్యక్ష ప్రసారాలను దాదాపు 150 మంది సిబ్బంది నిర్వహించే 30కి పైగా కంట్రోల్ రూమ్‌ల ద్వారా 24 గంటలూ పర్యవేక్షిస్తున్నారని ఆయన అన్నారు. భద్రతా గ్రిడ్‌లో బహుళపొరల బారికేడింగ్, నియమించబడిన అన్ని ఎంట్రీ పాయింట్ల వద్ద బహుళ స్థాయిల తనిఖీలు, కవాతు మార్గంలో, పరిసర ప్రాంతాలలో కఠినమైన యాక్సెస్ నియంత్రణ చర్యలు ఉన్నాయన్నారు. న్యూఢిల్లీ, ఉత్తర, మధ్య జిల్లాలలో వేలాది పైకప్పుల వద్ద స్నిపర్ల బృందాలను మోహరించారు. డిప్యూటీ కమిషనర్లు రూట్ సర్వేలు, విధ్వంసక నిరోధక తనిఖీలు చేశారు. అయితే నగరంలోని మార్కెట్లు, బస్ టెర్మినల్స్, మెట్రో స్టేషన్లు, రైల్వే స్టేషన్లు వంటి రద్దీగా ఉండే ప్రాంతాలలో నిఘా ముమ్మరం చేశారు. భద్రతా కసరత్తులో భాగంగా పోలీసులు అద్దెదారుల ధృవీకరణ, గృహ సహాయ ధృవీకరణ డ్రైవ్‌లను కూడా నిర్వహిస్తున్నారు. 'సమాచార భాగస్వామ్యం, నిఘా సమన్వయం, సంసిద్ధతను నిర్ధారించడానికి పొరుగు రాష్ట్రాల పోలీసు దళాలతో అంతర్రాష్ట్ర సమన్వయ సమావేశాలు కూడా నిర్వహించబడతాయి' అని ఒక అధికారి తెలిపారు. భద్రతా మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని, నిషేధిత వస్తువులను తీసుకెళ్లకుండా ఉండాలని అదనపు పోలీసు కమిషనర్ పౌరులను కోరారు. సీటింగ్ ఎన్‌క్లోజర్‌లకు నదుల పేర్లు పెట్టారు.



### రిపబ్లిక్ డే వేళ 10,000 కిలోల
## పేలుడు పదార్థాలు స్వాధీనం

**న్యూఢిల్లీ:** గణతంత్ర దినోత్సం వేళ రాజస్థాన్‌లో భారీగా పేలుడు పదార్థాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నాగౌర్ జిల్లాలోని హర్సౌర్ గ్రామంలో ఆదివారం రాత్రి దాదాపు పది వేల కేజీల అమ్మోనియం నైట్రేట్‌ను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వాటితోపాటు డిటోనేటర్లు ఫ్యూజ్ వైర్లను కూడా సీజ్ చేశారు. భారీ మొత్తంలో పేలుడు పదార్థాలు ఉన్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు ఆదివారం తనిఖీలు చేపట్టారు. 187 బస్తాల్లో 9,550 కేజీల అమ్మోనియం నైట్రేట్‌ను గుర్తించి సీజ్ చేశారు. దీంతో పాటు 9 కార్టన్ల డిటోనేటర్లు, 12 కార్టన్లు, 15 ప్యాకెట్ల నీలిరంగు ఫ్యూజ్ వైర్, ఐదు ప్యాకెట్ల ఎరుపు రంగు ఫ్యూజ్ వైర్‌లు సీజ్ చేసినట్లు పోలీసులు చెప్పారు. ఈ ఘటనలో సులేమాన్ ఖాన్ అనే నిందితుడిని అరెస్టు చేసినట్లు వెల్లడించారు. గతకొన్ని రోజులుగా జిల్లాలో పెద్ద మొత్తంలో పేలుడు పదార్థాలు కొనుగోలు చేయడం, అమ్మడం, నిల్వ చేస్తున్నట్లు నిఘా వర్గాల నుంచి తమకు సమాచారం వచ్చిందని నాగౌర్ ఎస్పి మృదల్ కచావా తెలిపారు. 'హర్సౌర్ ప్రాంతంలో పెద్ద ఎత్తున పేలుడు పదార్థాలు ఉన్నట్లు సమాచారం రావడంతో ఆదివారం ఆపరేషన్‌ను నిర్వహించాం. అదనపు పోలీస్ సూపరిటెండెంట్ పర్యవేక్షలో ప్లాన్ ప్రకారం ఆ స్థావరంపై దాడి చేశాం. నిందితుడు సులేమాన్‌ను అరెస్ట్ చేశాం. మొత్తం 10,000 కిలోగ్రాముల అమ్మోనియం నైట్రేట్‌ను స్వాధీనం చేసుకున్నాం. పెద్ద మొత్తంలో డిటోనేటర్లు, డిటోనేటింగ్ వైర్, మైనింగ్ సంబంధిత బ్లాస్టింగ్‌కు ఉపయోగించే ఇతర పదార్థాలను కూడా స్వాధీనం చేసుకున్నాం' అని ఎస్పీ మృదల్ కచావా తెలిపారు.



# కేజ్రీవాల్ కేసులో ఇడి తలంటిన మేజిస్ట్రేట్

ఇప్పుడు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) పేరు బాగా ప్రాచుర్యం పొందింది. అక్రమంగా డబ్బు తరలింపు (మనీ లాండరింగ్) కేసులంటూ దేశంలో ప్రతిపక్షపార్టీల నాయకులు ఇళ్లు, వ్యాపారాలపై, వారి బంధువుల ఇళ్లలో సోదాలు చేయటం, కేసులతో వేధించటంలో సిబిఐతో అది పోటాపోటీగా పనిచేస్తోంది. ఈ రెండు సంస్థలనూ తమ ఎన్నికల లబ్ధికోసం దుర్వినియోగపరుస్తున్నట్లుగా ప్రతిపక్షాలనుంచి బిజెపి కేంద్రప్రభుత్వం ఆరోపణలకు గురవుతోంది. ప్రతిపక్షపార్టీల పాలనలోని రాష్ట్రాల్లో ఎన్నికలకు కొద్ది మాసాల ముందు బిజెపి ప్రత్యర్థులపై సోదాలు, కేసులు ఇడి ప్రతిష్టను దిగజార్చుతున్నాయి. అది పెట్టిన కేసులతో పోల్చితే ఫలితం సాధించిన కేసులు నామమాత్రంగా ఉంటున్నాయి. ప్రతిపక్ష నాయకులను కీలక సమయంలో ఏదోక సాకుతో అరెస్టు చేసి జైల్లోపెట్టి, బిజెపికి సహాయపడుతున్న ఇడి ఉన్నతాధికారుల వక్రబుద్ధిని, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌ను అక్రమ అరెస్టు నుంచి నిర్దోషిగా విడుదల చేసిన న్యూఢిల్లీ అడిషనల్ ఛీఫ్ జుడీషియల్ మేజిస్ట్రేట్ (ఎసిజెఎం) తీర్పు బహిర్గతం చేసింది. రెండు ఇ.డి. సమన్స్ కేసులనుంచి కేజ్రీవాల్‌కు విముక్తి కలుగజేస్తూ ఎసిజెఎం పారస్ దలాల్ జనవరి 22న తీర్పు చెప్పారు. ఇడి తన అధికారాల పరిధిని మీరి కేజ్రీవాల్‌ను అరెస్టు చేసి ఢిల్లీలో పార్లమెంటు ఎన్నికల్లో, ఆ తర్వాత అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్ రాజకీయ ప్రచారాన్ని పట్టాలు తప్పించి బిజెపికి ఎలా తోడ్పడిందో ఈ ఉదంతం దేశానికి గుర్తు చేస్తున్నది. ఢిల్లీ లిక్కర్ కుంభకోణంలో ఇడి పంపిన 9 సమన్‌లకు కేజ్రీవాల్ స్పందించలేదు. దాంతో 2024 మార్చి 21న ఢిల్లీ ముఖ్యమంత్రిగా ఉన్న కేజ్రీవాల్ నివాసగృహంపై ఇడి అధికారులు దాడిచేసి ఆయన్ను అరెస్ట్ చేశారు. పార్టీ అధినేతను జైల్లో పెట్టటంతో ఎన్‌సిటి ఢిల్లీలో ఆప్ ఎన్నికల ప్రచారం చతికిలపడి 7లోక్‌సభ సీట్లూ బిజెపి గెలుచుకుంది. ఆ తర్వాత 2025 ప్రారంభంలో ఢిల్లీ విధాన్ సభ ఎన్నికల్లో బిజెపి అధికారం చేజిక్కించుకుంది. ఆ సమన్‌ల కేసులోనే ఇప్పుడు ఎసిజెఎం ఆప్ నాయకుణ్ణి నిర్దోషిగా నిర్ధారించారు.

తమ ఎదుట హాజరు కావలసిందిగా తాము 9సార్లు సమన్‌లు జారీచేసినా కేజ్రీవాల్ ఏవో అల్పమైన కారణాలతో హాజరుకాకుండా 'అవిధేయత' ప్రదర్శించారన్న ఇడి వాదనను మేజిస్ట్రేట్ త్రోసిపుచ్చారు. "ఇమెయిల్స్ ద్వారా సమన్స్ పంపినట్లు ఇడి నిరూపించలేదు; లేదా మనీ లాండరింగ్ చట్టంలోని సెక్షన్ 50(2) కింద ఒక వ్యక్తికి ఇ మెయిల్ ద్వారా సమన్‌లు పంపే నిర్దేశిత క్రమాన్ని చట్ట ప్రకారం పాటించినట్లు రుజువు చేయలేదు" అని ఆయన పేర్కొన్నారు. 'ఇ మెయిల్ ద్వారా సమన్‌లు జారీ చేయటం సిఆర్‌పిసి లేదా పిఎంఎల్‌ఎ కింద చెల్లుబాటుకాదు లేదా చట్టబద్ధం కాదు' అని స్పష్టం చేశారు.

కేజ్రీవాల్ ప్రభుత్వం రూపొందించిన నూతన మద్యం విధానంలో పెద్ద ఎత్తున డబ్బు చేతులు మారిందని, ఆప్‌కు ఆర్థిక లబ్ధి చేకూరిందని ఇడి అప్పుడు హడావుడి చేసిన మనీలాండరింగ్ కేసు కొద్దికాలం తర్వాత మరుగునపడింది. ఆ కేసు నమోదు రికార్డుల్లో తప్ప దర్యాప్తు జరుగుతున్నట్లు రూఢి చేసే పురోగతి వార్తలేవీలేవు. కెసిఆర్ కుమార్తె, తెలంగాణ జాగృతి నాయకురాలు కవిత ఈ కేసులోనే కొన్ని మాసాలపాటు జైల్లో నిర్బంధంలో ఉన్నారు. తర్వాత బెయిలుపై విడుదలైనారు.

ఇలాంటి మరో కట్టుకథ కేసులో సహనిందితుడిగా ఉన్న ఆప్ ఎంఎల్‌ఎ అమానుతుల్లాఖాన్ కూడా నిర్దోషిగా విడుదలైనారు. అదీ ఇడి సమన్‌లు పాటించని కేసే. అతనికి ప్రొసీజర్ ప్రకారం సమన్‌లు అందజేయలేదని, అవి జారీ చేశాక తమ ముందు హాజరయ్యేందుకు అతనికి కనీసం 24గంటలు సమయం ఇవ్వలేదని కోర్టు పేర్కొన్నది. ఆయన అప్పటికే హైకోర్టును ఆశ్రయించి ఉన్నందున ఇడి సమన్‌లు 'అపసవ్యం' అని చెప్పింది.

అది ఇడి పనితీరుకు ఉదాహరణ. కేజ్రీవాల్ 'సత్యమేవ జయతే' అని ఎక్స్‌లో పోస్టు చేశారు. నువ్వు ఇంకా కేసులో నెం.1 నిందితునిగానే ఉన్నావు సుమా అంటున్నారు బిజెపి వారు.

ఢిల్లీ లిక్కర్ కేసుగా పిలబడుతున్నదాన్ని 2022 ఆగస్టు 17 న సిబిఐ రిజిస్టర్ చేసింది. లెఫ్టినెంట్ గవర్నర్ వి.కె.సక్సేనా 2022 జులై 20 న ఫిర్యాదు చేశారు. ఇడి 2022 ఆగస్టు 22న పిఎంఎల్‌ఎ కేసు నమోదు చేసింది. కేజ్రీవాల్‌ను ప్రధాన కేసులో 2024 మార్చి 21న అరెస్టు చేశారు. ముఖ్యమంత్రిగా ఉంటూ అరెస్టు అయిన తొలి వ్యక్తి ఈయనే. ఎన్నికల కారణంగా సుప్రీంకోర్టు 2024 మే 10నుంచి జూన్ 1వరకు బెయిలు ఇచ్చింది. జూన్ 2న తిహార్ జైలుకు లొంగిపోయారు. జులై 12 న సుప్రీంకోర్టు రెగ్యులర్ బెయిల్ ఇచ్చింది, అయితే సిబిఐ కేసు కారణంగా ఆయన జైల్లోనే ఉండిపోయారు. ఆ కేసులో కూడా 2024 సెప్టెంబర్ 13న బెయిలు దొరికింది. ఆయన జైల్లో నుంచే ముఖ్యమంత్రిగా పనిచేశారు. సుప్రీంకోర్టు బెయిలిచ్చిన మరునాడు సెప్టెంబర్ 15న రాజీనామా చేశారు. ఈ నేపథ్యంలోనే మోదీ ప్రభుత్వం ఏ మంత్రి అయినా ఐదేళ్లు, ఆపై కాలం శిక్ష విధించదగిన కేసులో అరెస్టు కాబడి, వరుసగా 30 రోజులు నిర్బంధంలో ఉన్నట్లయితే అతన్ని పదవి నుంచి తొలగించాలని ఆదేశిస్తున్న 130వ రాజ్యాంగ సవరణ బిల్లును ప్రవేశపెట్టింది. దానిపై జెపిసి పబ్లిక్ విచారణ ఈ నెలలో ప్రారంభమైంది.

పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ ఎన్నికల పనులు చూస్తున్న ఐ–ఫోన్ కార్యాలయంపై జనవరి 8న ఇడి దాడి చేయటం, ముఖ్యమంత్రి జోక్యం చేసుకుని తమ ఫైళ్లు తీసుకెళ్లటంపై ఇడి కేసు ప్రస్తుతం సుప్రీం కోర్టు ముందు ఉంది. ప్రతిపక్షాల అవకాశాలు దెబ్బతీయటానికి ఇడిని దుర్వినియోగం చేస్తున్న తీరుకు కేజ్రీవాల్ కేసు ఉదాహరణ. ●



## అంతర్గత ఘర్షణలను పరిష్కరించుకుందాం

వెనిజులాలోని రాజకీయ నాయకుల గురించి వాషింగ్టన్ నుంచి చాలా ఆదేశాలు వచ్చాయి. వెనిజులా రాజకీయ నాయకులు మధ్య విభేదాలను, అంతర్గత ఘర్షణలను పరిష్కరించుకుందాం. విదేశీ శక్తులు ఇక చాలు. దేశంలో శాంతి, స్థిరత్వం కోసం ప్రజలుగా మనం ఐక్యంగా ఉండాల్సిన అవసరం ఉంది. విదేశీ శక్తి నుంచి దాడి ఎదుర్కొంటామని వెనిజులా ఎన్నడూ ఊహించలేదు. జాతీయ సమగ్రత కోసం విదేశీ జోక్యం లేకుండా స్థానిక రాజకీయ చర్చల ద్వారా అంతర్గత విభేదాలను పరిష్కరించుకొందాం. మనకు (ప్రతిపక్షాలతో) విభేధాలు ఉన్నప్పటికీ, మనం పరస్పర గౌరవంతో మాట్లాడుకోవాలి. మనం ఏకతాటిపై రావాలి. అంగీకారానికి రావాలి.

వెనిజులా తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్వెజ్



# సాగును కాటేస్తున్న 'నకిలీ' విషం

ప్రకృతి వైపరీత్యాలు ఒకవైపు, మార్కెట్ మాయాజాలం మరోవైపు నకిలీ విత్తనాలు ఇంకొకవైపు రైతును ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. వీటికి తోడు, నకిలీ పురుగుమందుల విషం సాగును లోపల నుంచే మెల్లగా చంపేస్తోంది. పంటను కాపాడాలన్న రైతు ఆందోళననే పెట్టుబడిగా మార్చుకుని, రసాయన మాఫియా లక్షల కోట్ల వ్యాపార సామ్రాజ్యాన్ని నిర్మించింది. ఈ ప్రమాదకర దందాకు అడ్డుకట్ట వేయాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం 'పురుగుమందుల నిర్వహణ బిల్లు– 2025' ను ప్రతిపాదించి, నకిలీ తయారీదారుల ఆటకట్టించేందుకు రంగం సిద్ధం చేసింది.

**భయం చుట్టూ విస్తరిస్తున్న వ్యాపార సామ్రాజ్యం**

నేటి వ్యవసాయంలో పురుగుమందుల వినియోగం ఒక అవసరం కాదు – రైతుకు ఒక అత్యవసర పరిస్థితిగా మారిపోయింది. పంటలో చిన్న తెగులు, పురుగు కనిపించినా, మొత్తం పంట నాశనం అవుతుందేమో అన్న భయం రైతును వెంటాడుతుంది. అదే భయాన్ని అవకాశంగా మలుచుకుని, కొన్ని కంపెనీలు నాణ్యత లేని రసాయనాలను ఆకర్షణీయమైన ప్యాకింగ్‌లతో మార్కెట్లోకి నెట్టేస్తున్నాయి. నిపుణుల అంచనాల ప్రకారం, దేశంలో ఏటా రూ.6,000–8,000 కోట్ల వరకు నకిలీ పురుగుమందుల వ్యాపారం సాగుతోంది.

**నకిలీల కాటు – రైతుకే కాదు,వ్యవస్థకే ముప్పు**

నకిలీ పురుగుమందుల ప్రభావం రైతు జేబుతోనే ఆగిపోవడం లేదు. వ్యవసాయ వ్యవస్థ మొత్తం దీని వల్ల దెబ్బతింటోంది. రోగాలు తగ్గకపోగా పంట ఎండిపోవడం, పెరుగుదల ఆగిపోవడం దిగుబడులు పడిపోవడంతో రైతు అప్పుల ఊబిలోకి జారుకోవడం. భూసారం క్రమంగా నాశనం కావడం భూగర్భజలాలు,పర్యావరణం కలుషితం కావడం ఇవే కాకుండా, పిచికారీ సమయంలో సరైన రక్షణ లేకపోవడం వల్ల రైతుల్లో శ్వాసకోస వ్యాధులు, చర్మ సమస్యలు పెరుగుతున్నాయి.

ప్రస్తుతం అమల్లో ఉన్న 1968 నాటి కీటక నాశిని చట్టం నేటి పరిస్థితులకు సరిపోవడం లేదు. నామమాత్రపు జరిమానాలు, బలహీన శిక్షలు నకిలీ మాఫియాకు ఎలాంటి భయం కలిగించలేకపోయాయి. ఈ లోపాలను సరిదిద్దేందుకే కేంద్ర ప్రభుత్వం 'పురుగుమందుల నిర్వహణ బిల్లు–2025'ను తీసుకొచ్చింది. ఈ బిల్లుపై ఫిబ్రవరి 4లోపు అభిప్రాయాలు, సూచనలు పంపాలని కేంద్రం కోరింది..

**అప్రమత్తతే రైతును కాపాడేది:** నకిలీ విత్తనాలు, కల్తీ ఎరువుల నియంత్రణకు చట్టాలు ఎన్ని కఠినంగా రూపొందించినప్పటికీ, క్షేత్రస్థాయిలో రైతు అప్రమత్తతే అన్నింటికన్నా బలమైన రక్షణ కవచం. ప్రతి కొనుగోలులోనూ పారదర్శకత ఉండాలి; కంపెనీ పేరు, బ్యాచ్ సంఖ్య స్పష్టంగా నమోదైన 'పక్కా బిల్లు' తీసుకోవడం రైతు బాధ్యత మాత్రమే కాదు, మోసపోతే పోరాడేందుకు ఒక ఆయుధం కూడా. అనవసర రసాయన ప్రయోగాలతో సాగును సంక్షోభంలోకి నెట్టుకోకుండా విజ్ఞతతో వ్యవహరించాలి. ఎక్కడ నకిలీల ఆనవాళ్లు కనిపించినా, వాటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లడం ద్వారా తనతో పాటు తోటి రైతుల ప్రయోజనాలను కాపాడే సామాజిక బాధ్యతను ప్రతి కర్షకుడు స్వీకరించాలి'. అన్నదాతను పట్టి పీడిస్తున్న నకిలీల బెడదను అరికట్టడం వ్యవస్థల కర్తవ్యమే కాదు, సామాజిక బాధ్యత కూడా.

**జి.అజయ్ కుమార్**

# 2026లో ఆర్థిక అస్థిరతను పెంచే భౌగోళిక రాజకీయాలు

**సాత్యకీ చక్రవర్తి**

జనవరి 14న విడుదల చేసిన ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యుఇఎఫ్) 'గ్లోబల్ రిస్క్స్ రిపోర్ట్ 2026', ఈ ఏడాది ప్రపంచ ఆర్థిక సంఘర్షణను అగ్రస్థానంలో ఉన్న ముప్పుగా గుర్తించింది. తరువాతి స్థానాలలో అంతర్ రాజ్య సంఘర్షణ, విపరీత వాతావరణ పరిస్థితులు, సామాజిక విభజన, తప్పుడు సమాచారం, దుష్ప్రచారం ఉన్నాయి.

నాయకులు, నిపుణుల దృక్పథం తీవ్ర ఆందోళనను కలిగిస్తుంది. సర్వేలో పాల్గొన్న వారిలో సగం మంది రాబోయే రెండేళ్లలో ప్రపంచం అస్థిరంగా లేదా కల్లోలం వంటి పరిస్థితులతో ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఇది గతేడాది కంటే 14 పాయింట్లు పెరిగింది. మరో 40 శాతం మంది రాబోయే రెండేళ్ల కాలం కనీసం అశాంతిగా ఉంటుందని భావిస్తుండగా, 9 శాతం మంది స్థిరత్వాన్ని, ఒక్క శాతం మంది ప్రశాంతతను అంచనా వేస్తున్నారు. రాబోయే 10 ఏళ్ల కాలం విషయానికి వస్తే, 57 శాతం మంది అస్థిరమైన లేదా విపరీత ప్రపంచాన్ని ఊహిస్తున్నారు. 32 శాతం మంది పరిస్థితులు అశాంతిగా ఉంటాయని, 10 శాతం మంది స్థిరత్వాన్ని , ఒక్క శాతం మంది ప్రశాంతతను అంచనా వేస్తున్నారు.

ప్రధాన శక్తులు తమ ఆసక్తి ఉన్న రంగాలను కాపాడుకోవడానికి ప్రయత్నిస్తున్నందున కొత్త పోటీతత్వ వ్యవస్థ ఏర్పడుతోంది. సహకారం నిన్నటికంటే భిన్నంగా మారుతున్న దృశ్యం ఒక ఆచరణాత్మక వాస్తవికతను ప్రతిబింబిస్తుంది. భాగస్వామ్య విధానాలు, చర్చల స్ఫూర్తి ఇప్పటికీ అత్యవసరం అని డబ్ల్యుఇఎఫ్ అధ్యక్షుడు, సిఇఒ బోర్గే బ్రెండే అన్నారు. దావోస్‌లో జరిగే తమ వార్షిక సమావేశం ప్రమాదాలను, అవకాశాలను అర్థం చేసుకోవడానికి,వాటిని పరిష్కరించడానికి అవసరమైన వారధుల నిర్మాణానికి ఒక కీలక వేదికగా ఉపయోగపడుతుందన్నారు.

పోటీ యుగం భౌగోళిక ఆర్థిక ఘర్షణ నుండి అనియంత్రిత సాంకేతికత, పెరుగుతున్న అప్పుల వరకు ప్రపంచ ముప్పులను పెంచుతున్న తరుణంలో, గ్లోబల్ రిస్క్స్ రిపోర్ట్ ఒక ముందస్తు హెచ్చరిక వ్యవస్థను అందిస్తుంది. అయితే, ఈ ప్రమాదాలేవీ ముందే నిర్ణయించబడిన ఫలితాలు కావు అని డబ్ల్యుఇఎఫ్ మేనేజింగ్ డైరెక్టర్ సాదియా జాహిది అన్నారు. నివేదికలో ప్రముఖంగా పేర్కొన్న సవాళ్లు మనం ఎదుర్కొంటున్న సంభావ్య ప్రమాదాల స్థాయిని, తదుపరి జరగబోయే దానికి ఒక రూపం ఇవ్వటంలో మన ఉమ్మడి బాధ్యతను నొక్కి చెబుతున్నాయి అన్నారు.


ముప్పులను ఈ నివేదిక మూడు కాలపరిమితులలో విశ్లేషిస్తున్నది. తక్షణ (2026); స్వల్ప నుంచి మధ్యకాలిక (తదుపరి రెండు సంవత్సరాలు); దీర్ఘకాలిక (తదుపరి 10 సంవత్సరాలు). సమీప కాలంలో, సైనిక ఘర్షణలు, ఆర్థిక సాధనాలను ఆయుధాలుగా ఉపయోగించటం, సామాజిక విచ్ఛిన్నం ఒకదానితో ఒకటి ఢీకొంటున్నాయి. ఈ తక్షణ ప్రమాదాలు తీవ్రమవుతున్న కొద్దీ, సాంకేతిక వేగం నుండి పర్యావరణ క్షీణత వరకు దీర్ఘకాలిక సవాళ్లు కూడా గొలుసుకట్టు ప్రభావాలను సృష్టిస్తున్నాయి.

సమీప కాల ర్యాంకింగ్‌లలో ప్రపంచ ఆర్థిక ఘర్షణ అగ్రస్థానంలో ఉంది. స్పందించిన వారిలో 18శాతం మంది దీనిని 2026లో ప్రపంచ సంక్షోభాన్ని ప్రేరేపించే అవకాశం ఉన్న ముప్పుగా భావిస్తున్నారు. అలాగే రాబోయే రెండేళ్లలో తీవ్రత పరంగా ఇది ఒకటవ స్థానంలో ఉంది. ఇది గత ఏడాది కంటే ఎనిమిది స్థానాలు పెరిగింది. 2026 సంవత్సరానికి దేశాల మధ్య సాయుధ సంఘర్షణ 2వ స్థానంలో ఉంది, ఇది రెండేళ్ల కాల పరిమితిలో 5వ స్థానానికి పడిపోయింది.

పెరుగుతున్న శత్రుత్వాలు, సుదీర్ఘ పోరాటాల ప్రపంచంలో, ఘర్షణలు సరఫరా గొలుసులకు, విస్తృత ప్రపంచ ఆర్థిక స్థిరత్వానికి, అలాగే ఆర్థిక ఒడిదొడుకులను పరిష్కరించడానికి అవసరమైన సహకార సామర్థ్యానికి ముప్పు కలిగిస్తాయి. భౌగోళిక రాజకీయ దృక్పథం విషయానికి వస్తే, 68శాతం మంది రాబోయే దశాబ్దంలో 'బహుళ ధృవ లేదా ముక్కలుగా ఉండే వ్యవస్థను' ఊహిస్తున్నారు. ఇది గత ఏడాది కంటే నాలుగు పాయింట్లు పెరిగింది.

రెండేళ్ల కాలంలో ఆర్థిక ముప్పులు అతిపెద్ద ఉమ్మడి పెరుగుదలను చూపుతున్నాయి. ఆర్థిక మాంద్యం, ద్రవ్యోల్బణం ప్రమాదాలు రెండూ ఎనిమిది స్థానాలు పెరిగి వరుసగా 11, 21వ స్థానాలకు చేరుకోగా, అస్సెట్ బబుల్ బరెస్ట్ (స్థిరాస్తి బుడగ పేలడం) ఏడు స్థానాలు పెరిగి 18వ స్థానానికి చేరుకుంది. భౌగోళిక ఆర్థిక ఉద్రిక్తతల మధ్య, పెరిగిపోతున్న రుణాల గూర్చిన ఆందోళనలు, సంభావ్య స్థిరాస్తి బుడగలు అస్థిరత స్థితిలో కొత్త దశను ప్రేరేపించగలవు.

రెండేళ్ల అంచనాలో తప్పుడు సమాచారం, దుష్ప్రచారం 2వ స్థానంలో ఉండగా, సైబర్ అభద్రత 6వ స్థానంలో ఉంది. ఎఐ ప్రతికూల ఫలితాలు




అత్యంత స్పష్టమైన పథాన్ని చూపుతున్నాయి. ఇవి రెండేళ్ల కాలంలో 30వ స్థానం నుండి 10 ఏళ్ల కాలంలో 5వ స్థానానికి చేరుకున్నాయి. ఇది కార్మిక మార్కెట్లు, సమాజాలు, భద్రతపై ప్రభావాల పట్ల ఉన్న ఆందోళనను ప్రతిబింబిస్తుంది. సామాజిక విభజన 2026లో 4వ స్థానంలో, 2028 నాటికి 3వ స్థానంలో ఉంటుంది. అసమానత రెండు, పదేళ్ళ అంచనాలలో 7వ స్థానంలో ఉంది. సామాజిక చైతన్యం తగ్గుతున్న తరుణంలో, అసమానత వరుసగా రెండో ఏడాది ఇతర ముప్పులను ప్రేరేపించే అత్యంత అనుసంధాన ముప్పుగా ఎంపిక చేయబడింది. ఆర్థిక మాంద్యం రెండవ అత్యంత అనుసంధానిత ముప్పు. ఈ అనుసంధానాల వెనుక జీవన వ్యయాల ఒత్తిడి, కె–ఆకారపు ఆర్థిక వ్యవస్థలు స్థిరపడిపోతున్నాయనే ఆందోళనలు ఉన్నాయి.

స్వల్పకాలిక ఆందోళనలు దీర్ఘకాలిక లక్ష్యాలను అధిగమించడంతో, రెండేళ్ల అంచనాలో పర్యావరణ ముప్పుల ర్యాంకింగ్ తగ్గింది. విపరీతమైన వాతావరణం 2 నుండి 4వ స్థానానికి, కాలుష్యం 6 నుండి 9వ స్థానానికి పడిపోగా, భూమి వ్యవస్థలో కీలక మార్పులు, జీవవైవిధ్యం కోల్పోవడం వరుసగా ఏడు, ఐదు స్థానాలు పడిపోయాయి. అన్ని పర్యావరణ ప్రమాదాల తీవ్రత స్కోరు తగ్గింది. ఇది కేవలం సాపేక్షమైన మార్పు మాత్రమే కాదు, సంపూర్ణమైన మార్పును సూచిస్తుంది. అయినప్పటికీ 10 ఏళ్ల కాలంలో, అవి అత్యంత తీవ్రమైనవిగా ఉన్నాయి. మొదటి మూడు స్థానాల్లో విపరీతమైన వాతావరణం, జీవవైవిధ్యం కోల్పోవడం, భూమి వ్యవస్థలో కీలక మార్పులు ఉన్నాయి. ముప్పావు వంతు ప్రతివాదులు పర్యావరణ దృక్పథం అస్థిరంగా లేదా తుపానులాగా ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఇది ఏ ఇతర విభాగం కంటే అత్యంత ప్రతికూలమైనది.

**అస్థిరత యుగంలోకి సప్లయ్ చైన్ వ్యవస్థ**

అలాగే జనవరి 19న విడుదల చేసిన ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యుఇఎఫ్) నివేదిక ప్రకారం, ప్రపంచ విలువ గొలుసులు నిర్మాణాత్మక అస్థిరత యుగంలోకి ప్రవేశించాయి. ఇది కంపెనీలు, ప్రభుత్వాలు ఎక్కడ, ఎలా పెట్టుబడి పెట్టాలి, ఉత్పత్తి చేయాలి అనే విషయాలను పునఃసమీక్షించుకునేలా చేస్తోంది. దాదాపు నలుగురిలో ముగ్గురు వ్యాపార దిగ్గజాలు ఇప్పుడు 'స్థిరత్వం' ఉండే పెట్టుబడులకు ప్రాధాన్యత ఇస్తున్నారని, 74 శాతం మంది దీనిని వృద్ధికి చోదకశక్తిగా చూస్తున్నారని నివేదిక కనుగొంది.

భౌగోళిక రాజకీయ విచ్ఛిన్నం, వేగవంతమైన సాంకేతిక మార్పులు, పెరుగుతున్న వనరుల కొరతలపై కియర్నీ సహకారంతో అభివృద్ధి చేసిన గ్లోబల్ వాల్యూ చైన్స్ అవుట్‌లుక్ 2026: ఆర్కెస్ట్రేటింగ్ కార్పొరేట్, నేషనల్ ఎబిలిటీ అనే కొత్త నివేదిక, అంతరాయాలు అనేవి తాత్కాలిక ఒడిదొడుకుల కంటే శాశ్వత లక్షణంగా మారిన తరుణంలో కంపెనీలు, ప్రభుత్వాలు ఎలా పోటీ పడగలవో పరిశీలిస్తుంది.

అస్థిరత అనేది ఇకపై తాత్కాలిక అంతరాయం కాదు. అది నాయకులు ప్రణాళికాబద్ధంగా ఎదుర్కోవాల్సిన ఒక నిర్మాణాత్మక పరిస్థితి అని డబ్ల్యుఇఎఫ్ మేనేజింగ్ డైరెక్టర్ కివా ఆల్‌గుడ్ అన్నారు. పోటీతత్వ ప్రయోజనం ముందస్తు ఆలోచన, ప్రత్యామ్నాయాలు, వ్యవస్థల సమన్వయం నుండి వస్తుంది. ఈ సామర్థ్యాలను కలిసికట్టుగా నిర్మించే కంపెనీలు, దేశాలు పెట్టుబడులను ఆకర్షించడానికి, సరఫరాను సురక్షితం చేసుకోవడానికి, విచ్ఛిన్నమైన ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో వృద్ధిని కొనసాగించడానికి ఉత్తమ స్థితిలో ఉంటాయి.

ఈ మార్పు స్థాయి ఇప్పటికే స్పష్టంగా కనిపిస్తోంది. 2025లోనే, ప్రధాన ఆర్థిక వ్యవస్థల మధ్య సుంకాల విస్తరణ వల్ల 400 బిలియన్ డాలర్లకు పైగా ప్రపంచ వాణిజ్య ప్రవాహంలో మార్పులకు గురైంది. అదే సమయంలో ప్రధాన నౌకా రవాణా మార్గాల్లో అంతరాయాల కారణంగా కంటైనర్ షిప్పింగ్ ఖర్చులు ఏడాదికి 40శాతం పెరిగాయి. ఇది స్వల్పకాలిక ఒడిదొడుకులు నుండి శాశ్వత అనిశ్చితి వైపుకు నిర్ణయాత్మక మార్పును సూచిస్తుంది. అదే సమయంలో, అభివృద్ధి చెందిన దేశాలలో వస్తూత్పత్తి రంగం 2009 తర్వాత అతి బలహీనమైన వేగంతో పెరుగుతోంది. 2025 లోనే ప్రపంచవ్యాప్తంగా 3,000 కంటే ఎక్కువ కొత్త వాణిజ్య, పారిశ్రామిక విధాన చర్యలు ప్రవేశపెట్టబడ్డాయి. ఇది ఒక దశాబ్దం క్రితం నమోదైన వార్షిక స్థాయి కంటే మూడు రెట్లు ఎక్కువ. ఈ శక్తులన్నీ కలిసి సరఫరా గొలుసు స్థిరత్వం (సప్లయ్ చైన్ రెసిలెన్స్) అనేది జాతీయ పోటీతత్వానికి, కార్పొరేట్ వ్యూహానికి ఎందుకు కేంద్ర బిందువుగా మారిందో నొక్కి చెబుతున్నాయి.

"సరఫరా గొలుసు అంతరాయాలు 2026లో నిలకడగా, వ్యవస్థాగతంగా ఉంటాయి. భౌగోళిక రాజకీయ విభజనలు, వాణిజ్య రూల్సులో మార్పులు, కార్మిక కొరతలు – ఇవన్నీ విలువను సృష్టించటమెలాగో, పంచటమెలాగో పునర్ నిర్వచిస్తున్నాయి. సరఫరా నాయకులకు సంబంధించి రానున్న అంతరాయాలను ఊహించటం ఇంకెంత మాత్రమూ ప్రాధాన్యత కాదు. శాశ్వత అస్థిరత మధ్య పనిచేసేందుకు ఆపరేటింగ్ మోడల్స్‌ను కొత్తగా రూపొందించటం వారి ప్రాధాన్యతగా ఉంటుంది" అన్నారు పెర్ క్రిస్టీన్ హాంగ్ – కియర్నీ భాగస్వామి.

# భూభారతి చట్టంతో రైతులకు మేలు చేసేదెప్పుడు?

రెవెన్యూ శాఖను తొలగిస్తే తప్ప దేశం బాగుపడదని హైకోర్టు 2025 నవంబర్ 5న ఘాటు వాఖ్యాలు చేసింది. ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం

అడవిమల్లెల శివారులోని సర్వే నంబర్ 11,12,13, 29,30,31 లలోని తమ భూములను 'మిషన్ కాకతీయ పథకం' లో చేర్చడాన్ని సవాలు చేస్తూ బి. కృష్ణారెడ్డి తదితరులు పిటిషన్ ను దాఖలు చేశారు.దానిపై జస్టిస్ జూకంటి అనిల్ కుమార్ ధర్మాసనం విచారణను చేపట్టింది.చెరువు (ఎఫ్టీఎల్/ ఫుల్ ట్యాంక్ లెవెల్)మధ్యలో ఉన్న భూములకు పట్టాలు ఎలా ఇస్తారని హైకోర్టు ప్రశ్నించింది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న చెరువుల ఎఫ్టీఎల్ నిర్ణయించని కారణంగానే సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయని వ్యాఖ్యానించింది.ఖమ్మం జిల్లా కలెక్టర్ ను కౌంటర్ దాఖలు చేయమని ఆదేశించింది.2025 ఆగస్టులో తమ భూములకు పట్టాలు మంజూరు చేయడంలో కామారెడ్డి జిల్లా తాడ్వాయి తహశీల్దార్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఎల్లారెడ్డి–కామారెడ్డి ప్రధాన రహదారిపై రైతులు 'రాస్తారోకో' చేశారు. రెవెన్యూ ఇన్స్పెక్టర్ మొఖా మీదికి వచ్చి రిపోర్ట్ సమర్పించి ఏడాది గడుస్తున్నా పట్టాలు ఇవ్వడం లేదని ఆరోపించారు.అన్నదాతలకు న్యాయం చేయని తహశీల్దార్ వద్దంటూ నినదించారు.

కరీంనగర్ జిల్లా గంగాధర మండలానికి చెందిన రైతులు, రెవిన్యూ అధికారులు లంచాలు అడుగుతున్నారని ఆరోపిస్తూ కలెక్టరేట్ ముందు ధర్నా చేశారు. విరాసత్ చేయడానికి లంచాలు అడుగుచున్నారని ఫిర్యాదు చేశారు. శంకరపట్నం మండలం 'యరడపల్లి'శివారులోని సర్వే నంబర్ 200/2 లో 0.38 గుంటల పట్టా భూమిని 'ఖారిజ్'ఖాతా భూమిగా నమోదు చేసిన భూమికి పట్టా ఇవ్వాలని మూడుసార్లు దరఖాస్తును ఇచ్చిన నిరాకరించారు. ఆఖరికి 'సిసిఎల్ఎ' (చీఫ్ కమీషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్)ఖారిజ్ ఖాతా అంటే? ప్రభుత్వ భూమి కాదని స్పష్టత ఇచ్చినా ప్రతికూలంగా వ్యవహరించారు. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మెట్ ఎమ్మార్వో కె. విజయా రెడ్డిపై తన కార్యాలయంలోనే 2019 నవంబర్ 4న గౌరెల్లి గ్రామానికి చెందిన కె. సురేశ్ అనే రైతు పెట్రోల్ పోసి నిప్పంటించాడు. మంటలను ఆర్పే ప్రయత్నంలో అటెండర్ చంద్రియా,డ్రైవర్ గురునాథానికి కూడా తీవ్ర గాయాలైనవి. తహశీల్దార్ కె.విజయా రెడ్డి సంఘటన స్థలంలోనే మరణించగా,డ్రైవర్ గురునాథం చికిత్స పొందుతూ చనిపోయాడు. కె. సురేశ్ రైతు కూడా చనిపోయాడు.అయితే సురేశ్ కుటుంబ సభ్యులు చెప్పిన వివరణ ప్రకారం 30 కుటుంబాలకు చెందిన 110 ఎకరాల భూవివాదం కేసు కోర్టులో ఉందని, మతి స్థిమితం కోల్పోయిన కె. సురేశ్ ఈ దారుణానికి పాల్పడినాడని తెలిపారు.

భూవివాదాల వలన జరిగిన ఘర్షణలలో చాల మంది రైతులు నష్టపోతున్నారు. చనిపోతున్నారు.దీనికి కారణం రైతులను ఆదుకుని సులువుగా పరిష్కరించే చట్టాలు, ప్రభుత్వ యంత్రాంగం లేకపోవడం వలననే అశాంతి సాగుచున్నది.అందుకే 2023 నవంబర్ 30న జరిగిన తెలంగాణ రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో రైతుల భూవివాదాల సమస్య ఎన్నికల మేనిఫెస్టోగా తెరమీదకు వచ్చింది.కాంగ్రెస్ అధికారంలోకి వస్తే 'ధరణి పోర్టల్ ' ను రద్దు చేసి,రైతులకు మేలు చేసే చట్టాన్ని తెస్తామని హామీ ఇచ్చింది.అనుకున్నట్టుగానే కాంగ్రెస్



అధికారంలోకి వచ్చింది. డిసెంబర్ 7న ముఖ్యమంత్రిగా ఎ.రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు.కొత్తగా 'తెలంగాణ రాష్ట్ర భూభారతి చట్టం(భూమిపై హక్కుల రికార్డు) 2025' ఏప్రిల్ 14న ప్రారంభించారు.మూడు దశలలో రెవిన్యూ సదస్సులు నిర్వహించారు.జూన్ 21న రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారుల తో సమావేశం జరిపారు.భూసమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ సదస్సులలో రైతులు పెట్టుకున్న 8.50 లక్షల దరఖాస్తులను పరిశీలించి ఆగస్ట్ 15 నాటికి పరిష్కారం చేస్తామని భరోసా ఇచ్చాడు.కాని ఇప్పటి వరకు రైతులు ఇచ్చిన దరఖాస్తులను కనీసం పరిశీలించిన దాఖలాలు కూడా కానరావడం లేదు.

ఎమ్మార్వోలు/తహశీల్దార్‌లు, రెవెన్యూ ఉద్యోగులు కనీస బాధ్యత లేకుండా విధులు నిర్వహిస్తూ రైతుల కష్టాలకు, కన్నీళ్లకు కారణమవుతున్నారు. బొగ్గు, కరంటు ఉత్పత్తి చేసే ఉద్యోగులు, కార్మికులు ప్రయాణికుల బస్సు, రైలు విమానం నడిపే డ్రైవర్ లు రాత్రింబవళ్లు విధులు నిర్వహిస్తూ ప్రజలకు సేవ చేస్తున్నారు. అలాంటిది రెవెన్యూ ఉద్యోగులు, అధికారులు ఎందుకు? సక్రమంగా విధులు నిర్వహిస్తాలేరని రైతులు ప్రశ్నిస్తున్నారు. అయినా ప్రభుత్వం ఆలకించడం లేదు. ఎమ్మెల్యేలు, ఎంపీలు చట్ట సభలలో ప్రశ్నించి రైతులకు అండగా ఉండటం లేదు. ఎన్నెన్నో అక్రమాలు కొనసాగుతూనే ఉన్నా యి. మంత్రుల మాటలకు తగిన ఆచరణ కనిపించటం లేదు.

2023 మే1నాటి ప్రజావాణిలో కరీంనగర్ జిల్లా కలెక్టర్ కు 'సైదాపూర్ మండల తహశీల్దార్ సిబ్బందిపై చర్యలు తీసుకుని మేరుగు నారాయణ పేర సర్వే నంబర్ 645/ఆ,విస్తీర్ణం 0.05 గుంటల భూమిని పట్టా నమోదు చేయాలని విన్నవించినప్పటికీ చర్యలు తీసుకోలేదు.సైదాపూర్ మండల తహశీల్దార్ మాత్రం 'మెమో నెంబర్ బి.424/2023, తేది 06/05/2023 ద్వారా మొఖా మీద విచారణ జరుపగా దుద్దెనపల్లి శివారులోని సర్వేనంబర్ 645/అ విస్తీర్ణం 0.05 గుంటల భూమిని మేరుగు నారాయణనే వరి పంట సాగు చేసి కోత అయింది. కాని ఆఫీస్ రికార్డ్స్ లో కేశవేని కనకయ్య పేర పట్టా ఉన్నందున ప్రస్తుతం 'ధరణిలో'పట్టా దారుడిని రద్దు చేయుటకు వీలు కానందున 'సివిల్ కోర్టు'కు పోయి పరిష్కరించుకోగలరని సలహా ఇస్తూ

మెమో ఇచ్చాడు.మరల భూభారతి చట్టం 2025 మార్గదర్శకమున నిర్వహించిన సదస్సులో కూడా దరఖాస్తు ఇవ్వడం జరిగింది.ఇప్పటి వరకు కనీస స్పందన కూడా లేదు.తహశీల్దార్/మండల రెవెన్యూ ఆఫీసర్(ఎమ్మార్వో )అంటే 'ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ ',రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్(ఆర్డీవో)అంటే 'సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్', కలెక్టర్ అంటే పాలనాధికారి 'ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్' లుగా ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్, ఆదాయ సేకరణ,భూమి రికార్డుల వివాదాలు, మ్యూటేషన్,శాంతి భద్రతలు,కార్యనిర్వహణ , మెజిస్ట్రీయల్ అధికారాలు కలిగిన ప్రభుత్వ యంత్రాంగం రైతుల భూమి హక్కుల రికార్డులను ఎందుకు సక్రమంగా నమోదు చేయడం లేదు.అవినీతి, అక్రమాలు జరుగుచున్న చర్యలు తీసుకోకుండా ఎందుకు ఉదాసీనంగా ఉంటున్నారు? చట్టాలను రూపొందించే చట్ట సభలు రైతుల కష్ట నష్టాల గురించి ఎందుకు చర్చించి చర్యలకు ఉపక్రమించడం లేదని రైతులు ఆందోళన చెందుచున్నారు.ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన తెలంగాణ భూభారతి చట్టం 2025 'ను సక్రమంగా అమలు చేసి రైతుల భూవివాదాలను, తప్పుడు నమోదులను సరిదిద్ది రైతులకు మేలు చేయాలని కోరుకుంటున్నారు.

**మేరుగు రాజయ్య,**
9441440791.



## రాజ్యాంగ స్ఫూర్తితోనే ప్రజా పాలన

### ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

**ప్రజాపక్షం/ఆలేరు** : ప్రతి పౌరుడికి హక్కులు, గౌరవాన్ని ప్రసాదించిన భారత రాజ్యాంగమే దేశానికి దిక్సూచి అని, ఆ స్ఫూర్తితోనే రాష్ట్రంలో ప్రజా పాలన సాగుతోందని తెలంగాణ ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే శ్రీ బీర్ల అయిలయ్య స్పష్టం చేశారు. 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆదివారం ఆలేరు నియోజకవర్గ కేంద్రంలో పండుగ వాతావరణంలో జరిగిన వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలుత ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మువ్వన్నెల జెండాను ఆవిష్కరించి వందనం సమర్పించిన ఆయన, అనంతరం పట్టణంలోని గౌడ సంఘం భవనం ,కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద నిర్వహించిన పతాకావిష్కరణ కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలేరు నియోజకవర్గ ప్రగతిపై తనకున్న నిబద్ధతను చాటుతూ.. విద్య, వైద్యం, సాగు నీరు, మౌలిక వసతుల కల్పనలో ఆలేరును రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఏజాజ్, కొండ్రాజు వెంకటేశ్వర్ రాజు,జనగామ ఉపేందర్ రెడ్డి, చింతల ఫణి శ్రీనివాస్ రెడ్డి,అంగడి ఆంజనేయులు, పర్రె రమేష్, అజయ్ కుమార్ విక్రమ్ పాల్గొన్నారు.

## పద్మ విజేతలకు ఎంపి చామల అభినందనలు

**ప్రజాపక్షం/యాదాద్రి:** గణతంత్ర దినోత్సవం 2026 సంవత్సరానికిగాను కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పద్మశ్రీ పురస్కారాల్లో తెలంగాణ రాష్ట్రానికి విశేష ప్రాధాన్యత లభించడం గర్వకారణమని భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. వివిధ రంగాల్లో విశేష కృషి చేసి, అత్యున్నత పౌర పురస్కారాలకు ఎంపికైన విజేతలకు ఆయన తన హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. సైన్స్ అండ్ ఇంజనీరింగ్ రంగంలో విశేష సేవలందించిన చంద్రమౌళి, కృష్ణమూర్తి, కుమారస్వామి తంగరాజ్, వైద్య రంగంలో నిరుపమాన సేవలందించిన డాక్టర్ గూడూరు వెంకట్ రావు, డాక్టర్ విజయ ఆనంద్ రెడ్డి, కూచిపూడి నృత్య కళాకారిణి దీపికా రెడ్డి, పశుసంవర్ధక రంగంలో విశిష్ట కృషి చేసిన రామారెడ్డి మామిడి (మరణానంతరం) గారికి పద్మశ్రీ పురస్కారాలు దక్కడం తెలంగాణ ప్రతిభకు దక్కిన గౌరవమని ఆయన కొనియాడారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. అవార్డు గ్రహీతలందరి సేవలు సమాజానికి ఆదర్శప్రాయమని, వారి కృషి నేటి యువతకు గొప్ప స్ఫూర్తినిస్తుందని పేర్కొన్నారు. తెలంగాణ గడ్డపై పుట్టిన ఆణిముత్యాలకు జాతీయ స్థాయిలో గుర్తింపు రావడం రాష్ట్ర ప్రజలందరికీ గర్వకారణమని, ఈ ఘనత సాధించిన ప్రతి ఒక్కరికీ తన తరఫున, తెలంగాణ ప్రజల తరఫున శుభాకాంక్షలు తెలియజేస్తున్నట్లు ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

## రైతుల ఆర్థికాభివృద్ధికే ప్రాధాన్యం

### నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం



**ప్రజాపక్షం/నకిరేకల్** : వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేసి రైతుల ఆర్థికాభివృద్ధిని సాధించడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయ యాంత్రీకరణకు సబ్సిడీని ప్రవేశపెట్టిందని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం పేర్కొన్నారు.సోమవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో వ్యవసాయ యాంత్రీకరణ సబ్సిడీ పనిముట్ల పంపిణీ కార్యక్రమంనిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక యంత్రాల వినియోగంతో సాగు వ్యయాలు తగ్గి దిగుబడులు పెరుగుతాయని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో రైతులకు ఎలాంటి సబ్సిడీలు అందలేదని, రూ.8 లక్షల కోట్లకు పైగా అప్పులు చేసి రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని ఆయన విమర్శించారు. ఈకార్యక్రమంలో నకిరేకల్ మున్సిపల్ చైర్మన్ చౌగోని రజిత శ్రీనివాస్,వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గుత్తా మంజుల మాధవరెడ్డి,అగ్రికల్చర్ ఇన్చార్జి ఏడి జామియా నాయకులు బిజిఆర్ ఫౌండేషన్ చైర్మన్ బచ్చుపల్లి గంగాధర్ పాల్గొన్నారు.

## రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడుకుందాం


### కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతిరెడ్డి



**ప్రజాపక్షం/కోదాడ:** దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన మహనీయుల త్యాగాలు మరువలేనివని కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి అన్నారు. సోమవారం కోదాడ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం, కాంగ్రెస్ పార్టీ కార్యాలయం, మహిళ మండలి, వ్యవసాయ మార్కెట్ కమిటి, గ్రంథాలయం, మండల సమాఖ్య కార్యాలయం, మున్సిపాలిటి, తహసిల్దార్ కార్యాలయం, ఆర్డీవో కార్యాలయాల్లో జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొని జాతీయ జెండాలను ఎగురవేశారు. స్వాతంత్ర్య ఉద్యమ నాయకుల చిత్రపటాలకు పూలమాలలువేసి నివాళులర్పించారు. రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## విద్యాభివృద్ధికి అంగన్‌వాడీ కేంద్రాలు

### అంగన్‌వాడీ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే,ఎమ్మెల్సీ శంకుస్థాపన



**ప్రజాపక్షం/తుర్కపల్లి:** యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం గోపాలపురం గ్రామంలో నూతన అంగన్వాడి భవన నిర్మాణానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యేబీర్ల అయిలయ్య, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం ముఖ్య అతిథులుగా హాజరై శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారిరువురు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో చిన్నారుల పోషణ, ప్రాథమిక విద్యాభివృద్ధికి అంగన్వాడి కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా కృషి చేస్తున్నామన్నారు. మల్లన్న జాతరలో పాల్గొన్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ తుర్కపల్లి మండలంలోని పల్లెపహాడ్, రుస్తాపురం గ్రామంలో జరిగిన మల్లన్న జాతరలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోపాల్ పురం గ్రామ సర్పంచ్ పుట్ట సాయిలు ముదిరాజ్ పాల్గొన్నారు.

## ప్రజా భాగస్వామ్యంతోనే జిల్లా సమగ్రాభివృద్ధి

### రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శం

### నల్లగొండ జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్





**ప్రజాపక్షం/నల్లగొండ** : జిల్లాను అన్ని రంగాలలో అభివృద్ధి,నిర్మాణాత్మకంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు. 77వ గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా నల్లగొండ జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.ఎమ్మెల్సీ లు నెల్లికంటి సత్యం,శంకర్ నాయక్,జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్ లతో కలసి పోలీసు గౌరవ వందనాన్ని స్వీకరించిన అనంతరం జిల్లా కలెక్టర్ ప్రసంగించారు.జనవరి 26 మనందరికి పండుగ రోజు ప్రపంచంలోనే గొప్ప సర్వసత్తాక, సామ్యవాద,లౌకిక, ప్రజాస్వామ్య,గణతంత్ర దేశంగా భారతదేశమును నిలుపుకునేందుకు భారతరత్న డాక్టర బిఆర్ అంబేద్కర్ సారథ్యంలో భారత రాజ్యాంగం 1950,జనవరి 26న అమలులోకి తెచ్చుకున్నాం.భారత దేశ స్వాతంత్య్రం కోసం పోరాటం సాగించిన అమరవీరులకు,భారత రాజ్యాంగం రూపొందించిన రాజ్యాంగవేత్తలకు ఈ సందర్భంగానా జోహార్లు అర్పించారు.అనేక ఉద్యమాలు,పోరాటాల ఫలితంగా 2014 జూన్ 2న తెలంగాణ రాష్ట్రం సాధించుకున్న విషయము మనందరికీ తెలుసు.రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు జిల్లాలో అమలవుతున్న పలు అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయి అన్నారు. అనంతరం స్వతంత్ర సమర యోధులను సన్మానించారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు హఫీజ్ ఖాన్,రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్,స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై.అశోక్ రెడ్డి,అడిషనల్ ఎస్పి రమేష్,మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాసరెడ్డి,వివిధ శాఖల అధికారులు, పాల్గొన్నారు.

## భారతదేశం ప్రపంచలోనే గొప్ప సర్వసత్తాక లౌకిక రాజ్యం

### సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్



**ప్రజాపక్షం/సూర్యాపేట:** మన దేశం ప్రపంచంలోనే గొప్ప సర్వసత్తాక, సామ్యవాద, లౌకిక ప్రజాస్వామ్య గణతంత్ర దేశంగా నిలిపిన ఘనత భారత రత్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌కే దక్కిందని జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్ లాల్ పవార్ అభిప్రాయపడ్డారు. ఆయన సారథ్యంలోనే భారత రాజ్యాంగం 1950 జనవరి 26న అమల్లోకి తెచ్చుకున్నామన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల ప్రగతిని ప్రజలకు తెలియజేసినందుకు సంతోషిస్తున్న ట్లు ఈ సందర్భంగా ప్రకటించారు. మహాలక్ష్మి ప థకంలో భాగంగా జిల్లాలో ఇప్పటి వరకు మొ త్తం 4కోట్ల 32 లక్షల మంది మహిళ ప్రయాణికులు ఉచిత ప్రయాణాన్ని పొంది 250 కోట్ల 75 లక్షల మొత్తాన్ని ఆదా చేసుకోవడం జరిగిందన్నారు.

**ఆకట్టుకున్న సంస్కృతిక ప్రదర్శనలు**

గిరిజన బాలికల అశ్రమ పాఠశాల చివ్వెంల ప్రభుత్వ ఉన్నత పాఠశాలసూర్యాపేట శ్లోక వైష్ణవి పాఠశాలలకు చెందిన విద్యార్థులచే చేపట్టిన సంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. విద్యార్థులతో జిల్లా కలెక్టర్, ఎస్పి లు ఫోటోలు దిగి వారిని ప్రోత్సహించారు.

**స్టాల్స్ ప్రదర్శన** : పోలీస్, గ్రామీణాభివృద్ధి సంస్థ, ఆటవిశాఖ, పౌర సరఫరాలశాఖ, జిల్లా సంక్షేమ, మెప్మా, వైద్య ఆరోగ్యశాఖ, ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ సంక్షేమశాఖలు, మత్స్యశాఖ, మిషన్ బగీరథ, విద్యాశాఖ, అగ్నిమాపక, యువజన సర్వీసులు, క్రీడల శాఖ, హౌసింగ్, వ్యవసాయ, ఉద్యానవన, రవాణశాఖ, పశు సంవర్ధక శాఖలతో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను జిల్లా ఎస్పి కలిసి కలెక్టర్ సందర్శించారు.

**ప్రశంస పత్రాలు అందజేత** : జిల్లాలో విధి నిర్వహణలో అత్యంత ప్రతిభ చూపెట్టిన వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులకు, పోలీసులకు, ఉద్యోగులకు, సిబ్బందికి ప్రశంస ప్రతాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ సీతరామారావు, అదనపు ఎస్పి రవీందర్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, నర్సింహాచారి, అర్డీవో వేణుమాదవ్, జిల్లా అధికారులు, సిబ్బంది హాజరయ్యారు.

## సంక్షేమ ఫలాలు ప్రతి గడపకూ చేరాలి

### యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు పిలుపు



**ప్రజాపక్షం /యాదాద్రి** : ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన వారందరికీ అందించడమే లక్ష్యంగా జిల్లా అధికార యంత్రాంగం చిత్తశుద్ధితో పనిచేస్తుందని జిల్లా కలెక్టర్ హనుమంత రావు తెలిపారు. సోమవారం 77వ భారత గణతంత్ర దినోత్సవ వేడుకలను జిల్లా కలెక్టరేట్ ఆవరణలో స్థానిక సంస్థల, రెవెన్యూ అదనపు కలెక్టర్ భాస్కర్ రావుతో కలిసి జిల్లా కలెక్టర్ హనుమంతరావు డా.బి ఆర్ అంబేద్కర్, మహాత్మా గాంధీ చిత్ర పటాలకు పూల మాల వేసి నివాళులు అర్పించి, జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం భువనగిరి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల నందు ఏర్పాటు చేసిన గణతంత్ర దినోత్సవ కా ర్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై డీసీపీ అక్షాంక్ష్ యాదవ్ తో కలిసి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, ఎస్పీ అక్షాంష్ యాదవ్, ఇతర అధికారులు మరియు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. జి ల్లాలో అమలవుతున్న వివిధ పథకాల ప్రగతిని కలెక్టర్ వివరించారు. జిల్లాలో ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహిస్తూ 4,500 ఎకరాల్లో సాగు చేపట్టగా, ఖరీఫ్ సీజన్లో 3.19 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రూ. 758 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద 9,735 మందికి ఇళ్లు మం జూరు చేసి, నిర్మాణ దశను బట్టి రూ. 195.10 కోట్లు అందజేశారు. నీటి పారుదల రంగంలో ప్యాకేజీ15 పనులు 79.88% పూర్తి కాగా, ప్యాకేజీ16 ద్వారా 1.65 లక్షల ఎకరాలకు సాగునీరు అం దించే పనులు వేగంగా జరుగుతున్నాయి. జిల్లా ప్రజల చిరకాల వాంఛ అయి న గంధమల్ల జలాశయానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారని, దీని ద్వారా 56 వేల ఎకరాలకు లబ్ధి చేకూరుతుందని కలెక్టర్ తెలిపారు. వైద్య రంగంలో ఆరోగ్య శ్రీ పరిమితిని రూ. 10 లక్షలకు పెంచి, జిల్లాలో 15,105 మందికి ఉచితంగా శస్త్రచికిత్సలు నిర్వహించినట్లు తెలిపారు. ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు : ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జరిగిన ప్రధాన వేడుకల్లో వివిధ పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, దేశభక్తి రూపకాలు ప్రజలను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా వికలాంగులకు బ్యాటరీ వాహనాలు, ల్యాప్టాప్లు, వీల్ చైర్లను కలెక్టర్ పంపిణీ చేశారు.



## భారత రాజ్యాంగాన్ని ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకుందాం : పల్లా

**ప్రజాపక్షం/దేవరకొండ :** భారత రాజ్యాంగాన్ని ప్రజా స్వామ్యాన్ని పరిరక్షించుకునే బాధ్యత ప్రతి భారతీయునిపై ఉందని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి అన్నారు. సోమవారం 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా సిపిఐ దేవరకొండ పల్లా పర్వత్‌రెడ్డి భవన్‌లో భారత రాజ్యాంగ నిర్మాత డా. బిఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జాతీయ జెండాను నర్సింహారెడ్డి ఎగరవేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగ అమలు ఈరోజు దేశ వ్యాప్తంగా పంగడ రోజని భారత రాజ్యాంగం పట్ల ప్రతి ఒక్కరు విశ్వాస పాత్రులుగా, దేశం పట్ల భక్తి భావంతో మెలగాలని అన్నారు. భారత రాజ్యాంగ ఫలాలు ప్రతి ఒక్కరికి చేరాలని ఆకాంక్షించారు. సిపిఐ పట్టణ కార్యదర్శి వలమల్ల ఆంజనేయులు అధ్యక్షతన జరిగిన ఈకార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి నూనె రామస్వామి, మండల కార్యవర్గ సభ్యులు వెంకట్రాములు, నీలా వెంకటయ్య, పట్టణ సహాయ కార్యదర్శులు జ్యోతిబస్, నగేష్, పట్టణ ఏరియా శాఖ కార్యదర్శులు, సభ్యులు మైనోద్దిన్, బుచ్చయ్య, వెంకటయ్య, మల్లయ్య, శ్రీను, మల్లేష్, ఏఐఎస్ఎఫ్ డివిజన్ కార్యదర్శి శివకుమార్, పట్టణ సమితి సభ్యులు శ్రీను, ఆనందచారి, గిరి, వాహబ్, బ్రహ్మచారి, మోహన్‌బాబు పాల్గొన్నారు.

## కార్మిక, రైతు వ్యతిరేక చట్టాలు రద్దు చేయాల్సిందే

### ఎస్‌కెఎం జాతీయ కమిటీ పిలుపులో భాగంగా సూర్యాపేట జిల్లాలో బైకు ర్యాలీ



**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** కేంద్రంలో అధికారంలో ఉన్న బిజేపి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు వ్యవసాయ కార్మిక వ్యతిరేక విధానాలను విడనాడాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, న్యూడెమోక్రసి జిల్లా కార్యదర్శి మండారి డేవిడ్‌కుమార్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు, ఎంసిపిఐటియు రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వరికుప్పల వెంకన్నలు డిమాండ్ చేశారు. సోమవారం ఎస్‌కెయం జాతీయ కమిటి పిలుపులో భాగంగా సూర్యాపేట జిల్లా కేంద్రంలో బాలాజీ రైస్ మిల్లు నుండి కొత్త బస్టాండ్ , శంకర్ విలాస్, పోస్టాఫిక్, పూల సెంటర్, పొట్టి శ్రీరాములు సెంటర్, రాఘవప్లాజా, నల్లాల బావి సెంటర్, ఏపూరి బస్టాండ్ మీదుగా వాణిజ్య భవన్ వరకు బైకు ర్యాలీ నిర్వహించారు. నరేంద్రమోడి సర్కార్ పాలనలో ప్రజా వ్యతిరేక రైతు కార్మిక వ్యవసాయ కార్మిక వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న సమస్యలన్ని పరిష్కరించాల్సింది పోయి కొత్త సమస్యలను తీసుకవస్తున్నారని అన్నారు. మహాత్మాగాంధీ పేరును తొలగించడమే ప్రధాన ఉద్దేశ్యంతో పలకడానికి వీలు లేనటువంటి హిందీ, ఇంగ్లీష్ పదాలతో కూడిన వికాసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్గార్ అండ్ అజీవిక మిషన్ (గ్రామీణ) అనే కొత్త చట్టాన్ని తీసుకవచ్చారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మట్టపల్లి సైదులు, దూళిపాళ ధనుంజయనాయుడు, బొడ్డు శంకర్, కంబాల పల్లి శ్రీను, కందాల శంకర్‌రెడ్డి, షేక్ నజీర్, గంటా నాగయ్య, పులుసు సత్యం, వల్లభూజ సాయికుమార్, బత్తుల సుధాకర్; మందడి రామ్‌రెడ్డి, నాగిరెడ్డి శేఖర్‌రెడ్డి, నారాయణ, వీరారెడ్డి, లక్ష్మి నారాయణ, బూర వెంకటేశ్వర్లు, చామల అశోక్‌కుమార్, చిలకరాజు శ్రీను, దేశగాని హేమలత, సైదులు, నల్లగొండ నాగయ్య పాల్గొన్నారు.

## ఏఐటియుసి ఆధ్వర్యంలో గణతంత్ర దినోత్సవ వేడుకలు

**ప్రజాపక్షం/భువనగిరి** : 77వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏఐటీయూసీ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో భువనగిరి కొత్త బస్టాండ్ వద్ద బిడిఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షులు మెరుగు మధు, స్వర్ణగిరి, రేణుక ఎల్లమ్మ తల్లి ఆటో స్టాండ్‌ల వద్ద జాతీయ జెండాను ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎండీ ఇమ్రాన్ ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ భారత రాజ్యాంగం కల్పించిన హక్కులు కార్మిక వర్గానికి పూర్తిగా అమలయ్యేలా పోరాటాలు కొనసాగించడం ఏఐటీయూసీ లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి మాటూరి అశోక్, ఆనంద్, ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యులు సామల శోభన్ బాబు, ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షులు గనబోయిన వెంకటేష్, ప్రధాన కార్యదర్శి సామల భాస్కర్, పుట్ట రమేష్, చింతల మల్లేష్, గొర్ల లక్ష్మ ణ్, కొత్త కృష్ణ, పుట్ట రాజు, దుర్గ, కరీం, షరీఫ్, శేఖర్, శ్రీశైలం, సాయి, తదితరులు పాల్గొన్నారు.



## ఉమ్మడి జిల్లాలో ఫుడ్ సేఫ్టీ అధికారులమని బెదిరింపులు

### నకిలీ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ల మోసాలపై హెచ్చరిక : జ్యోతిర్మయి

**ప్రజాపక్షం/నల్లగొండ** : ఉమ్మడి జిల్లాలో కొందరు వ్యక్తులు తాము ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌లు లేదా ఫుడ్ సేఫ్టీ అథారిటీ అధికారులమని చెప్పుకుంటూ ఆహార వ్యాపారులను బెదిరిస్తున్న ఘటనలు వెలుగులోకి వచ్చాయి. శ్రీకాంత్ రెడ్డి, విక్రమ్ నాయుడు,శ్రీనివాస్ నాయక్ అనే పేర్లతో కొందరు నకిలీ వ్యక్తులు జిల్లాలో తిరుగుతూ మోసాలకు పాల్పడుతున్నట్లు ఫుడ్ సేఫ్టీ విభాగం గుర్తించింది. 8074735461, 7386160150, 8886397761 అనే మొబైల్ నంబర్లను ఉపయోగించి ఈ నకిలీ వ్యక్తులు కిరాణా షాపులు,హోటళ్లు,రెస్టారెంట్లు,బేకరీలు,స్వీట్ షాపులు,టిఫిన్ సెంటర్లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, మీట్ షాపులు, చికెన్‌మటన్ షాపులు, ఫ్రూట్ జ్యూస్ సెంటర్లు,క్యాటరింగ్ యూనిట్లు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, హోల్‌సేల్ మరియు రిటైల్ ఫుడ్ గోదాములు వంటి అన్ని రకాల ఆహార వ్యాపార సంస్థలకు ఫోన్ చేసి లేదా ప్రత్యక్షంగా వెళ్లి అధికారులమని చెప్పుకుంటూ బెదిరింపులకు పాల్పడుతున్నట్లు ఫిర్యాదులు అందాయి. మిర్యాలగూడ,నల్లగొండ, హాలియా,సూర్యాపేట, కోదాడ,చౌటుప్పల్ తదితర ప్రాంతాల్లో షాప్ సీజ్ చేస్తాం..లైసెన్స్ రద్దు చేస్తాం..కేసులు నమోదు చేస్తాం అంటూ భయపెట్టే మాటలతో వ్యాపారులను ఒత్తిడికి గురి చేస్తున్నారని ఫుడ్ సేఫ్టీ అధికారులు తెలిపారు.ఇటువంటి చర్యలు పూర్తిగా చట్ట విరుద్ధమని స్పష్టం చేశారు. అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ శ్రీమతి వి. జ్యోతిర్మయి మాట్లాడుతూ ఫుడ్ సేఫ్టీ అధికారులు ఈ విధంగా ఫోన్ కాల్స్ చేసి హెచ్చరికలు ఇవ్వడం,బెదిరింపు స్వరంలో మాట్లాడడం లేదా తక్షణ చర్యలు తీసుకుంటామని చెప్పడం అధికారిక విధానం కాదన్నారు. అధికారిక తనిఖీలు ఎప్పుడూ చట్టబద్ధమైన ప్రక్రియ ప్రకారమే, ప్రభుత్వ గుర్తింపు కార్డుతో, రాతపూర్వక విధానంలో మాత్రమే నిర్వహిస్తామని తెలిపారు.అనుమానాస్పద కాల్స్ లేదా వ్యక్తులు ఎదురైతే వ్యాపారులు ఎట్టి పరిస్థితుల్లోనూ స్పందించవద్దని సూచించారు.వెంటనే సమీప ఫుడ్ సేఫ్టీ అధికారి,జిల్లా ఫుడ్ సేఫ్టీ కార్యాలయం లేదా స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. ప్రజల ఆరోగ్యం,ఆహార భద్రత, వ్యాపారుల హక్కుల రక్షణే ఫుడ్ సేఫ్టీ విభాగం ప్రధాన లక్ష్యమని,నకిలీ వ్యక్తుల మోసాలకు తావు లేకుండా అందరూ అప్రమత్తంగా ఉండాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

## కమనీయం... రమణీయం కైలాసగిరి వాసుడి కల్యాణం

### ఓంకార నామ స్మరణతో మారుమోగిన చెర్వుగట్టు క్షేత్రం

### పెళ్లి కొడుకు,పెళ్లి కూతుర్లగా భక్తులకు దర్శనం

### తలంబ్రాలు,పట్టు వస్త్రలు అందించిన ఎమ్మెల్యే వీరేశం





**ప్రజాపక్షం/నార్కెట్‌పల్లి:** శైవ క్షేత్రాల్లో అత్యంత ప్రాధాన్యత పొంది,తెలంగాణలో రెండవ శ్రీశైలంగా పేరుగాంచిన నల్లగొండ జిల్లా నార్కెట్ పల్లి మండలం చెర్వుగట్టు శ్రీపార్వతీ జడల రామలింగేశ్వర స్వామి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి.బ్రహ్మోత్సవాలలో భాగంగా ప్రధాన ఘట్టమైన పార్వతి పరమేశ్వరుల కళ్యాణ మహోత్సవం మాఘ శుద్ధ రథ సప్తమి సోమవారం తెల్లవారుజామున లక్షలాది భక్తుల శివ నామ స్మరణలతో వేద మంత్రాల సాక్షిగా రథసప్తమి తిథిని పురస్కరించుకొని సూర్య భగవానుని కిరణాలు స్వామి అమ్మవారులను తాకుతుండగ మాంగళ్య ధారణ కార్యక్రమాన్ని అంగరంగ వైభోవోపేతంగా,కన్నుల పండుగగా నిర్వహించారు. ఆదిదంపతులగు పార్వతీ పరమేశ్వరుల కళ్యాణంతో చెర్వుగట్టు పులకరించింది.స్వామివారి కల్యాణ తంతు ఆది నుండి నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం దంపతుల చేతుల మీదుగా జరిపించారు. స్వామి వారికి ప్రభుత్వం తరపున పట్టు వస్త్రలను ఎమ్మెల్యే దంపతులు సమర్పించారు. కళ్యాణ మహోత్సవంలో నల్లగొండ ఆర్‌డిఓ అశోక్ రెడ్డి, బ్రహ్మోత్సవాల ప్రత్యేక అధికారి,ఆలయ అసిస్టెంట్ కమీషనర్ భాస్కర్,ఆలయ కార్యనిర్వహణ అధికారి మోహన్ బాబు,ఉత్సవ కమిటీ చైర్మన్ వారాల రమేష్,ధర్మకర్తలు,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బత్తుల ఉశయ్య, స్థానిక సర్పంచ్ నేతగాని కృష్ణ,వడ్డే గోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

**జనగట్టుగా..చెరువుగట్టు క్షేత్రం ..**

శ్రీపార్వతీ జడల రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా అత్యంత ప్రాధాన్యతను సంతరించుకున్న శివ పార్వతుల కల్యాణమును విక్షించేందుకు తెలంగాణ రాష్ట్రం నుంచే కాకుండా అంతర్ రాష్ట్రాల నుంచి లక్షలాది మంది భక్తులు ఆదివారం రాత్రి నుంచే గట్టు పైకి చేరుకున్నారు.

**ప్రసాదాల కౌంటర్లు పెంచాం : ఆలయ ఈవో మోహన్ బాబు**

స్వామివారి కల్యాణానికి రాష్ట్ర నలుమూలల నుండి తలంబ్రాలు సమర్పించడానికి వచ్చే భక్తులకు ఏటేటా వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అధిగమించేలా చర్యలు చేపట్టామని ఆలయ ఈవో మోహన్ బాబు తెలిపారు.

**వేయి మంది పోలీస్‌లతో ప్రత్యేక బందోబస్త్ : డిఎస్‌పి శివరాం రెడ్డి**

బ్రహ్మోత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు గట్టిబందో బస్తు ఏర్పాటు చేశారు. భారీగా తరలి వచ్చే భక్తులు తొక్కిసలాట జరగొద్దనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన బారికేడ్లలో భక్తులు భారీగా క్యూలైన్లో నిలబడి దర్శించుకున్నారు. భక్తులను అదుపు చేసేందుకు నల్లగొండ డిఎస్‌పి శివరాం రెడ్డి సారథ్యంలో నార్కట్ పల్లి సీఐ కె నాగరాజు,ఎస్ఐ విష్ణుమూర్తిల ఆధ్వర్యంలో భారీ బందోబస్తును నిర్వహించి డ్రోన్ కెమెరాలతో నడకదారిలో భక్తులకు ఇక్కట్లు కలగకుండా ఏర్పాట్లు చేశామన్నారు.



## టిడిపి కార్యాలయంలో ఘనంగా గణతంత్ర దినోత్సవం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా తెలుగుదేశం హైదారాబాద్ జిల్లా కార్యాలయంలో జాతీయ జెండాను పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు ఎం.అరవింద్ కుమార్ గౌడ్ ఆవిష్కరించారు. అరవింద్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ రాజ్యాంగ విలువలను కాపాడుకోవడానికి అందరం కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు నల్లెల్ల కిషోర్, పి.బాలరాజ్ గౌడ్, పరుశురాం, మేడిపల్లి శ్యాంసుందర్, రాజేందర్ ప్రసాద్(ఆర్.పి), కరణం కిరణ్, భాను ప్రకాష్, ఓ.వెంకటేశ్ చౌదరి, చంద్రమోహన్ గౌడ్ పాల్గొన్నారు.

## యువతకు ఉపాధి గ్యారంటీ

ఇఎస్‌సిఐలో త్వరలో 'ఈవీ బ్యాటరీ ఇంజనీరింగ్' కోర్సు

ఇఎస్‌సిఐ డైరెక్టర్ డాక్టర్ జి.రామేశ్వర్ రావు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా (ఈఎస్‌సిఐ) 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు గచ్చిబౌలిలో ఘనంగా జరిగాయి. కాలేజీ డైరెక్టర్ డాక్టర్ జి.రామేశ్వర్ రావు త్రివర్ణ పతకాన్ని ఆవిష్కరించి, విద్యార్థులకు, సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన కీలక ప్రకటన చేస్తూ యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా ఈ విద్యా సంవత్సరం నుండి 'ఎలక్ట్రిక్ వెహికల్ (ఈవీ) బ్యాటరీ ఇంజనీరింగ్' కోర్సును ప్రవేశపెడుతున్నట్లు వెల్లడించారు. ఫీజు కేవలం రూ.20,000 మాత్రమే అని తెలిపారు. 600 గంటల అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ శిక్షణ, ప్రముఖ బ్యాటరీ తయారీ సంస్థలతో ఒప్పందాలు, కోర్సు పూర్తి చేసిన వారికి ఉద్యోగ హామీనిచ్చారు. రిలయన్స్ జియో సహకారంతో కాలేజీలో 30 పాయింట్లతో కూడిన భారీ ఈవీ ఛార్జింగ్ స్టేషన్ ఏర్పాటు చేస్తామన్నారు. ఈఎస్‌సిఐని త్వరలోనే ఒక యూనివర్సిటీగా మార్చడమే తన లక్ష్యమని, సాలిడ్‌వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్రాంగణాన్ని కూడా త్వరలో ప్రారంభిస్తామని రామేశ్వర్ రావు తెలిపారు. ఈ వేడుకల్లో కాలేజీ చీఫ్ ఫైనాన్స్ ఆఫీసర్ లక్ష్మి కాంత రావు, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.అశోక్, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

## అనుమతి రెండు ఫోర్లు

అక్రమం మరో రెండు ఫోర్లు

హైకోర్టు ఎదురుగానే అక్రమ నిర్మాణం

నో ఫైర్ సేఫ్టీ.. ఫిర్యాదులు బుట్టదాఖలు




**ప్రజాపక్షం/చార్మినార్:** అక్రమ నిర్మాణాలు అమాయకుల ప్రాణాలను బలిగొంటున్నాయి. ప్రమాదాల్లో అమాయకులు మృత్యువాత పడుతున్నా.. అధికారులు తూతూమంత్రంగా చర్యలు చేపడుతున్నారు. ఈ క్రమంలోనే హైకోర్టుకు ఎగురుగా ఓ వ్యక్తి రెండు ఫ్లోర్ల నిర్మాణానికి అనుమతి పొంది.. నాలుగు ఫోర్లు నిర్మాణం చేపట్టారు. ఈ విషయంపై స్థానికులు ఫిర్యాదు చేసినా మొగల్‌పురా బల్దియా అధికారులు పట్టించుకోవడం లేదు. ఇక పార్కింగ్ స్థలంలో వాణిజ్య కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. అంతేకాకుండా పార్కింగ్ సదుపాయం లేకున్నా.. ఫైర్ సేఫ్టీ లేకున్నా.... సంబంధిత ట్రాఫిక్ పోలీసులు, బల్దియా, హైడ్రా అధికారులు ఎందుకు చర్యలు చేపట్టడం లేదని స్థానికులు మండిపడుతున్నారు. ఏకంగా హైకోర్టు గేట్ నెం 6కు ఎదురుగానే అక్రమ నిర్మాణాలు పుట్టుకొస్తుంటే... ఇక ఇతర ప్రాంతాల్లో పరిస్థితి ఏమిటి? అనేది ఆందోళన కలిగించే అంశంగా మారింది. ఏదేమైనా చార్మినార్ జోనల్ కమిషనర్ స్పందించి అక్రమ నిర్మాణాల విషయంలో కఠిన చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

## పోలీసుల ఆరోగ్య భద్రతకు 'హెల్త్ ప్రొఫైల్' : విసి సజ్జనార్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** పోలీసు సిబ్బంది సంక్షేమం, ఆరోగ్య భద్రతే లక్ష్యంగా హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలోని ప్రతి ఒక్కరికీ వైద్య పరీక్షలు నిర్వహించి, ప్రత్యేకంగా వారి 'హెల్త్ ప్రొఫైల్స్' సిద్ధం చేయనున్నట్లు నగర పోలీస్ కమిషనర్ విసి సజ్జనర్ వెల్లడించారు వైద్య పరీక్షల రిపోర్టుల ఆధారంగా వారిని ఏ, బి,సి,డి, ఇ కేటగిరీలుగా విభజించి, వారి ఆరోగ్య పరిస్థితికి అనుగుణంగా తగిన జాగ్రత్తలు, చికిత్స అందేలా చూస్తామని ఆయన తెలిపారు. పేట్ల బురుజులోని సిటీ ఆర్మ్డ్ రిజర్వ్ (సిఎఆర్) హెడ్ క్వార్టర్స్‌లో నిర్వహించిన వేడుకల్లో హైదరాబాద్ సిపి విసి సజ్జనర్ పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.

### సాహసపరులను అభినందనలు..

ఇటీవల నాంపల్లిలోని ఫర్నిచర్ షాప్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు ఆయన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ ప్రమాద సమయంలో ప్రాణాలకు తెగించి సాహసోపేత సేవలు చేసిన దినేష్, మహమాద్ జకీర్, కలీం, రహీం, అమర్ తో పాటు చొరవ చూపిన కార్పొరేటర్లు సురేఖ ఓం ప్రకాశ్, జఫర్ ఖాన్ కు అభినందనలు తెలిపారు.

## ఇక జనన-మరణ ధృవీకరణ పత్రాల జారీ
# మరింత సులభం

సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

జిహెచ్‌ఎంసి ముఖ్య వైద్యాధికారిణి డాక్టర్ పద్మజ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మహానగరంలో పరిధిలో జనన మరణ ధృవీకరణ పత్రాల నమోదు, జారీ ప్రక్రియను మరింత సులభతరం చేస్తూ నూతన సాఫ్ట్‌వేర్ అప్లికేషన్‌ను జిహెచ్‌ఎంసి అధికారులు అందుబాటులోకి తీసుకొచ్చారు. 27అర్బన్ లోకల్ బాడీల విలీనంతో పాటు, వార్డుల సంఖ్యను 150 నుంచి 300కి, సర్కిళ్లను 30 నుంచి 60కి, జోన్‌లను 6 నుంచి 12కి పెంచిన నేపథ్యంలో ఈ వ్యవస్థను పునర్వ్యవస్థీకరించారు. ఈ మార్పులకు అనుగుణంగా పాత వ్యవస్థలో తలెత్తుతున్న ఇబ్బందులను తొలగించేందుకు సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ (సిజిజి) సహకారంతో మ్యాపింగ్ ప్రక్రియను పూర్తి చేశారు. ఈ ప్రక్రియ అనంతరం జిహెచ్‌ఎంసి పరిధిలో జనన, మరణాల నమోదు, ధృవీకరణ పత్రాల జారీకి సంబంధించిన సాఫ్ట్‌వేర్ అప్లికేషన్‌ను ప్రారంభించారు. ఈ నూతన వ్యవస్థతో జనన మరణ ధృవీకరణ పత్రాల నమోదు, జారీ ప్రక్రియ మరింత పారదర్శకంగా, వేగవంతంగా సాగనుందని జిహెచ్‌ఎంసి ముఖ్య వైద్యాధికారి డాక్టర్ పద్మజ వెల్లడించారు. ఈ సరికొత్త వ్యవస్థతో డేటా నమోదులో తప్పులు దొర్లకుండా ఉండటమే కాకుండా, ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరం లేకుండా వేగంగా పత్రాలు పొందే అవకాశం కలిగిందని చెప్పారు.

### కొత్త వ్యవస్థ వివరాలు..

**పూర్తి స్థాయి మ్యాపింగ్ :** నగరంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ ఆరోగ్య కేంద్రాలను 60 సర్కిళ్లు, 300 వార్డులకు అనుసంధానించారు.

**కొత్త అప్లికేషన్ :** జననమరణాల నమోదు కోసం ప్రత్యేకంగా రూపొందించిన సాఫ్ట్‌వేర్ అప్లికేషన్‌ను విజయవంతంగా ప్రారంభించారు.

**మీసేవా ద్వారా సేవలు :** పౌరులు తమకు సమీపంలోని మీసేవా కేంద్రాల ద్వారా సులభంగా ఈ ధృవీకరణ పత్రాలను పొందేలా వీలు కల్పించారు.

'పెరిగిన వార్డులు, సర్కిళ్లకు అనుగుణంగా సాంకేతిక వ్యవస్థను ఆధునీకరించాం. దీనివల్ల ప్రజలకు ధృవీకరణ పత్రాల జారీలో జాప్యం ఉండదు. పౌరులందరూ ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలి' అని డాక్టర్ పద్మజ తెలిపారు.

## స్వచ్ఛత, ప్రజారోగ్యమే లక్ష్యం

గణతంత్ర వేడుకల్లో జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్ మహా నగర పౌరుల జీవన ప్రమాణాలు మెరుగుపరచడమే లక్ష్యంగా పౌర సదుపాయాల కల్పన, స్వచ్ఛత, ప్రజారోగ్యానికి అత్యధిక ప్రాధాన్యతనిస్తున్నట్లు జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్ తెలిపారు. జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయంలో జరిగిన 77వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో సోమవారం ఆయన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళల ఆర్థిక స్వావలంబన కోసం జిహెచ్‌ఎంసి భారీగా నిధులు కేటాయించింది. 7,127 స్వయం సహాయక సంఘాలకు రూ.855 కోట్లను చెక్కుల రూపంలో అందజేశారు. 4 ట్రాన్స్‌జెండర్ స్వయం సహాయక సంఘాలకు రూ.19.5 లక్షల రుణాలు మంజూరు చేశారు. జ్యూట్ బ్యాగుల తయారీ ద్వారా ఉపాధి పొందుతున్న 'ప్రేమ్ లీల ట్రాన్స్‌జెండర్ గ్రూప్'కు రూ.6 లక్షల ఆర్థిక సాయం అందజేశారు. 9మంది దివ్యాంగులకు వీల్ చైర్లు, వినికిడి పరికరాలు, చంక కర్రలను మేయర్, కమిషనర్లు పంపిణీ చేశారు.

### అభివృద్ధి పథంలో గ్రేటర్ హైదరాబాద్

కమిషనర్ తన సందేశంలో నగర విస్తరణ, సాధించిన మైలురాళ్లను వివరించారు. 27మున్సిపాలిటీల విలీనంతో జిహెచ్‌ఎంసి విస్తీర్ణం 2,053 చ.కి.మీలకు పెరిగి, జనాభా 1.34కోట్లకు చేరిందన్నారు. దీంతో దేశంలోనే



అతిపెద్ద పురపాలికగా హైదరాబాద్ అవతరించిందన్నారు. మెరుగైన సేవల కోసం వార్డుల సంఖ్యను 150 నుండి 300కి, సర్కిళ్లను 60కి, జోన్లను 12కి పెంచినట్లు తెలిపారు. 2025లో స్వచ్ఛ సర్వేక్షణ్‌లో దేశంలోనే 6వ స్థానం సాధించడంతో పాటు, 7స్టార్ గార్బేజ్ ఫ్రీ సిటీ హోదాను దక్కించుకోవడం గర్వకారణమన్నారు. గడిచిన ఏడాది కాలంలో జిహెచ్‌ఎంసి తీసుకున్న పటిష్ట చర్యల వల్ల డెంగీ కేసుల సంఖ్య 30శాతం మేర తగ్గడం (2,806 నుండి 1,976కి) విశేషమని, ఇందుకు కేంద్ర ప్రభుత్వం నుండి ప్రశంసలు లభించాయని కమిషనర్ తెలిపారు. జిఐఎస్ ఆధారిత పర్యవేక్షణ, మెట్రోపాలిటన్ సర్వైలెన్స్ యూనిట్ల పనితీరు ఇందుకు దోహదపడ్డాయని వివరించారు. నగర అభివృద్ధిలో పౌరుల భాగస్వామ్యం అత్యంత కీలకం. సకాలంలో పన్నులు చెల్లించి, నగరాన్ని స్వచ్ఛంగా ఉంచడంలో ప్రతి ఒక్కరూ సహకరించాలి' అని కమిషనర్ ఆర్.వి. కర్ణన్ విజ్ఞప్తి చేశారు.

## విస్తరణతో మళ్లీ దేశంలోనే అగ్రస్థానానికి మెట్రోరైల్

హెచ్ఎంఆర్ఎల్ ఎం.డి. సర్ఫరాజ్ అహ్మద్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్ మెట్రో రైలును దేశంలోనే మళ్లీ నెంబర్ వన్ స్థానంలో నిలిపేందుకు సమిష్టిగా కృషి చేయాలని హైదరాబాద్ మెట్రో రైలు లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ సర్ఫరాజ్ అహ్మద్ అన్నారు. 77వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా మెట్రో రైల్ భవన్‌లో ఆయన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.

### కీలక దశలో మెట్రో ప్రాజెక్టు

గత ఏడాది హెచ్ఎంఆర్ఎల్ చరిత్రలో అత్యంత ప్రాధాన్యత కలిగినదిగా నిలిచిందని సర్ఫరాజ్ అహ్మద్ అన్నారు. ముఖ్యంగా ప్రస్తుతం ఆపరేషన్‌లో ఉన్న 69 కిలోమీటర్ల మెట్రో లైన్‌ను ప్రభుత్వం స్వాధీనం చేసుకునే ప్రక్రియ తుది దశకు చేరుకుందని ఆయన వెల్లడించారు. ఇది సంస్థకు ఒక కొత్త మలుపు అని ఆయన తెలిపారు.

### రెండో దశ పనులు వేగవంతం

హైదరాబాద్ మెట్రో రెండో దశ విస్తరణకు సంబంధించి ఆయన పలు కీలక అంశాలు వెల్లడించారు.

రెండో దశ కారిడార్ల కోసం భూసేకరణ ప్రక్రియ ఇప్పటికే మొదలైంది.

అదనపు కారిడార్ల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్.

త్వరలోనే ఈ కారిడార్ల నిర్మాణ పనులు క్షేత్రస్థాయిలో ప్రారంభమవుతాయి.

### ఢిల్లీ మెట్రోతో పోలిక.. లక్ష్యం మళ్లీ అగ్రస్థానమే!

హైదరాబాద్ మెట్రో ప్రారంభ దశలో దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మక ప్రాజెక్టుగా ఉండేదని ఆయన గుర్తు చేశారు. 'హైదరాబాద్ మెట్రో మొదటి దశ ప్రణాళిక ఢిల్లీ మెట్రో ఫేజ్1 కంటే పెద్దదిగా రూపొందించింది. అయితే, కాలక్రమేణా ఢిల్లీ మెట్రో సుమారు 400 కిలోమీటర్లకు విస్తరించగా, హైదరాబాద్ మాత్రం 69 కిలోమీటర్ల వద్దే నిలిచిపోయింది' అని సర్ఫరాజ్ అహ్మద్ తెలిపారు. ఈ గ్యాప్‌ను భర్తీ చేస్తూ, నగర రవాణా రంగంలో హైదరాబాద్‌ను మళ్లీ దేశంలోనే అగ్రగామిగా మార్చడమే లక్ష్యంగా నిర్దేశించుకున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంఆర్ఎల్ చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ డి.వి.ఎస్. రాజు, ఇతర సీనియర్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## చెరువులు, నాలాల పరిరక్షణతోనే విపత్తుల నియంత్రణ

హైడ్రా అదనపు డైరెక్టర్ వర్ల పాపయ్య

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్ నగర పరిధిలో ప్రభుత్వ భూములు, చెరువులు, నాలాలను కాపాడుకున్నప్పుడే ప్రకృతి వైపరీత్యాలను సమర్థవంతంగా ఎదుర్కోగలమని హైడ్రా అదనపు డైరెక్టర్ వర్ల పాపయ్య అన్నారు. హైడ్రా కార్యాలయంలో జరిగిన 77వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనం అనుభవిస్తున్న స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు రాజ్యాంగమే దిక్సూచి అని, ప్రతి పౌరుడు రాజ్యాంగం పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో హైడ్రా అదనపు కమిషనర్ ఆర్. సుదర్శన్, ఎసిపిలు తిరుమల్, ఉమామహేశ్వరరావు, రీజనల్ ఫైర్ ఆఫీసర్ జయప్రకాష్ పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాకే సినీ టెక్నీషియన్లకు గుర్తింపు

సినిమా ఇండస్ట్రీస్ ఎంప్లాయీస్ ఫెడరేషన్




**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** గత పదేళ్ల కాలంలో తమను పట్టించుకోలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే తమ సినీ యూనియన్లకు, టెక్నీషియన్లకు గుర్తింపు వచ్చిందని తెలంగాణ సినిమా ఇండస్ట్రీస్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు ప్రభాకర్‌రెడ్డి, కార్యదర్శి సి.హెచ్.మూర్తి అన్నారు. సోమవారం గణతంత్ర దినోత్సవం సందర్భంగా నగరంలోని ఫెడరేషన్ కార్యాలయ ఆవరణంలో వారు జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ గుర్తింపు కార్డులకు సభ్యులకు అందజేశారు. తెలంగాణ బిడ్డ దిల్‌రాజుకు ఎఫ్‌డిసి చైర్మన్ పదవి ఇచ్చి గౌరవించడం యావత్ తెలంగాణ ప్రజలకు గర్వకారణమన్నారు. కార్యక్రమంలో ఫెడరేషన్ గౌరవాధ్యక్షులు ఆనంద్‌బాబు, కార్యదర్శి ఎస్.కె.సైదులు, కోశాధికారి పి.బి.సుబ్రహ్మణ్యం, సభ్యులు సాయికుమార్, జిఆర్‌పి రఘు, ఏ.విజయ్‌కుమార్, సత్యనారాయణ, రాజన్ సాయి తదితరులు పాల్గొన్నారు.

## 'ఆక్స్‌ఫర్డ్'లో ఘనంగా..

**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ హైస్కూల్‌లో 77వ గణతంత్ర దినోత్సవం ఘనంగా జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన రిటైర్డ్ ఐపిఎస్, సిబిఐ మాజీ డైరెక్టర్ ఎం.నాగేశ్వరరావు స్కూల్ సిబ్బందితో కలిసి జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. జీవితాంతం తోడుగా ఉండే నైపుణ్యాలను, జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని విద్యార్థులకు నాగేశ్వరరావుసూచించారు. ఈ సందర్భంగా విద్యార్థుల దేశభక్తి పాటలు, నృత్యాలు ఆకట్టుకొన్నాయి. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ ప్రార్థనా మణికొండ, కరస్పాండెంట్ కట్టా ప్రభాకర్, బోధనా సిబ్బంది, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.





### ఎసిబి కార్యాలయంలో..

బంజారాహిల్స్‌లోని అవినీతి నిరోధక శాఖ (ఎసిబి) కార్యాలయంలో గణతంత్ర దినోత్సవాల సందర్భంగా డైరెక్టర్ డాక్టర్ తరుణ్ జోషి జాతీయ జెండాను ఆవిష్కరించారు. నూతన సంవత్సర దినోత్సవం సందర్భంగా, తమ విశేష సేవలకు గుర్తింపుగా (21) మంది అధికారులకు వివిధ పతకాలు ప్రదానం చేశారు.



### డిజిపి కార్యాలయంలో..

డిజిపి కార్యాలయంలో గణతంత్ర దినోత్సవ వేడుకల్లో అడిషనల్ డిజిపి డి.ఎస్. చౌహాన్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎఐజి రమణ కుమార్, లీగల్ ఎస్‌పి సతీష్, సిఎస్‌ఓ యోగేశ్వరరావు, డిఎస్‌పి వేణుగోపాల్‌లు పాల్గొన్నారు.



నాంపల్లిలోని రాష్ట్ర ఎక్సైజ్ కార్యాలయంలో కమిషనర్ హరికిరణ్ జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ సయ్యద్ యాసిన్ ఖురేసి, జాయింట్ కమిషనర్ సురే రాథోడ్‌లతో పాటు డిప్యూటీ కమిషనర్లు, అసిస్టెంట్ కమిషనర్లు, ఎక్సైజ్ సూపరింటెండెంట్‌లు పాల్గొన్నారు.



చంచల్‌గూడలోని జైళ్ల శాఖ కార్యలయంలో జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో డిజి సౌమ్యామిశ్ర జాతీయ జెండాను ఎగరవేశారు.



అగ్నిమాపక శాఖ రాష్ట్ర కార్యాలయంలో గణతంత్ర దినోత్సవ వేడుకల్లో డైరెక్టర్ జి.నారాయణరావు జాతీయ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో ఆర్ఎఫ్ఓ హరినాథ్‌రెడ్డి, డిఎఫ్ఓ కేశవులు, ఎఓ పద్మతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

### ఎల్‌బి స్టేడియంలో..

తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ ప్రధాన కార్యాలయము ఎల్‌బిస్టేడియంలో జరిగిన గణతంత్ర వేడుకల్లో వైస్ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సోనీ బాలాదేవి జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటీ డిప్యూటీ డైరెక్టర్లు అసిస్టెంట్ డైరెక్టర్లు కోచులు సిబ్బంది క్రీడాకారులు పాల్గొన్నారు.



## ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ లిమిటెడ్ సంస్థ డైరీ ఆవిష్కరణ



**ప్రజాపక్షం/హైదరాబాద్:** నూతన సంవత్సర 2026 కు సంబంధించిన తెలంగాణ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ లిమిటెడ్ సంస్థ నూతన డైరీని సోమవారం 77 వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా సంస్థ చైర్మన్ ప్రకాష్‌రెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో మేనేజింగ్ డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి ,చీఫ్ జనరల్ మేనేజర్ నగేష్,జనరల్ మేనేజర్ పిపిడి గంగయ్య,చీఫ్ ఇంజనీర్ శ్రీనివాస్‌తో పాటు సంస్థ అధికారులు పాల్గొన్నారు.

## మత్స్య ప్రియుల కోసం ఐటిసి 'పిరి పిరీ' రొయ్యలు

ఇంట్లోనే నిమిషాల్లో రెస్టారెంట్ స్టైల్ రుచి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రముఖ ఎఫ్ఎంసిజి దిగ్గజం ఐటిసి మాస్టర్ చెఫ్, సీఫుడ్‌ఖ ప్రియుల కోసం సరికొత్త 'పిరి పిరీ ప్రాన్స్'ను మార్కెట్లోకి విడుదల చేసింది. నాన్‌వెజ్ పోర్ట్‌ఫోలియోను మరింత బలోపేతం చేస్తూ, వినియోగదారులకు సౌకర్యవంతమైన, రుచికరమైన ఆహార అనుభవాన్ని అందించడమే లక్ష్యంగా ఈ ప్రొడక్ట్‌ను తీసుకువచ్చినట్లు సంస్థ తెలిపింది. రొయ్యల సహజ రుచి దెబ్బతినకుండా ఉండేందుకు, కోతకు వచ్చిన 15 గంటలలోపే వీటిని అత్యాధునిక సాంకేతికతతో ఫ్రీజ్ చేస్తారు. సాధారణంగా రొయ్యల వంటకం క్లిష్టంగా ఉంటుందని భావించే వారి కోసం, ఐటిసి ఇందులో రెండు పిరి పిరీ మసాలా సాచెట్‌లను అందించింది. వీటితో నిమిషాల్లో రెస్టారెంట్ తరహా స్నాక్‌ను ఇంట్లోనే సిద్ధం చేసుకోవచ్చు. 212 గ్రాముల ప్యాక్ (రెండు మసాలా సాచెట్‌లతో కలిపి) ధర రూ.275గా నిర్ణయించారు. అన్ని ప్రముఖ రిటైల్ స్టోర్లు, ఇకామర్స్ ప్లాట్‌ఫారమ్‌లలో ఇవి అందుబాటులో ఉన్నాయి.

# టి–20 సిరీస్‌కు దూరమైన తిలక్

## ప్రపంచ కప్‌లోపు సుందర్ కోలుకునేనా!

టి– 20 ప్రపంచకప్ సన్నాహక సిరీస్‌ను హ్యాట్రిక్ విజయాలతో కైవసం చేసుకున్న భారత జట్టుకు షాకింగ్ న్యూస్. సర్జరీ కారణంగా తొలి మూడు మ్యాచ్‌లకు దూరమైన తిలక్ వర్మ ఇంకా ఫిట్నెస్ సాధించలేదు. చివరి రెండు మ్యాచ్‌లకు అతడు అందుబాటులో ఉంటాడని ఆశించిన టీమిండియాకు నిరాశే మిగిలింది. న్యూజిలాండ్‌తో చివరి రెండు మ్యాచ్‌లో సైతం తిలక్ ఆడడం లేదని సోమవారం బిసిసిఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ వెల్లడించింది. దాంతో.. ఆసియా కప్ హీరో స్థానంలో స్క్వాడ్‌లోకి వచ్చిన శ్రేయాస్ అయ్యర్ టీంతోనే ఉండనున్నాడు. విజయ్ హజారే ట్రోఫీలో గాయపడిన తిలక్ వర్మ జట్టుకు దూరమయ్యాడు. సర్జరీ తర్వాత కోలుకుంటున్న ఆసియా కప్ హీరో పునరాగమనం మరింత ఆలస్యం కానుంది. 'సర్జరీ నుంచి కోలుకున్న తిలక్ వ్యాయామాలు చేస్తున్నాడు. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో నిపుణుల పర్యవేక్షణలో అతడి రోజురోజుకు మెరుగవుతున్నాడు. అయితే.. మ్యాచ్ ఫిట్‌నెస్ సాధించేందుకు తిలక్‌కు మరికొంత సమయం పట్టనుంది. కాబట్టి.. అతడు చివరి రెండు టి–20లకు అందుబాటులో ఉండడు. ఫిబ్రవరి 3లోపు పూర్తిస్థాయిలో ఫిట్గా టగా మారితే వామప్ మ్యాచ్, ప్రపంచకప్ కోసం భారత స్క్వాడ్‌తో కలుస్తాడు' అని బిసిసిఐ వెల్లడించింది.





# టి–20ల్లో తిరుగులేని టీమిండియా

## పాకిస్థాన్ రికార్డు బ్రేక్ చేస్తుందా!

టి–20 క్రికెట్‌లో అంచనాలు తలకిందులవుతుంటాయి. తమది కాని రోజున చిన్న జట్ల చేతిలో పెద్ద టీమ్‌లు సైతం కంగుతినడం ఈ ఫార్మాట్లో చూశాం. కానీ, భారత జట్టు మాత్రం మాకు మాత్రం ఇవేవీ వర్తించవంటోంది. స్వదేశమైనా, విదేశమైనా.. వేదిక మారినా సరే ఎదురైన ప్రత్యర్థినల్లా వేటాడుతూ.. వరుసగా సిరీస్ విజయాలతో అదరహో అనిపిస్తోంది. స్వదేశంలో టి–20 ప్రపంచకప్ సమీపిస్తున్న వేళ.. సంచల న ఆటతో మరో రెండు మ్యాచ్‌లు ఉండగానే న్యూజిలాండ్‌ను చావుదెబ్బ కొడుతూ ట్రోఫీని కైవసం చేసుకుంది టీమిండియా. 11వ సిరీస్ విక్టరీతో అజేయ శక్తిగా అవతరించింది సూర్యకుమార్ సేన. గత రెండేళ్లలో భారతజట్టు టి–20ల్లో నమ్మశక్యంకాని విధంగా దూసుకుపోతోంది. విజయాన్ని ఆస్వాదిస్తూనే సీనియర్లు విరాట్ కోహ్లీ, రోహిత్‌శర్మ, రవీంద్ర జడేజాలు వీడ్కోలు పలికినా జోరు మాత్రం తగ్గలేదు. కుర్రాళ్లు అభిషేక్‌శర్మ, తిలక్‌వర్మ, ఆల్రౌండర్ హార్దిక్ పాండ్యా, అర్ష్‌దీప్ సింగ్, బుమ్రా, కుల్దీప్లు.. విశేషంగా రాణిస్తూ విజయాల్లో కీలకమవుతున్నారు.

జనవరిలో మొదలై.. పురుషుల అంతర్జాతీయ టి–20ల్లో 2024 జనవరిలో మొదలైన టీమిండియా గెలుపు ప్రస్థానం నిరాటంకంగా సాగుతోంది. స్వదేశంలో అఫ్గనిస్థాన్‌కు చుక్కలు చూపిస్తూ సిరీస్ గెలుపొందిన టీమిండియా జూన్‌లో బార్బడోస్ వేదికగా టి–20 ప్రపంచకప్ ఫైనల్లో దక్షిణాఫ్రికాను ఓడించి రెండోసారి కప్‌ను కొట్టేసింది. విశ్వ విజేతగా శుభమన్ గిల్ సారథ్యంలో జింబాబ్వే వెళ్లిన బృందం.. తిలక్ వర్మ మెరుపులతో అక్కడా జయకేతనం ఎగురవేసింది.

# ఇండియా-పాక్ మ్యాచ్ లేనట్లేనా..

## టి– 20 వరల్ కప్‌ను పాకిస్తాన్ బహిష్కరిస్తుందా?

టి–20 వరల్ కప్ 2026లో పాల్గొనే అంశంపై పాకిస్తాన్ ఇంకా అనుమానాలు వ్యక్తం చేస్తోంది. ఐసిసి హెచ్చరించిన తర్వాత కూడా పాకిస్తాన్ క్రికెట్ బోర్డ్ (పిసిబి) వైఖరిలో మార్పు రానట్లు కనిపిస్తోంది. టోర్నీలో పాల్గొనే అంశంపై ప్రభుత్వ అనుమతి కోసం ఎదురు చూస్తోంది. టోర్నీ నుంచి బంగ్లాదేశ్ను ఐసిసి తొలగించి, ఆ స్థానంలో స్కాట్లాండ్‌కు అవకాశం కల్పించింది. దీంతో బంగ్లాకు మద్దతుగా తాము కూడా టోర్నీలో పాల్గొనే అంశంపై ఆలోచిస్తామని, తమ ప్రభుత్వ నిర్ణయానికి అనుగుణంగా నడుచుకుంటామని పాక్ ఐసిసికి తెలిపింది.

దీనికి స్పందించిన ఐసిసిసీ.. టోర్నీలో పాల్గొనకుంటే తీవ్ర ఆంక్షలు విధిస్తామని హెచ్చరించింది. దీంతో స్పందించిన పాక్.. టి–20 జట్టును ప్రకటించింది. ఇక.. టోర్నీలో పాక్ గ్యారెంటీగా



ఆడుతుందని అంతా అనుకుంటుండగా.. ఇక్కడే మెలిక పెట్టింది. తాము జట్టును మాత్రమే ప్రకటించామని.. దానర్థం టోర్నీలో తప్పకుండా ఆడుతామని కాదని పాక్ క్రికెట్ వర్గాలు అంటున్నాయి. ఈ విషయంలో పాకిస్తాన్ రెండు ఆప్షన్లు ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఒకటి.. బంగ్లాకు మద్దతుగా టోర్నీని పూర్తిగా బహిష్కరించడం. రెండోది ఇండియాతో జరిగే మ్యాచును మాత్రమే బహిష్కరించడం. ఈ రెండింటిలో ఏదో ఒకటి చేయాలని చూస్తోంది. మరోవైపు టోర్నీలో పాల్గొనడంపై అక్కడి ప్రభుత్వ అనుమతి కోసం పాక్ జట్టు ఎదురుచూస్తోంది. పాక్ ప్రభుత్వం సూచిస్తే టోర్నీని వీడేందుకు పాక్ సిద్ధంగా ఉంది.

ఇండియాలో టోర్నీ జరుగుతుండటమే బంగ్లా, పాక్ ఒత్తిడికి కారణం. ఇప్పటికే పాకిస్తాన్ ఆడే మ్యాచుల్ని శ్రీలంకలో నిర్వహించనుండగా.. తాము కూడా ఇండియాకు రాలేమని, తమకు కూడా మరో వేదిక కావాలని బంగ్లా డిమాండ్ చేసింది. కానీ, దీనికి ఐసిసి ఒప్పుకోకుండా.. స్కాట్లాండ్‌ను రంగంలోకి దించింది. ఇండియా–పాక్ మధ్య ఫిబ్రవరి 15న శ్రీలంకలోని కొలంబోలో మ్యాచ్ జరగనుంది.

# యువతరంగం

# ఉపాధ్యాయులకూ నైపుణ్యాలు అవసరం

కేవలం విద్యార్థులు మాత్రమేకాదు... ఉపాధ్యాయులు కూడా నిత్య విద్యార్థిగా ఉండాలి. అప్పుడే వృత్తికి న్యాయం చేయగలుగుతారు. ప్రత్యేకించి శాస్త్రవిజ్ఞానం పరుగులు తీస్తున్న ఈకారంలో ఉపాధ్యాయులు నైపుణ్యాలు పెంచుకోవాల్సిన అవసరం ఉంది. ఆధునిక విద్యార్థులను శక్తివంతం చేయడానికి అనుకూలత, సృజనాత్మకత, నవీనత వంటి అలవాట్లు చేసుకోవాలి. జీవితాంతం నేర్చుకుంటూ ఉండే వ్యక్తిగా మారాలి. విద్యారంగంలో కొనసాగుతున్న మార్పులను తెలుసుకోవాలి. అలాగే భవిష్యత్తులో అందుబాటులో ఉండే ఉద్యోగ అవకాశాలను కూడా విశదంగా తెలుసుకోవాలి. శాశ్వత అభ్యాసానికి నిదర్శనం కావాలి. అధునాతన విద్యా అవకాశాలు, మారుతున్న విద్యా విధానాలపై అవగాహన ఉండాలి. విద్యార్థులకు ఉత్తేజాన్ని, అనుకూలాన్ని ప్రోత్సహించాలి. సంబంధిత వర్గాలతో కలిసి పని చేయడంలో ముందుండాలి. భవిష్యత్తులో ఉపాధ్యాయుడి పాత్ర ఎంతో కీలకమైనదిగా మారుతోంది కాబట్టి, ఇప్పటి నుంచే ఆ దిశగా బలమైన పునాదులు వేసుకోవాల్సిన అవసరం ఉంది. తమ ఆలోచనా ధోరణిని మార్చుకుంటూ, తాజా పరిజ్ఞానాన్ని పొందటంలో ఉత్సాహంగా ఉండాలి. విద్యా విధానంలో జరిగిన మార్పులను స్వీకరించడానికి స న్నద్ధంగా ఉండాలి. అడాప్టబిలిటీ తోపాటు కాన్ఫిడె న్స్ (విశ్వాసం) కూడా ఉపాధ్యాయుల నైపుణ్యాల ను, వృత్తి నాణ్యతను పెంచుతుంది. ప్రతి ఉపాధ్యాయుడు తానేమిటో తెలుసుకుని, తనలోనూ తన విద్యార్థులు, సహచరుల్లోనూ నమ్మకం పెం చాలి. ఆత్మవిశ్వాసం కలిగిన ఉపాధ్యాయుడు వి ద్యార్థుల్లో మెరుగైన అభ్యాసాన్ని సాగించగలడని, ఇతరులను కూడా ఉత్తమ నిర్ణయాలకు ప్రేరేపించగలడని నమ్మాలి. అప్పుడే, విద్యార్థులపై, సమాజంపై ఉండే ప్రభావాన్ని మరింత శక్తివంతం చేయగలుగుతాడు. విద్యార్థు




లకు బోధించే ముందు ఉపాధ్యాయుడు ఆయా విషయాలను తెలుసుకోవాలి. అధ్యయనం చేయాలి. వివరించగలిగే పట్టు సంపాదించాలి. అందుకే, ఉపాధ్యాయుడు ఎప్పుడూ నేర్చుకునే వ్యక్తి కావాలి. ఆన్లైన్ కోర్సులు, వర్క్‌షాప్స్, సెమినార్లు వంటి వాటి ద్వారా నిరంతరం అభివృద్ధి చెందాలి. ఆధునిక ఉపాధ్యాయుడు నవ యువతను ఆకర్షించే విధంగా అభ్యాసంలో సరికొత్త ప్రక్రియలను, విద్యా అంశాలను ప్రవేశపెడుతూ ఉండాలి. విద్యా అనువర్తనాలు, ఆన్‌లైన్ రిసోర్సులను వినియోగిస్తూ, విద్యార్థులను ఉత్తేజపరిచే మార్గాలను అన్వేషించాలి. శక్తివంతం చేయడం ఉపాధ్యాయులు తమ విద్యార్థులను కీలక ఆలోచనలకు, సమస్య పరిష్కారాలకు ప్రోత్సహిస్తూ, వారికి సృజనాత్మకతను, స్వతంత్ర ఆలోచనను కలిగించేలా చూడాలి. ఈ నైపుణ్యాలు కలిగిన ఉపాధ్యాయులు మాత్రమే నేటి విద్యార్థులకు ఉత్తమ మార్గదర్శకులుగా తయారవుతారు.

## యూత్ ఐకాన్స్

ఎంతో మంది యువతీయువకులు దేశ కీర్తిప్రతిష్టలను ఇనుమడింపచేశారు. చిన్న వయసులోనే అత్యున్నత శిఖరాలను అధిరోహించారు. యువతకు మార్గదర్శకులుగా నిలిచారు. అలాంటి అద్వితీయ ప్రతిభావంతుల గురించి క్లుప్తంగా తెలుసుకుందాం..

# సంకల్ప బలం..





ఒక చిన్నద్వీపం...ఆసముద్రంలో ఒక్క చుక్కలా కనిపిస్తున్నది. దానిపై ఎటు చూసినా సముద్ర మే. ఆ చిన్న భూభాగంపై నిలబడి ఒక మనిషి, తన కళ్లలో ఒక అగ్ని కలిగి, ప్రపంచాన్ని నిశ్శబ్దం గా చూడగలిగే శక్తి చూపించాడు. అతనికి యుద్ధ వస్త్రాలు లేవు, అణు బాంబులు లేవు.. కానీ, అతని చేతిలో ఒకేశక్తి ఉంది.. అదే వెనక్కి తగ్గని సంక ల్పం. ఆ మనిషి పేరు ఫిడెల్ క్యాస్ట్రో. ఈ చిన్న బాలుడు ఒకరోజు చరిత్రను మళ్ళీ రాయబోతాడని, అతని చిన్నప్పుడు ఎవరూ ఊహించి కూడా ఉండరు. అయితే, తనమాతృభూమి క్యూబా విదేశీ బానిసత్వంలో అనుభవిస్తున్న చెరను గమనించాడు. పంచదార, చమురు, భూములు... అదీఇదీ అని కాకుండా, అన్నీ వేరువారి చేతుల్లో. ప్రజలు పేదరికంలో మునిగిపోయినప్పుడు, రాజధానిలో జూదశాలలు, మద్యం మందిరాలు వెలుగులాటతాయి. ఫిడెల్ ఈ దోపిడీని చూసి నిశ్శబ్దంగా ఉండలేకపోయాడు. ఒక రోజు తుపాకీ ఎత్తాడు. గెలుపు రాలేదు. 1953లో జరిగిన దాడి ఓటమిగా మిగిలింది. జైలుశిక్ష ఎదుర్కొన్నాడు. అతని కథ ముగిసిందని అంద రూ అనుకున్నారు. కానీ జైలు అతని ఆత్మశక్తిని దెబ్బతీయలేకపోగా, అతని ఆలోచనలను మరిం త పదును పెట్టింది. 'నేను చేసిందని నేరమే అనుకుంటే.. చరిత్ర నన్ను క్షమిస్తుంది' అని కోర్టులో అతను చెప్పిన మాటలు ప్రజల గుండెల్లోకి దూసుకెళ్లాయి. వారిలో ఆలోచనలకు కారణమయ్యా యి. జైలు నుంచి విడుదలైన తర్వాత ఫిడెల్ దేశం విడిచాడు. కానీ, దేశంకోసమే మళ్లీ ఆయు ధం పట్టాడు. ఒక చిన్న పడవ, ఎనభై మంది యువకులు, తుఫాన్ల మధ్య ప్రయాణం. తీరానికి చేరగానే బుల్లెట్ల వర్షం. అందరూ చనిపోయారనుకున్న సమయంలో, పన్నెండు మంది మాత్రమే అడవుల్లోకి వెళ్లారు. రైతులు, ప్రజల వారికి మద్దతుతోపాటు ఆశ్రయం ఇచ్చారు. ఆ సమయంలోనే 'తుపాకీ పట్టడం కంటే ప్రజల మద్దతే ఎక్కువ బలం' అని తెలుసుకున్నాడు. ఏడాదిలో అడవుల్లోంచి ఒక విప్లవం పుట్టింది. మూడేళ్లలో నియంత కూలిపోయాడు. 1959లో ఫిడెల్ రాజధానిలో అడుగుపెట్టాడు. అది అధికార మార్పు కాదు, అది అధిపత్యానికి ఎదురెత్తిన చెంపదెబ్బ. ఆ తర్వాత అసలు యుద్ధం మొదలైంది. దాడు లు, కుట్రలు, హత్యా ప్రయత్నాలు. విషపూరిత సిగార్లు, పానీయాల్లో విషం, కిరాయి హంతకులు. ఒకసారి కాదు, పది కాదు, వంద కాదు, ఆరు వందల ముప్పై నాలుగు సార్లు ప్రయత్నించారు. కానీ ప్రతీసారి విఫలమయ్యారు. ప్రజలతో నిలబడిన విప్లవాన్ని ఓడించడం ఎంత కష్ట మో ప్రపంచం ప్రత్యక్షంగా చూసింది. 2016లో అతను కన్నుమూశా డు. ఈ రోజు కూడా ఆ చిన్న ద్వీపం నిలబడి ఉంది, ఎన్నో కష్టాలు, ఎన్నో ఒత్తిళ్ల మధ్య. అది ఒక విషయాన్ని చెబుతోంది... సామ్రాజ్యాలు ఆయుధాలతో గెలుస్తా యి, కానీ ప్రజలు సంకల్పంతో నిలబడతారు. ఫిడెల్ క్యాస్ట్రో అదే నిరూపించాడు. యువతకు ఆయనను మించిన మార్గదర్శకుడు, స్ఫూర్తిప్రదాత ఎవరు ఉంటారు?

# మునిసి'పోల్'లో కలిసి పోటీచేసేందుకు సహకారం

## కాంగ్రెస్ పార్టీకి సిపిఐ జాతీయ నాయకుడు చాడా వెంకట్‌రెడ్డి సూచన

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** రాష్ట్రంలో రానున్న మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో కలిసి పోటీ చేసేందుకు కాంగ్రెస్ పార్టీ సహకరించాలని సిపిఐ జాతీయ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే చాడా వెంకట్‌రెడ్డి సూచించారు. సోమవారం గోదావరిఖని భాస్కర్ రావు భవన్‌లో జరిగిన సిపిఐ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి సిపిఐ మిత్రపక్షంగా



ఉందని, రానున్న మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లో కలిసి పోటీ చేసేందుకు బలమైన డివిజన్‌లను సిపిఐకి కేటాయించాలని ఆయన కాంగ్రెస్ పార్టీని కోరారు. రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వివిధ డివిజన్‌లలో పోటీ చేసేందుకు సిపిఐ అభ్యర్థులకు స్థానిక ఎమ్మెల్యే సహకారం అందించాలన్నారు. కేంద్రప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా కార్మిక వ్యతిరేక విధానాలపై ప్రజలకు అవగాహన కల్పించి ఉద్యమాలు చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని పేరు మార్చి పేద ప్రజలకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేస్తుందని కేంద్రప్రభుత్వంపై మండిపడ్డారు. సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేణి శంకర్, రాష్ట్ర సమితి సభ్యులు గౌతం గోవర్ధన్, జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం, నగర కార్యదర్శి కే.కనకరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# కార్మిక హక్కులు కాలరాస్తున్న కేంద్రం

## సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి భిక్షపతి

**ప్రజాపక్షం/హనుమకొండటౌన్ :** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మిక హక్కులు హరిస్తుందని సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి ఆరోపించారు. కార్మిక రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఫిబ్రవరి 12న చేపట్టనున్న దేశ వ్యాపిత సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని జిల్లాలోని బాలసముద్రం సిపిఐ కార్యాలయంలో సోమవారం కార్మిక సంఘాల ఆధ్వర్యంలో హానమకొండ జరిగింది. సదస్సుకు ఎఐటియుసి హనుమకొండ జిల్లా అధ్యక్షుడు వేల్పుల



సారంగపాణి అధ్యక్షత వహించగా జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ధర్ముల రామ్మూర్తి, సహాయ కార్యదర్శి రామా రాజేష్‌ఖన్నా, ఉపాధ్యక్షులు లంకదాసరి అశోక్, సహాయకార్యదర్శులు బత్తిని సదానందం గౌడ్, గుంటి రాజేందర్, ఇల్లందుల రాములు, దుర్గాప్రసాద్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.


# రాజ్యాంగ విలువల రక్షణకు పోరాటాలు

## గణతంత్ర వేడుకల్లో సిపిఐ నేతల పిలుపు

**ప్రజాపక్షం/కరీంనగర్‌టౌన్:** రాజ్యాంగ పరిరక్షణ, లౌకిక వ్యవస్థ పటిష్టతకై ప్రజాస్వామ్యవాదులు ఏకం కావాలని, రాజ్యాంగ పరిరక్షణకు ఐక్య పోరాటాలు చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి పిలుపు నిచ్చారు. 77వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని కరీంనగర్‌లోని సిపిఐ జిల్లా కార్యాలయం బద్దం ఎల్లారెడ్డిభవన్ వద్ద ఏర్పాటు చేసిన జాతీయ జెండాను సిపిఐ కరీంనగర్ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ ఎగురవేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పొనగంటి కేదారి, నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు న్యాలపట్ల రాజు, జిల్లా కౌన్సిల్ సభ్యులు పైడిపల్లి రాజు, కటికరెడ్డి బుచ్చన్న యాదవ్, కసిరెడ్డి మణికంఠ రెడ్డి, మచ్చ రమేష్, బామండ్లపెల్లి యుగంధర్, బీర్ల పద్మ, కొట్టె అంజలి, బూడిద సదాశివ, బోనగిరి మహేందర్, నాయకులు గామినేని సత్యం, కసిబోజుల సంతోష్‌చారి, కూనరవి, చెంచల మురళి, కసిరెడ్డి లతశ్రీ, కూన సమత, ఐశ్వర్య తదితరులు పాల్గొన్నారు.



కరీంనగర్...



యాదాద్రిభువనగిరి...

### రాజ్యాంగం ఫలాలు పేదలకు అందని ద్రాక్షే..

**మంచిర్యాల:** రాజ్యాంగం కల్పించిన హక్కులు నేటికీ సామాన్యులకు అందని ద్రాక్షలాగే మిగిలిపోయాయని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేన శంకర్, జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మ ణ్ అన్నారు. సోమవారం గణతంత్ర దినోత్సవం సందర్భంగా మంచిర్యాల జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో జాతీయ పతాక ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కార్యక్రమంలో మేకల దాసు, రేగుంట చంద్రశేఖర్, లింగం రవి, ముస్కే సమ్మయ్య, మిరియాల రాజేశ్వర్ రావు, కొట్టే కిషన్ రావు, కుంచాల శంకరయ్య, దేవీ పోచన్న పాల్గొన్నారు.

**మహబూబ్‌నగర్ :** రాజ్యాంగ ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు దేశ పౌరులు కృషి చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బి.బాలకిషన్ పిలుపునిచ్చారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా సిఐపి జిల్లా సమితి ఆధ్వర్యంలో జిల్లా కార్యవర్గ సభ్యురాలు కె..పద్మావతి అధ్యక్షతన జాతీయ జెండా ఎగురవేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కొండపల్లి రాము, పి.సురేష్. బాల్‌రాజు,పట్టణ కార్యదర్శి కోటకద్ర నరసింహ, చాంద్ భాషా, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, ఎఐవైఎఫ్ జిల్లా కో కన్వీనర్ మెట్టు మహేష్, దేవానంద్ మహిళా సమాఖ్య పట్టణ కార్యదర్శి ఇందిరక్క, పూజిత, ప్రైవేట్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షురాలు శ్రీవల్లిక, గంటల శ్రీను, శ్రీహరి, రమేష్ నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

### భారత రాజ్యాంగమే ప్రజాస్వామ్యానికి పునాది..

**భువనగిరి రూరల్ :** భారత రాజ్యాంగమే ప్రజాస్వామ్యానికి పునాది అని సిపిఐ యాదాదిర జిల్లా కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి అన్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా భువనగిరిలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో జాతీయ పతాకాన్ని దామోదర్‌రెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎండి ఇమ్రాన్, ఎఐటియుసి జిల్లా కార్యవర్గ సభ్యులు సామల శోభన్ బాబు, సిపిఐ పట్టణ కార్యదర్శి పుట్ట రమేష్, మండల కార్యదర్శి దాసరి లక్ష్మ య్య, ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి గనబోయిన వెంకటేష్, జిల్లా కమిటీ సభ్యులు సామల భాస్కర్, ముంతాజ్ బేగం, నాయకులు చొప్పరి సత్తయ్య, చింతల మల్లేష్, బద్దం వెంకట్ రెడ్డి, కొత్త కృష్ణ, పుట్ట రాజు, జగన్ తదితరులు పాల్గొన్నారు.

### రాజ్యాంగాన్ని రక్షించుకుందాం ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

**నల్లగొండ:** రాజ్యాంగ నిర్మాతల ఆశలు, ఆకాంక్షలకు భిన్నంగా దేశంలో పరిపాలన కొనసాగిస్తూ రాజ్యాంగాన్ని మార్చాలని మోదీ ప్రభుత్వం చేస్తున్న కుట్రలకు వ్యతిరేకంగా ప్రజాస్వామ్యవాదులు లౌకికవాదులు కమ్యూనిస్టులు ఐక్యంగా పోరాడాలని సిపిఐ నల్లగొండ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. గణతంత్ర దినోత్సవ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యాలయంలో జాతీయ జెండాను పార్టీ సీనియర్ నాయకులు మల్లెపల్లి ఆదిరెడ్డి ఎగురవేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి, ఎల్ శ్రవణ్ కుమార్. జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బు వీరస్వామి, పట్టణ కార్యదర్శి కెవిస్ రెడ్డి, శాంతి సంఘం జిల్లా కార్యదర్శి జిల్లా యాదయ్య, పట్టణ సహాయ కార్యదర్శి వి.లెనిన్, ముండ్ల ముత్యాలు, మీఠపల్లి నందం, దోటి పండరి, సుజాత, విజయ్ కౌసల్య, అక్కలయ్య, యూసుఫ్, బాసాని వెంకటయ్య, కె.నారాయణ, గుండె రవి, రెవెల్లి యాదయ్య, చింత ధనలక్ష్మి, వెంకన్న, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.



నల్లగొండ..

**మహబూబాబాద్ :** సిపిఐ ఆధ్వర్యంలో గణతంత్ర దినోత్సవ వేడుకలు సోమవారం సిపిఐ జిల్లా కార్యాలయం వీరభవన్ వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి బి .విజయసారథి జాతీయ జెండాను ఎగురవేసి అనంతరం మాట్లాడుతూ రాజ్యాంగాన్ని మార్చే కుట్రలను ఎదుర్కొనేందుకు లౌకిక శక్తులు ఏకం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి.అజయ్ సారథిరెడ్డి, నాయకులు పెరుగుకుమార్, రేషపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, మామిండ్ల సాంబలక్ష్మి, తండా సందీప్, వీరవెల్లి రవి, వెలుగు శ్రవణ్, నర్రా శ్రావణ్, కేదాసు రమేష్, మేక వీరన్న, ఆబోతు అశోక్, ఎండి ఫాతిమా, జనగం ప్రవీణ్, వంకాయలపాటి చిరంజీవి, ఎండి మహమూద్, నాగేల్లి యాకమ్మ, తోట రాజకుమారి, చిదిరాల జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



మహబూబాబాద్


### ప్రజాస్వామ్య విలువలు పరిరక్షణకు దేశ పౌరులు కృషి చేయాలి

**సూర్యాపేటటౌన్:** రాజ్యాంగ ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు దేశ పౌరులు కృషి చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో గణతంత్ర దినోత్సవం సందర్భంగా సిపిఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు అధ్యక్షతన ధర్మభిక్షం భవన్ సిపిఐ కార్యాలయం వద్ద జాతీయ జెండాను బెజవాడ వెంకటేశ్వర్లు, పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు కెవిఎల్ లు ఎగురవేశారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కమిటి సభ్యులు దూళిపాల ధనుంజయనాయుడు, జిల్లా కార్యవర్గ సభ్యులు కంబాల శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్ అనంతుల మల్లేశ్వరి, బొమ్మగాని శ్రీనివాస్, దంతాల రాంబాబు, చామల అశోక్‌కుమార్, ఎండి పాషా, నిమ్మల ప్రభాకర్, నీలా శ్రీనివాస్, చిలకరాజు శ్రీను, బూర సైదులు, ఎడెల్లి శ్రీకాంత్ పాల్గొన్నారు.

**సిద్దిపేట :** గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించకుని సిద్దిపేట జిల్లా కేంద్రంలోని భారత కమ్యూనిస్టు పార్టీ కార్యాలయంలోని ఎడ్ల గురువారెడ్డి భవన్ వద్ద సిపిఐ జిల్లా కార్యాదర్శి మంద పవన్ జాతీయ జెండాను ఆవిష్కరించారు.



మంచిర్యాల...



మహబూబ్‌నగర్..



సిద్దిపేట..




సూర్యాపేట...

## రావి నారాయణరెడ్డి కాలనీలో గణతంత్ర దినోత్సవ వేడుకలు



**ప్రజాపక్షం/అబ్దుల్లాపూర్మెట్:** అబ్దుల్లాపూర్ మెట్టు మండలంలోని రావి నారాయణరెడ్డి కాలనీ ఫేస్ 1, 2, 3 లలో మండల కార్యదర్శి అజ్మీర హరి సింగ్ నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన గణతంత్ర దినోత్సవ వేడుకలు నిర్వహించారు. వేడుకలకు సిపిఐ కార్యవర్గ సభ్యులు, భూ పోరాట కమిటీ అధ్యక్షుడు ఆందోజు రవీంద్రచారి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు, భూ పోరాట కమిటీ ప్రధాన కార్యదర్శి ముత్యాల యాదిరెడ్డి పాల్గొని జెండా ఆవిష్కరణ చేశారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు సామిడి శేఖర్‌రెడ్డి, పబ్బతి లక్ష్మణ్, కేతరాజు నరసింహ, గణేష్, వేణుగోపాలచారి పాల్గొన్నారు.

### రాజేంద్రనగర్ సిపిఐ కార్యాలయంలో



**రంగారెడ్డి:** గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని సిపిఐ రాజేంద్రనగర్ మండల కార్యాలయం ఎఆర్ దేవరాజు భవన్ ముందు, మైలార్ దేవరపల్లి చింతల్ మెట్‌లో జాతీయ జెండా ఆవిష్కరించారు. సిపిఐ రాజేంద్రనగర్ మండల కార్యదర్శి కన్యగారి నర్సింహ్మారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు పుస్తకాలు నర్సింగ్ రావు, మన్నేమహాత్మా రావు, ఎం.ఎ. రియాజ్, జె.ఆనంద్ గౌడ్, కన్యగారి లక్ష్మి, గండిపేట్ స్వామి, జె.విజయనంద్ గౌడ్, ఎండి షఫీ, సిపిఐ మండల కార్యదర్శి జి సత్యం, మండల కౌన్సిల్ సభ్యులు సదానంద గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



**తుర్కయంజాల్:** భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో తుర్కయంజాల్ కూడలిలో గణతంత్ర దినోత్సవాన్ని నిర్వహించారు. జాతీయ పతాక ఆవిష్కరణకు ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఓరుగంటి యాదయ్య హాజరై ఆవిష్కరణ చేశారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు నాగేశ్వరరావు, దేవనాయక్, సిపిఐ తుర్కయంజాల్ కార్యదర్శి కాటంరాజు గౌడ్, నాయకులు శివ, భాస్కర్, శ్రీకాంత్, శ్రీను, వట్టి విజయ, పద్మ, లక్ష్మి కోట్యా నాయక్, రాములు తదితరులు పాల్గొన్నారు.



**శేరిలింగంపల్లి :** గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని శేరిలింగంపల్లి సిపిఐ కార్యదర్శి కె.చందుయాదవ అధ్యక్షతన సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు టి. రామకృష్ణ మాదాపూర్‌లో జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. కార్యక్రమం లో శేరిలింగంపల్లి కార్యదర్శి చందుయాదవ్, కాసిం, వెంకటస్వామి, వెంకటేష్, జె.శ్రీనివాస్, కున సుధాకర్, కొండల్, నారాయణ, ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి కె. శివకుమార్, అశోక్, తిరుపతి పాల్గొన్నారు.

## ప్రశంసాపత్రాలు అందజేత



**ప్రజాపక్షం/షాబాద్:** జిల్లా ఉత్తమ అవార్డు అందుకున్న షాబాద్ తహసీల్దార్ అన్వర్, షాబాద్ ఎంపిడిఒ అపర్ణ కలెక్టర్ నారాయణరెడ్డి నుంచి అవార్డులు అందుకున్నారు.

# వాడవాడలా మువ్వెన్నెల రెపరెపలు







**ప్రజాపక్షం/హైదరాబాద్:** గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రజలు వాడవాడలా జాతీయ జెండాలను ఎగురవేశారు. ప్రభుత్వ కార్యాలయాలతో పాటు ప్రైవేట్ సంస్థలు, వ్యాపార కేంద్రాలు, కూడళ్లలో త్రివర్ణ పతాకాలను ఎగురవేసిన ప్రజాప్రతినిధులు, అధికారులు, స్వాతంత్ర్య సమరయోధులు, పలువురు ప్రముఖులు గణతంత్ర దినోత్సవ ప్రాశస్త్యాన్ని చాటారు. లక్డీకాపూల్‌లోని హైదరాబాద్ జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ హరిచందన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉత్తమ పౌర సేవలు అందించిన ఉద్యోగులకు ప్రశంసాపత్రాలను అందించి అభినందించారు. హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో కోత్వాల్ సజ్జనార్ జాతీయ జెండాను ఎగురవేసి రాజ్యాంగ స్ఫూర్తిని రక్షిస్తూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఉప్పల్ మెట్రో సూపర్‌మార్కెట్‌లో జరిగిన వేడుకల్లో ప్రముఖ వ్యాపారి బొల్లంపల్లి రాజేందర్‌రెడ్డి పాల్గొని జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. హైడ్రాలో జరిగిన గణతంత్ర వేడుకల్లో హైడ్రా అదనపు సంచాలకులు పాపయ్య పాల్గొని త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. కార్యక్రమంలో హైడ్రా అదనపు కమిషనర్ ఆర్.సుదర్శన్, ఏసీపీలు తిరుమల్, ఉమా మహేశ్వరరావు, రీజినల్ ఫైర్ ఆఫీసర్ మోహన్‌రావు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌ఎఫ్‌ఓలు పాల్గొన్నారు. హైదరాబాద్ మెట్రో రైల్ కార్యాలయంలో సంస ఎండి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. చార్మినార్ జెడ్‌సి సోలిపేట్ శ్రీనివాస్‌రెడ్డి జోనల్ కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమాల్లో వివిధ విభాగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

# పారదర్శకంగా జిల్లా అభివృద్ధికి కృషి



### కలెక్టర్ నారాయణ రెడ్డి

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** ప్రజా సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను మరింత పటిష్టంగా అమలు చేయటానికి అంకితభావం, నీతి నిజాయితీ, నిస్వార్ధంగా,పారదర్శకంగా పనిచేస్తూ జిల్లా అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషిచేయాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి అన్నారు. సోమవారం రంగారెడ్డి జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో భారత గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కలెక్టర్ నారాయణరెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. అంతకు ముందు పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, సాధించిన ప్రగతి గురించి ప్రసంగించారు. ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందజేశారు, గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ, విద్యాశాఖ, వైద్య ఆరోగ్య, హౌసింగ్, అగ్నిమాపక, సివిల్ సప్లయ్, శాఖలకు సంబంధించిన శకటాల ప్రదర్శనను కలెక్టర్ తిలకించారు. అనంతరం గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ, విద్యాశాఖ, వైద్యఆరోగ్య, హౌసింగ్, అగ్నిమాపక, సివిల్ సప్లయ్, మత్స శాఖ, అన్ని సంక్షేమ శాఖలకు సంబంధించిన స్టాల్స్ కలెక్టర్ సందర్శించారు. గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా డిపిఎస్ నాదర్గుల్ (చెక్ దే ఇండియా దేశభక్తినిత్యం), ఎంజెపి పాలమాకుల (గళ్ళు గళ్ళు గళ్ళు జోడెడ్ల బండి జానపద నృత్యం), భాష్యం మహేశ్వరం (జై జవాన్ జై కిసాన్, ఆర్మీ),కె జి బి వి ఆమనగల్ (బోనాల నృత్యం), జడ్ పిహెచ్‌ఎస్ సాహెబ్ నగర్ (ఆపరేషన్ సింధూరపై నృత్యం), జడ్.పి హెచ్‌ఎస్ తుక్కుగూడ (బంజారా నృత్యం), చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆహుతులను అలరింపజేశాయి. అనంతరం దివ్యాంగులకు ల్యాప్ టాప్ లు, మొబైల్ ఫోన్లు, చెవి మిషన్లు, చేనేత రుణమఫి పథకం కింద 82,51,257 రూపాయల చెక్కును, జ్యోతి జిల్లా మహిళా సమాఖ్యకు 797,21,00,000 రూపాయల చెక్కును కలెక్టర్ అందజేశారు. అనంతరం జిల్లాలో ప్రతిభ కనబర్చిన అధికారులు, సిబ్బందికి జిల్లా పరిషత్ సిఇఒ సిహెచ్.కృష్ణారెడ్డి, డిఆర్‌డిఎ పిడిఎల్. శ్రీలత, డిపిఒ వి.సురేష్ మోహన్, డిఎంహెచ్ఒ డాక్టర్ కె.లలితదేవి, ఆర్‌డబ్ల్యూఎస్, ఆర్‌ఆర్ సర్కిల్ ఎస్ఇ ఎం.ఆంజనేయులు, జిల్లా ఉద్యానవన, పట్టు పరిశ్రమల అధికారి కె.సురేష్, జిల్లా యువజన, క్రీడల అధికారి ఇ.వెంకటేశ్వరరావు, హౌసింగ్ పిడి డిసి నాయక్‌తో కలిసి ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు కె,చంద్రారెడ్డి, శ్రీనివాస్, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, శంషాబాద్ డి.సి.పి బి.రాజేశ్, ఆర్డీఓలు, జిల్లా అధికారులు, సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## శాంతిభద్రతల పరిరక్షణతో గుర్తింపు



### షాద్‌నగర్ డిసిపి సిహెచ్ శిరీష

**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** శాంతిభద్రతల పరిరక్షణతోపాటు ఎన్నో సవాళ్ళతో కూడిన ఉద్యోగం పోలీస్ డ్యూటీ అని షాద్‌నగక్ డిసిపి సిహెచ్ శిరీష అన్నారు. సోమవారం గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని షాద్‌నగర్ ఏసిపి కార్యాలయంలో ఏసిపి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో జాతీయ జెండాను ఎగురవేశారు. అత్యుత్తమ సేవలు అంధించిన పోలీస్ సిబ్బందికి బహుమతులు అంధించి అభినంధించారు. కార్యక్రమంలో ఎసిపి లక్ష్మీనారాయణ, పట్టణ సిఐ విజయ్‌కుమార్, డిఐ సిఐ వెంకటేశ్వర్లు, ఎస్‌బి ఎస్ఐ దేవకి, ఎస్ఐలు ప్రణయ్, శ్రీకాంత్‌తోపాటు ఏఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

### రాజ్యాంగంపై అవగాహన పెంచాలి

**షాద్‌నగర్:** గ్రామీణ స్థాయిలో రాజ్యాంగంపై అవగాహన పెంచేందుకు కృషిచేయాలని షాద్‌నగర్ అదనపు జిల్లా న్యాయమూర్తి స్వాతిరెడ్డి అన్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా కోర్టు సముదాయంలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జాతీయ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో షాద్‌నగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వేణుగోపాల్‌రావు, కార్యదర్శి గుండుబావి శ్రీనివాస్‌రెడ్డితోపాటు న్యాయవాదులు పాల్గొన్నారు.




## సిఆర్ ఫౌండేషన్‌లో గణతంత్ర వేడుకలు



**ప్రజాపక్షం/శేరిలింగంపల్లి:** గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని కొండాపూర్‌లోని చంద్ర రాజేశ్వర్‌రావు ఫౌండేషన్‌లో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సిఆర్ ఫౌండేషన్ కార్యదర్శి చెన్నమనేని వెంకటేశ్వరరావు జాతీయ జెండా అవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారత రాజ్యంగ ఫెడరల్ వ్యవస్థను డాక్టర్ బిఆర్ అంబెద్కర్ లాంటి మహోన్నత వ్యక్తులు రూపొందించిన రాజ్యంగాన్ని కాపాడుకోవల్సిన అవసరం ఉందని తెలిపారు. గణతంత్ర వేడుకలను పురస్కరించుకొని సిఆర్ ఫౌండేషన్‌లో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. సిఆర్ ఫౌండేషన్ వాసులకు వైద్య సేవలు అందిస్తున్న సిఆర్ పాలిక్లినిక్ డైరెక్టర్ కూనంనేని రజని, మహిళా సంక్షేమ డైరెక్టర్ శ్రీమతి జోస్యభట్ల కల్పన, డాక్టర్ అడపా రామరావు ప్రసంగించారు. కార్యక్రమంలో సిఆర్ ఫౌండేషన్ కోశాధికారి, వృద్దాశ్రమం డైరెక్టర వి. చెన్నకేశవరావు, మహిళా సంక్షేమ కేంద్రం సభ్యులు లలిత, హోమ్ సలహా కమిటీ సభ్యులు ఎన్ రాజేంద్రరావు,తమ్మారెడ్డి తాన్య, హోమ్ మేనేజర్ శ్రీనివాస్ అశ్రమవాసులు, సంక్షేమ కేంద్ర విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా గణతంత్ర వేడుకలు



**ప్రజాపక్షం/షాద్‌నగర్ :** రాజ్యాంగ స్ఫూర్తిని నేటి తరాలకు తెలియజేసేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. సోమవారం 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలను షాద్‌నగర్‌లో ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ఆర్‌డిఓ కార్యాలయంలో ఆర్‌డిఒ సరిత, మున్సిపల్ కార్యాలయం వద్ద కమిషనర్ సునీతారెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో వద్ద చైర్‌పర్సన్ సులోచన కృష్ణారెడ్డి జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. షాద్‌నగర్ ఎసిపి కార్యాలయం వద్ద డిసిపి శిరీష, ఎసిపి లక్ష్మీనారాయణ, పోలీసు స్టేషన్ ఆవరణలో సిఐ విజయ్‌కుమార్, ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో ఎక్సైజ్ సిఐ శేఖర్, అదేవిధంగా తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ నాగయ్య, ఎంపిడిఓ కార్యాలయం వద్ద ఎంపిడిఓ బన్సీలాల్‌లు జాతీయ జెండాలను ఎగురవేశారు. షాద్‌నగర్ పంచాయతీ రాజ్ డిఇ కార్యాలయం వద్ద చిరంజీవులు, వ్యవసాయ శాఖ ఎడి కార్యాలయం వద్ద ఎడిఎ రమాదేవి, ఎఇ కార్యాలయం వద్ద నిశాంత్‌కుమార్, షాద్‌నగర్ విధుత్యుత్ శాఖ డిఇ శ్యాంసుందర్‌రెడ్డి, ఎడి సత్యనారాయణ, ఎఇ వినోద్‌లు జాతీయ జెండాను ఎగురవేశారు. షాద్‌నగర్ గ్రేడ్1 శాఖ గ్రంథాలయం వద్ద చైర్మెన్ మదన్మోహన్ రెడ్డి, బిఆర్‌ఎస్ కార్యాలయం వద్ద మాజీ ఎమ్మెల్యే వై.అంజయ్య యాదవ్, బిజెపి కార్యాలయం వద్ద నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి, అందె బాబయ్యలు జాతీయ జెండాను ఎగురవేశారు. కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యేలు చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి, భీష్వ కిష్టయ్య, నాయకులు బాబర్ ఖాన్, కొంకళ్ల చెన్నయ్య, చెంది తిరుపతి రెడ్డి, రఘునాయక్, అందె మోహన్, నీరటి వాసు, ముబారక్, టిడిపి పట్టణ అధ్యక్షుడు గందం ఆనంద్, సింగారం శ్రీనివాస్‌తోపాటు కార్యకర్తలు, యువత పాల్గొన్నారు.

**కొందుర్గు:** ప్రజాస్వామ్యానికి ప్రతీక గణతంత్ర దినోత్సవ వేడుక అని కొందుర్గు తహసీల్దార్ ఆజం అలీ అన్నారు. కొందుర్గు మండల కేంద్రంలో ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాపై జాతీయ జెండాను ఎగురవేశారు. తహసీల్దార్ ఆఫీస్ వద్ద తహసీల్దార్ ఆజాం అలీ, ఎంపిడిఒవో ఆఫీసు వద్ద ఎంపిడిఒ లక్ష్మీ అనురాధ, పోలీస్‌స్టేషన్ వద్ద ఎస్ఐ బాలస్వామి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద అమృత జోసఫ్, పశువైద్యశాల వద్ద డాక్టర్ వెంకటేష్, ఎంఇఒ ఆఫీస్ వద్ద గాయిత్రి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద గోపినాథ్, బిసి హాస్టల్ వద్ద వార్డెన్ రఘురాం, ఎస్సీ హాస్టర్ వద్ద వార్డెన్ సత్యనారాయణ, వ్యవయక శాఖ కార్యాలయం వద్ద ఎఒ రాజేందర్‌రెడ్డి, కొందుర్గు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ ప్రభాకర్, వివిధ రాజకీయ పార్టీల ఆఫీసుల వద్ద త్రివర్ణ జెండాను ఎగురవేశారు. కార్యక్రమాల్లో కొందుర్గు సర్పంచ్ ప్రభాకర్, ఉపసర్పంచ్ చంద్రశేఖర్, నాయకులు దామోదర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, శ్రీధర్‌రెడ్డి, పెంటయ్య, మాజీ ఎంపిటిసి ఆకుల మాణెయ్య, పురుషోత్తంరెడ్డి, మంగులాల్ నాయక్, నరేందర్, జంగయ్య, భీమారం మాణెయ్య తదితరులు పాల్గొన్నారు.

**హయత్ నగర్ :** ప్రతి భారతీయుడికి పండుగ లజరుపుకునే రోజు గణతంత్ర దినోత్సవం అని జక్కిడి ప్రభాకర్‌రెడ్డి అన్నారు గణతంత్ర దినోత్సవం సందర్భంగా టిపిసిసి ప్రతినిధి జక్కిడి ప్రభాకర్ రెడ్డి, జక్కిడి సత్య తేజరెడ్డి ఎల్‌బి.నగర్ నియోజకవర్గంలోని పలుకాలనీలలో జెండా ఆవిష్కరణ చేశారు. కార్యక్రమాల్లో జెట్టి అశోక్‌యాదవ్, అంజియాదవ్, విట్టల్‌రెడ్డి, అమర్‌గౌడ్, యంజాల రమేష్, కన్న, రాజిరెడ్డి, యంజాల టిల్లు, నవీన్ యాదవ్, గంగయ్య, ఏనుగు జంగారెడ్డి, బండ శ్యాంసుందర్‌రెడ్డి, ఎర్రబెల్లి సతీష్ రెడ్డి, మున్నా జానీ, రాజెందర్ యాదవ్, పృది రాజ్, రఘు, మహిళ నాయకులు ప్రమీల, లక్ష్మి పాల్గొన్నారు

**శేరిలింగంపల్లి :** గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని చందానగర్, శేరిలింగంపల్లి, గచ్చిబౌలి, మియాపూర్, హఫిజ్‌పేట్, మాదాపూర్, వివేకనంద్ నగర్, కొండాపూర్ డివిజన్‌లలో కార్పొరేటర్‌లతో కలసి శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడీ గాంధీ జెండా అవిష్కరణా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమాల్లో కార్పొరేటర్లు, మంజుల రఘునాథ్ రెడ్డి, ఉప్పలపాటి శ్రీకాంత్, నార్నె శ్రీనివాసరావు, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని గచ్చిబౌలి డివిజన్ పరిధీలోని ఖాజాగూడ, గోపన్‌పల్లి తాండ, ఎన్టీఆర్ నగర్, నల్లగండ్ల లలో శేరిలింగంపల్లి నియోజకవర్గం బిఆర్‌ఎస్ సీనియర్ నాయకులు, గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా జెండా అవిష్కరణా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో బిఆర్‌ఎస్ నాయకులు రాగం జంగయ్య యాదవ్, కార్యకర్తలు, నాయకులు, కాలనీల వాసులు పాల్గొన్నారు.

తుర్కయంజాల్: స్వాతంత్ర సమరయోధులను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని టెలిఫోన్ కాలనీ అధ్యక్షురాలు సౌజన్య అన్నారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదిభట్ల సర్కిల్ 15 తొర్రూరు డివిజన్ టెలిఫోన్ కాలనీ పార్క్ అవరణంలో ఏర్పాటు చేసిన జాతీయ జెండాను కమిటీ సభ్యులు, పెద్దలతో కలిసి సౌజన్య ఆవిష్కరించారు. కార్యక్రమంలో గుత్తా వెంకట్‌రెడ్డి, సంగీత మోహన్ గుప్తా, నక్క శ్రీనివాస్‌గౌడ్, మ హిళా అధ్యక్షురాలు సావిత్రి పాల్గొన్నారు

### శ్లోక పాఠశాలలో...

**రంగారెడ్డి:** రంగారెడ్డి జిల్లా మణికొండ శ్లోక పాఠశాలలో గణతంత్ర దినోత్సవ, వార్షిక క్రీడా దినోత్సవ కార్యక్రమాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల చైర్మన్ వెంకటరెడ్డి జాతీయ పతాక ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా నైనా జైస్వాల్ హాజరై ప్రసంగించారు. కార్యక్రమంలో మేనేజింగ్ డైరెక్టర్ వినోదారెడ్డి, ప్రిన్సిపాల్ డాతనుశ్రీ బిశ్వాస్, తదితరులు పాల్గొన్నారు.





### మధురానగర్‌లో...

గణతంత్ర దినోత్సవం సందర్భంగా మధురానగర్ కాలనీ(నాగోల్ డివిజన్) వెల్ఫేర్ అసోసియేషన్ అండ్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్స్ కమిటీ హాల్ వద్ద అసోసియేషన్ అధ్యక్షుడు ఉజ్జిని రత్నాకర్ రావు జాతీయ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీ అభివృద్ధికి అందరం కృషి చేయాలని కోరారు.













## సెలబ్రిటి క్లబ్‌లో ఘనంగా ఫుడ్ ఫెస్టివల్

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** గ్రేటర్ హైదరాబాద్‌లోని శామీర్‌పేట డివిజన్‌లో 77వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని సెలెబ్రిటి క్లబ్‌లో స్టేట్ ఇన్‌కం ట్యాక్స్ అసిస్టెంట్ కమిషనర్ సుబ్రమణ్యం, సెలెబ్రిటి క్లబ్ డైరక్టర్ సరోజినిరెడ్డిలు విచ్చేసి మువ్వన్నెల జాతీయ జెండాను ఆవిష్కరించారు. సోమవారం గణతంత్ర దినోత్సవం సందర్భంగా క్లబ్‌ను రంగు రంగుల జెండాలతో అతి సుందరంగా డిజిటల్ కాంతులతో ముస్తాబు చేశారు. పండగ వాతావరణంలో గణతంత్ర దినోత్సవ వేడుకలను అంబరాన్నంటిన సంబరాల మధ్య ఘనంగా జరుపుకున్నారు. అనంతరం క్లబ్ సిబ్బందికి స్వీట్లు, పండ్లు పంపిణీ చేసి అందరికి గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా సెలెబ్రిటి క్లబ్‌లో ఫుడ్ ఫెస్టివల్‌ను నిర్వహించారు. త్రివర్ణ రంగుల్లో తయారు చేసిన పలు రకాల స్వీట్లను స్టాల్స్‌లో పెట్టారు. ఈ స్టాల్స్‌ను రాష్ట్ర ఇన్‌కం ట్యాక్స్ అసిస్టెంట్ కమిషనర్ సుభ్రమణ్యం, క్లబ్ డైరక్టర్ సరోజిని రెడ్డిలు ముఖ్య అతిదులుగా విచ్చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సెలెబ్రిటి క్లబ్ జనరల్ మేనెజర్ విజయ్‌భరత్, ఆర్ఎం హరిజోసఫ్, సెలెబ్రిటి సిబ్బంది పాల్గొన్నారు.

## ఎగిరిన మువ్వన్నెల జెండాలు

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** 77వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని దేవరయాంజాల్‌లో టిపిసిసి ప్రధాన కార్యదర్శి పీసరి మహిపాల్‌రెడ్డి, దేవరయాంజాల్ గాంధీ విగ్రహం వద్ద జిల్లా ఆర్‌టిఏ మెంబర్ బీమిడి జైపాల్‌రెడ్డి, శామీర్‌పేట తహాశీల్దార్ కార్యాలయంలో తహాశీల్దార్ సుచరిత,



సిపిఐ కార్యాలయంలో డిజి సాయిలుగౌడ్, అలియాబాద్ కమిషనర్ కార్యాలయం లో కమిషనర్ చంద్రశేఖర్, శామీర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ శ్రీనాద్, అలియాబాద్ రైతు వేదికలో ఎఒ రమేష్, మండల విద్యాదికారి కమాలాకర్, మూడుచింతలపల్లి మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ పవన్‌కుమార్, తహాశీల్దార్ కార్యాలయంలో తహాశీల్దార్ ఇద్రిస్, రైతు వేదికలో ఎఒ రవికుమార్, మూడుచింతలపల్లిలో అంబేద్కర్ విగ్రహం వద్ద మాజి సర్పంచ్ జాం రవి, పలు ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు, ప్రైవేట్ కార్యాలయాల్లో యాజమాన్యాలు, జాతీయ జెండాలను ఎగురవేసి సంబరా లు జరుపుకున్నారు. జగ్గంగూడలో మాజీ వార్డు సభ్యుడు సాయి బాబు ప్రాథమిక పాఠశాలకు మైక్‌సెట్ విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించారు.



## జాతీయ జెండా ఆవిష్కరించిన సిఐ సుధీర్‌రెడ్డి

**ప్రజాపక్షం/నిజాంపేట్‌:** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని సురారం న్యూ శివాలయం నగర్‌లో శివాజీ యూత్ అసోషియేషన్ సభ్యులు ఏర్పాటు చేసిన జాతీయ జెండాను సురారం సిఐ సుధీర్‌కృష్ణ, ఎస్ఐ మురళీగౌడ్‌లు ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు వెంకట్ రావు, అంజనేయులు, ప్రెస్‌క్లబ్ వర్కింగ్ ప్రసిడెంట్ సాయిబాబా, సంతోష్ కుమార్, శాంతన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



## బిఆర్ఎస్ కార్యాలయం ప్రారంభం

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో మూడుచింతలపల్లిలోని అన్ని వార్డు కార్యాలయాలను బిఆర్ఎస్ పార్టీ కైవసం చేసుకుంటుందని చైర్మన్ పీఠం బిఆర్ఎస్ దక్కించుకుంటుందని బిఆర్ఎస్ రాష్ట్ర సీనియర్ నాయకుడు డాక్టర్ చామకూర భద్రారెడ్డి అన్నారు. సోమవారం మూడుచింతలపల్లి మున్సిపల్ కేశవరంలో బిఆర్ఎస్ పార్టీ గ్రామాధ్యక్షుడు కొంపల్లి భూమేష్‌గౌడ్ ఆధ్వర్యంలో బిఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని డాక్టర్ చామకూర భద్రారెడ్డి ప్రారంబించారు. ఈ సందర్భంగా మున్సిపల్ 24, 20 వార్డుల్లో బిఆర్ఎస్ అభ్యర్థులు కొంపల్లి మాధవి భూమేష్‌గౌడ్, చిత్తారిలతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత పదేళ్లలో బిఆర్ఎస్ చేసిన అభివృద్ధి కనిపిస్తుందని మున్సిపల్ ఎన్నికల్లో బిఆర్ఎస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించుకుందామని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజి సర్పంచ్‌లు ఉదతల జ్యోతిబాల్‌రామ్ గౌడ్, హరిమోహన్‌రెడ్డి, ఉదతల కృష్ణ, కంగారు లక్ష్మి నారాయణ, మైసయ్యయాదవ్, మంద సురేష్, ప్రదీప్, శివ, బోసు, శ్రీను, వెంకటేష్, మహేష్, నర్సింలు, ఎండి గౌస్, కృష్ణ, గోపి తదితరులు పాల్గొన్నారు.

**కూకట్‌పల్లిలో :** కెపిహెచ్‌బి డివిజన్‌లో పలు ప్రాంతాలలో సోమవారం గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా 9వ ఫేస్ బిఆర్ఎస్ పార్టీ కార్యాలయం వద్ద జాతీయ జెండాను ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ముఖ్య అతిథిగా విచ్చేసి కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావుతో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు కృష్ణారెడ్డి, నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకులు, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



# సమన్వయం, సహకారం... అభివృద్ధికి అవసరం

### కలెక్టర్ మనుచౌదరి







**ప్రజాపక్షం/మేడ్చల్‌మల్కాజిగిరి/మల్కాజిగిరి:** జిల్లాను మరింత అభివృద్ధి పథంలో తీసుకొని వెళ్లేందుకు అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయం, సహకారంతో కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనుచౌదరి అన్నారు. సోమవారం కలెక్టరేట్ ఆవరణలో నిర్వహించిన 77వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ఆయన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. పలు విద్యా సంస్థల విద్యార్థినీ విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు పలువురిని అలరించాయి. విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనపరచిన ప్రభుత్వ కార్యాలయ ఉద్యోగులకు కార్యక్రమంలో కలెక్టర్ ప్రశంసా పత్రాలను అందచేసారు. జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, మల్కాజిగిరి డిసిపి సిహెచ్ శ్రీధర్, డిఆర్ఓ హరిప్రియ, వివిధ శాఖల అధిపతులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.








**సిపిఐ పార్టీ కార్యాలయంలో...**
సిపిఐ కాప్రా సమితి ఆధ్వర్యంలో ఇసిఐఎల్‌లోని పార్టీ కార్యాలయం నీలం రాజశేఖరరెడ్డి భవన్ వద్ద టూవీలర్స్ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు మహేందర్ జాతీయ పతాకాన్ని ఎగురవేసారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు విఎస్. బోస్ మాట్లాడుతూ రాజ్యాంగం అమలులోకి వచ్చాక స్వేచ్ఛ, సమానత్వం, సౌభాతృత్వం, లౌకికత వంటి విలువలు దేశానికి దక్కాయన్నారు. కానీ నేడు రాజ్యాంగ హక్కులపై కొనసాగుతున్న దాడులు శోచనీయమన్నారు.

**నేరేడ్‌మెట్ చౌరాస్తాలోని** లేబర్ అడ్డా భవన నిర్మాణ కార్మికుల ఆధ్వర్యంలో జరిగిన గణతంత్ర వేడుకల్లో సిపిఐ నేత జె.వెంకటరమణ జాతీయ జెండా ఎగురవేసా రు. **గోకుల్‌నగర్‌లో...**గోకుల్‌నగర్ కాలనీలో స్థానికులు ఘనంగా గణతంత్ర వేడుకలను నిర్వహించారు. **మల్లాపూర్‌లో...**మల్లాపూర్ ఎలిఫెంట్ సర్కిల్ వద్ద ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, స్థానిక కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి స్థానికుల సమక్షంలో జాతీయ పతాకాన్ని ఎగురవేసారు.







**నాచారంలో...**నాచారం విలేజి కార్యాలయంలో మాజీ కౌన్సిలర్ తిరుపతి, మైనార్టి ప్రతినిధులు గఫూర్, మదరసా అరేబియా జామియా అధ్యక్షులు కరీం, కనకరావులు జాతీయ పతాకాన్ని ఎగురవేసి గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించారు. **కాకతీయనగ–ర్‌లో...**కాకతీయనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన గణతంత్ర వేడుకల్లో కాలనీ ప్రెసిడెంట్ బాలస్వామి,కృష్ణ, తేజ నాయక్, తిరుపతి, శంకర్ తదితరులు పాల్గొన్నారు. **మల్కాజిగిరిలో..** మల్కాజిగిరి చౌరాస్తాలో జరిగిన మరో కార్యక్రమంలో కాంగ్రెస్ బి బ్లాక్ అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్, బికె శ్రీనివాస్, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు. **ఈస్ట్ ఆనంద్–బాగ్‌లో...**బండ చెరువు వాకర్ టౌన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన గణతంత్ర వేడుకల్లో స్థానిక కార్పొరేటర్ జెండా ఎగురవేయగా పెంటయ్య, శివాజి, రమేష్, ఆగమయ్య, తదితరులు పాల్గొన్నారు. **గౌతం–నగర్‌లో...** గౌతంనగర్ డివిజన్‌లోని భాష్యం పాఠశాల, రాజా శ్రీనివాసనగర్, మిర్జాలగూడ, మల్లికార్జున నగర్, న్యూ వెంకటేశ్వర నగర్, రామాంజనేయనగర్, గౌతంనగర్, హన్మాన్‌పేట తదితర ప్రాంతాల్లో స్థానిక కార్పొరేటర్ జాతీయ జెండాలను ఎగురవేసి ఘనంగా గణతంత్ర వేడుకలను నిర్వహించారు.

# సిపిఐ ఆధ్వర్యంలో గణతంత్ర దినోత్సవ వేడుకలు





**ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్‌:** గణతంత్ర దినోత్సవం సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ ఆధ్వర్యంలో సోమవారం గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జగద్గిరిగుట్ట, మక్దుమ్‌నగర్, శ్రీనివాస్ నగర్, శ్రీరామ్ నగర్, రంగారెడ్డినగర్, ఐడిపిఎల్ కాలనీ, షాపూర్ నగర్ ప్రాంతాలలో జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు యూసుఫ్, జిల్లా కార్యదర్శి ఉమా మహేష్, రాష్ట్ర నాయకులు ఏసురత్నం, మండలం కార్యదర్శి స్వామి, సహాయ కార్యదర్శులు హరినాథ్‌రావ్, రాములు, ఎఐటియుసి కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు సదానందం, నర్సింహారెడ్డి, కుమార్, సహదేవ్‌రెడ్డి, వీరస్వామి, తదితరులు పాల్గొన్నారు.

**జగద్గిరిగుట్టలో :** కుత్బుల్లాపూర్ మండలం జగద్గిరిగుట్టలో సోమవారం సిపిఐ ఆధ్వర్యంలో రిపబ్లిక్‌డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు జాతీయ జెండాను ఆవిష్కరించి, ప్రజలకు రిపబ్లిక్ డే శుభాకాంక్షలు తెలియజేశారు.

**నిజాంపేట్ సర్కిల్ పరిధిలో:** నిజాంపేట్ సర్కిల్ పరిధిలోని వివిధ ప్రాంతాలలో సోమవారం సిపిఐ ఆధ్వర్యంలో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిపిఐ నాయకులు పొన్నకంటి దస్తగిరి, సిపిఐ సీనియర్ నాయకులు ఆశీ యాదయ్య, కోలన్ (లీడర్) నర్సింహారెడ్డిలు హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఐ బాచుపల్లి మండల కార్యదర్శి పాలబిందెల శ్రీనివాస్ మాట్లాడుతూ నిజాంపేట్ సర్కిల్ పరిధిలోని నిజాంపేట్ డంపింగ్ యార్డ్, నిజాంపేట్ వార్డు కార్యాలయం, రాజధాని స్కూల్ వద్ద జాతీయ జెండాను ఆవిష్కరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు నందు, చంద్రయ్య, నర్సింహ, తదితరులు పాల్గొన్నారు.



**దేశభక్తితో ముందుకు సాగాలి : కార్పొరేటర్ కొలుకుల జగన్**
దేశ సమగ్ర అభివృద్ధికి ప్రతి ఒక్కరూ రాజ్యాంగ విలువలను కాపాడుతూ, దేశభక్తితో ముందు కు సాగాలని కార్పొరేటర్ కొలుకుల జగన్ పిలుపునిచ్చారు. కుత్బుల్లాపూర్ నియోజకరవర్గం జగద్గిరిగుట్ట డివిజన్ లో వివిధ కాలనీలలో నిర్వహించిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో కె.జగన్‌జాతీయ జెండాను ఆవిష్కరించారు.

## కాంగ్రెస్ నేతపై సస్పెన్షన్ వేటుకు సిద్ధం

### నేడో, రేపో పార్టీ నుండి సస్పెన్షన్‌కి ఆదేశాలు వెలువడే అవకాశం
### వెల్లడించిన కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్

**ప్రజాపక్షం/నిజాంపేట్‌:** కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ఓ కాంగ్రెస్ పార్టీ నేత పై అధిష్టానం సస్పెన్షన్ వేటుకు రంగం సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్నందున నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జ్ సస్పెన్షన్ వేటు వేస్తున్నట్లు సమాచారం. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని నిజాంపేట్ మున్సిపల్ సర్కిల్ పరిధికి చెందిన ఓ మాజీ ప్రజాప్రతినిధి గత కొంతకాలంగా కాంగ్రెస్ పార్టీలో ఉంటూ పార్టీ వ్యతిరేక పనులకు పాల్పడుతున్న క్రమం లో పార్టీ అధిష్టానం వేటుకు రంగం సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. కుత్బుల్లాపూర్ నియోజవర్గం కాంగ్రెస్ పార్టీ కార్యాలయం బాచుపల్లి లో కొనసాగుతుంది. అయితే ఇటీవల ఓ మాజీ ప్రజాప్రతినిధి బాచుపల్లిలోనే మరో కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ప్రారంభించడం చర్చనీయాంశమైంది. అంతేకాకుండా అక్రమ షెడ్డుని ఏర్పాటు చేసుకుని మరీ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించడం దేనికి సంకేతం ఇస్తుందని పలువురు వాపోయారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ బాచుపల్లిలోని పార్టీ కార్యాలయంలో పార్టీకి చెందిన కార్యక్రమాలు నిరంతరం నిర్వహిస్తుంటారు. కాని బాచుపల్లిలోనే మరో పార్టీ కార్యాలయం ప్రారంభించడం సర్వత్రా విమర్శలు వెల్లువెత్తా యి. అంతేకాకుండా బిఆర్ఎస్ ఫ్లెక్సీలు, కటౌట్‌లలో కాంగ్రెస్ నేత ఫోటో రావడం పై పార్టీ లో చర్చ జోరుగా సాగింది. ఇదిలా ఉండగా గత పార్లమెంట్ ఎన్నికల్లో సైతం కాంగ్రెస్ పార్టీ లో ఉండి మరో పార్టీ అభ్యర్థికి పూర్తి స్థాయిలో పనిచేసినట్లు పూర్తి సమాచారం కాంగ్రెస్ అధిష్టానం వద్దకు చేరినట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఇలా ఓ నేత కాంగ్రెస్ పార్టీలో ఉంటూనే ఇతరులకు పనిచేయడం, పార్టీ కార్యక్రమాలకు వ్యతిరేకంగా పని చేయడం అధిష్టానం దృష్టికి వెళ్లినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. దీంతో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ అట్టి కాంగ్రెస్ నేత పై వేటు వేయడానికి పిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్‌తో పాటు మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వజ్రేష్ కుమార్‌తో మాట్లాడి స్వయంగా సస్పెన్షన్ వేటు వేసేందుకు రంగం సిద్ధం చేసినట్లు సమాచారం.

సంక్రాంతి పండుగ ముందు ఏకంగా పార్టీ నాయకుల ముందే నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి కొలను హన్మంత రెడ్డి ఇట్టి విషయాన్ని బహిర్గతం చేయడం గమనార్హం. నేడో, రేపో సస్పెన్షన్ వేటు పడనున్నట్లు కాంగ్రెస్ నేతలే చెప్పుకోవడం విశేషం.

## అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

**ప్రజాపక్షం/చర్లపల్లి:** గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని చర్లప ల్లి డివిజన్ పరిధిలోని పెద్ద చర్లపల్లిలో భగత్‌సింగ్ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు ముఖ్య అతిథిగా చర్లపల్లి డివిజన్ కాంటెస్టెంట్ కార్పొరేటర్, సీనియర్ టిడిపి నాయకులు రుద్రగోని రాంచందర్ గౌడ్ మువ్వన్నెల జెండాను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో రాగీరు సత్యనారాయణ గౌడ్, సానెం పరమేష్‌గౌడ్, రుద్రగోని వెంకటేశం, తదితరులు పాల్గొన్నారు. **సెరినిటీ స్కూల్‌లో ...** నాగారం డివిజన్ పరిధిలోని సెరినిటీ పాఠశాలలో గణతంత్ర దినోవ్సవాన్ని పురస్కరించుకుని స్కూల్ కరస్పాండెంట్ నోముల జంగిరెడ్డి ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, చిన్నారులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి నోముల వసంత, ఏఓ సుబ్బారావు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



**ప్రెస్‌క్లబ్ ఆఫీసు వద్ద:** కాప్రా ప్రెస్ క్లబ్ వద్ద 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి.కుషాయిగూడ ఏసిపి వెంకట్ రెడ్డి,సిఐ భాస్కర్‌రెడ్డిలు ముఖ్య అతిథులుగా విచ్చేసి మువ్వన్నెల జెండా ను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ఉల్లోజు, వేముల శంకర్, కోశాధికారి రుద్రగోని నర్సింగ్ గౌడ్,ఉపాధ్యక్షులు అదిమూలం శ్రీనివాస్,గోపాల్‌గౌడ్,నటరాజ్,వట్టిపల్లి సురేష్,సీనియర్ జర్నలిస్టులు,సలహాదారులు, దితరులు పాల్గొన్నారు.



# అన్ని వర్గాలకు సమాన అవకాశాలు అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం

### కలెక్టర్ ప్రతీక్‌జైన్







**ప్రజాపక్షం/వికారాబాద్‌:** జిల్లా అభివృద్ధి పథంలో నిలుపుటకు అందరి సహకారం ఎంతైనా అవసరమని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. 77వ భారత గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ జాతీయ జెండాను ఎగురవేశారు. జిల్లా కలెక్టర్ ఎస్పి స్నేహ మెహ్రాలు పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. కలెక్టర్ ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రపంచంలోని గొప్ప సత్యసత్తాక , సామ్యవాద లౌకిక, ప్రజాస్వామ్య గణతంత్ర దేశంగా భారతదేశాన్ని నిలుపుకునేందుకు భారతరత్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సారథ్యంలో భారత రాజ్యాంగం 1950 జనవరి 26న అమలులోకి తెచ్చుకున్నామన్నారు. ప్రజాపాలన, పారదర్శకతతో సమాజంలోని అన్ని వర్గాలకు స్వేచ్ఛ సామాజిక న్యాయము సమాన అవకాశాలు అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నా న్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన పథకాలు ఇతర రాష్ట్ర లకు ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. ఈ సందర్భంగా వివిధ పాఠశాలల విద్యార్థినివిద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం జిల్లాలో ఉత్తమ సేవలు అందించిన అధికారులకు, ఉద్యోగులకు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు యాదయ్య, మనోహర్‌రెడ్డి అదనపు కలెక్టర్లు రాజేశ్వరి, సుధీర్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వికారాబాద్‌జిల్లా జెడ్పి కార్యాలయంలో జిల్లా కలెక్టర్‌ప్రతీక్‌జైన్ , జిల్లా ఎస్పి కార్యాలయంలో జిల్లా ఎస్పి స్నేహమెహ్రా జాతీయ జెండాను ఎగురవేశారు. ఆర్‌డిఓ కార్యాలయంలో అర్‌డిఓ వాసుచంద్ర, మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక అధికారి అదనపు కలెక్టర్ సుధీర్ వ్యవసాయ మార్కెట్‌లో మార్కెట్ చైర్మన్ శ్రీనివాస్ ముదిరాజ్, తహసీల్దార్ కార్యాలయంలో లక్ష్మి నారాయణ, ఎంపిడిఓ కార్యాలయంలో జాతీయ జెండాను ఎగురవేశారు.



**బంట్వారంలో:** బంట్వారం మండల పరిధిలో ఉన్న ప్రభుత్వ కార్యలయాల్లో, గ్రామ పంచాయతీ కార్యలయాల్లో గణతంత్ర దినోత్సవ వేడుకలను ఎంతో ఘనంగ నిర్వహించారు. బంట్వారం పోలీస్టేషన్‌లో ఎస్ఐ విమల తహసీల్దార్ కార్యలయంలో యంఆర్ఓ విజయ్ కూమార్, మండల పరిషత్తు కార్యలయంలో ఎంపిడిఓ రాములు, పిఎసిఎస్ కార్యాలయంలో సిఇఓ శ్రీనివాస్, గ్రామ పంచాయతీ కార్యలయాల్లో అయా గ్రామాల సర్పంచులు, పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు.



## ఉత్తమ ఇన్‌స్పెక్టర్‌గా శ్రీనాథ్

**ప్రజాపక్షం/శామీర్‌పేట:** శామీర్‌పేట ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న సనా శ్రీనాథ్ ఉత్తమ పోలీస్ ఇన్‌స్పెక్టర్‌గా ఎంపిక కావడంతో మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో మల్కాజ్‌గిరి కమిషనరేట్‌కు చెందిన ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ శ్రీనాథ్‌కు జిల్లా కలెక్టర్ మను చౌదరి, ఉప్పల్ డిసిపి సురేష్‌లు ప్రశంసాపత్రం అందజేశారు. ఇటీవలనే దేశంలో ఏడో స్థానం, రాష్ట్రంలో మొదటి స్థానంలో ఉత్తమ పోలీస్‌స్టేషన్‌గా శామీర్‌పేట ఎంపికైంది. కాగా శామీర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ప్రజలు అందుబాటులో ఉంటూ ప్రజా శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, చట్ట అమలులో అంకిత భావంతో విధులు నిర్వహించి నందుకు ఇన్‌స్పెక్టర్ శ్రీనాద్ ఉత్తమ పోలీస్‌గా ఎంపికయ్యారు. దీంతో పలువురు ప్రజా ప్రతినిధులు ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.



## వాగ్వాదానికి దారి తీసిన గణతంత్ర వేడుకలు..

**ప్రజాపక్షం/నిజాంపేట్ :** బాచుపల్లి మండలం, రాజీవ్ గాంధీ నగర్ రోడ్ నంబరు ఆరులో పార్టీలకతీతంగా ఏర్పాటు చేసిన గణతంత్ర దినోత్సవ వేడుకలు వాగ్వాదానికి దారి తీశాయి. కాలనీ సభ్యులంతా కలిసి మాజీ కార్పొరేటర్‌లైన ఆగం పాండు, ఆగం రాజులకు ఆహ్వానం తెలుపగా సోమవారం ఉదయం ముందుగా విచ్చేసిన ఆగం పాండు జెండాను ఎగురవేసేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో కాలనీ సభ్యులు కాస్త ఆగాలని, ఆగం రాజన్న వస్తున్నారని చెప్పడంతో వారెవరు, ఎవరు ఎంతటి వారు అంటు పాండు చుర్రుబుర్రులాడారని స్థానికులు తెలిపారు. దీంతో కాలనీ వాసులకు ఆగం పాండుకి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలోనే మాజీ కార్పొరేటర్ ఆగం రాజు విచ్చేసి జాతీయ జెండాను ఎగురవేసి దేశ భక్తి గీతాన్ని ఆలపించారు. ఇదిలా ఉండగా బాచుపల్లి దళిత వాడలో ఓ వర్గ సంఘం సభ్యులు మాజీ కార్పొరేటర్ ఆగం పాండుని ఆహ్వానించి జాతీయ జెండాను ఎగురవేయించారు. దీంతో మరో వర్గ సంఘం సభ్యులు గణతంత్ర దినోత్సవ వేడుకలకు పిలిస్తే పార్టీలకతీతంగా నాయకులందరిని పిలవాలి తప్ప ఒక్కరినే పిలవడం ఏమిటంటూ ఇరు వర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకున్నట్లు సమాచారం. ఏదిఏమైనప్పటికీ బాచుపల్లిలో గణతంత్ర దినోత్సవ వేడుకలు కాస్త వాడివేడిగా జరగడం గమనార్హం.



## అతిపెద్ద రాజ్యాంగం ఉన్న దేశం భారత్

**కూకట్‌పల్లి/ప్రజాపక్షం:** ప్రపంచంలోనే అతిపెద్ద రాజ్యాంగం గల దేశంగా భారతదేశం ఉండడం గర్వకారణమని, భావితరాలకు మన దేశం యొక్క చరిత్రను, త్యాగధనుల పోరాటపటిమను భవిష్యత్ తరాలకు తెలిపే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. సోమవారం కెపిహెచ్‌బి రోడ్ నెంబర్ 1 గాంధీ విగ్రహం వద్ద గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పాల్గొని కార్పొరేటర్ శిరీషా బాబురావుతో కలిసి జాతీయ జెండాను ఆవిష్కరించి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యర్తలు, మహిళా నేతలు, అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

**మహంకాళి నగర్‌లో :** మహంకాళి నగర్‌లో సోమవారం గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ ముఖ్య అతిథిగా విచ్చేసి కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌తో కలిసి జాతీయ జెండాను ఆవిష్కరించారు.



ప్రజాపక్షం
Telugu National Daily
హైదరాబాద్
మంగళవారం
27-01-2026
www.prajapaksham.in

"పద్మ అవార్డు గ్రహీతలందరికీ మెగాస్టార్ చిరంజీవి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సోషల్ మీడియా పోస్ట్ ద్వారా ఆయన అభినందనలు తెలియజేశారు. విశిష్ట వ్యక్తులను సత్కరించడం చాలా ఆనందాని కలిగిస్తుంది. ఎంతో సంతోషంగా ఉంది అని పేర్కొన్నారు."

# రీల్


## ఆల్ టైం ఇండస్ట్రీ హిట్ సెలబ్రేషన్‌లో చిరంజీవి



తనకు గతవైభావాన్ని తీసుకొచ్చిన తెలుగు ప్రేక్షకులకు మనస్ఫూర్తిగా కృతాజ్ఞతలు చెప్పుకుంటున్నానని చిరంజీవి అన్నారు. మన శంకర వర ప్రసాద్ గారు సినిమా ఆల్ టైం ఇండస్ట్రీ హిట్ (రీజనల్ ఫిల్మస్) సెలబ్రేషన్ హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సెలబ్రేషన్స్‌లో చిర ంజీవి మాట్లాడుతూ ఇంత పెద్ద సక్సెస్ ఇచ్చి గత వైభవాన్ని మళ్లీ పునరావృతం చేసిన తెలుగు ప్రేక్షకులందరికీ మనస్ఫూర్తిగా శిరస్సు వంచి ధ న్యవాదాలు తెలియజేస్తున్నాను. సక్సెస్ ఎప్పుడూ కూడా బోర్ కొట్టదు. మనం ప్రతిరోజు తినే అన్నం కూర మనకు ఎలా అయితే బోర్ కొట్టవో విజయం ఇచ్చే ఉత్సాహం ఎప్పుడూ కూడా అద్భుతంగా ఉంటుంది. సీనియారిటీతో మెచ్యూరిటీ రావడంతో ఒక్కొక్కలా స్పందిస్తాం తప్పితే మీరందరూ ఈ విజయాన్ని ఎంతలా సెలబ్రేట్ చేసుకుంటున్నారు అంతకంత మనసులో నేను ఆస్వాదిస్తున్నాను. ప్రజల్లోకి వెళ్ళండి వాళ్లతో ఇంట్రాక్ట్ అవ్వండి ప్రేక్షకులు ఇచ్చే కిక్కు వేరే ఉంటుందని అనిల్, సాహుతో చెప్పాను. వాళ్ళు ఇచ్చే ఉత్సాహం భవిష్యత్తులో చేసే సినిమాలకి ఒక ఇంధనం లాగా పనిచేస్తుంది. ఇలాంటి ప్రేమని నేను ఎన్నోసార్లు అనుభవించాను. అ లాంటి ఉత్సాహం చాలా సంవత్సరాల తర్వాత పునరావృతం కావడం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. ఖైదీ 150, వాల్తేర్ వీరయ్య తర్వాత ఈ మధ్యకాలంలో అంత ఎంజాయ్ చేస్తూ షూటింగ్ చేసిన సినిమా మన శంకర వరప్రసాద్. షూటింగ్ చివరి రోజు చాలా ఎమోషనల్ అయ్యాను. ఇది జీవితంలో మర్చిపోలేని సంక్రాంతి. డైరెక్టర్ అనిల్‌కి థాంక్యూ. ఆయన టీమ్ అందరికీ కంగ్రాచ్యులేషన్స్. ఈ సినిమాకి పని చేసిన మిగతా టెక్నీషియన్స్ అందరికీ కంగ్రాజులేషన్స్. ఇలాంటి విజయాలు మరెన్నో రావాలని కోరుకుంటున్నాను. డైరెక్టర్ కె రాఘవేంద్రరావు మాట్లాడుతూ ఈ విజయం సుస్మిత సాహుపై బాధ్యతని మరింత పెంచింది. చిరంజీవి, అల్లు రామలింగయ్య మేము అందరం చిన్నప్పటి నుంచి ఒక కుటుంబం లాగా పెరిగాము. స్వర్గీయ ఎన్టీ రామారావుతో 12 సినిమాలు చేస్తే చిరంజీవితో 14 సినిమాలు చేశాను. చిరంజీవి అనిల్‌తో సినిమా చేస్తే బాగుంటుందని ఒక విత్తనాన్ని నాటాను. అది ఆ సినిమా ఈరోజు మహా వృక్షంగా మారింది. ఈ సినిమాలో వెంకటేష్ కూడా చివరిలో జాయిన్ అవ్వడం దుమ్ము దులిపేసింది. ఇద్దరు కలిసి పోటీ పడి చేశారు. . 30 ఏళ్ల క్రితం ఎలా డాన్స్ చేశారో ఇప్పటికి కూడా అదే గ్రేస్‌తో చేశారు. సంక్రాంతి సమయానికి ఇండస్ట్రీ చాలా డల్‌గా ఉంది. చిరంజీవి సంజీవని తీసుకొచ్చి మొత్తం ఇండస్ట్రీని బతికించారు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో అనిల్ రావిపూడి, భీమ్స్, నిర్మాత సాహు గారపాటి, నిర్మాత సు స్మిత కొణిదెల, డైరెక్టర్ వివి వినాయక్, నిర్మాత దిల్ రాజు, ప్రొడ్యూసర్ సుప్రియఆర్ డైరెక్టర్ ప్రకాష్, గేయ రచయితలు కాసర్ల శ్యామ్ , అనంత శ్రీరామ్ , భాస్కర్ భట్ల పాల్గొన్నారు.

## ఇరుముడి ఫస్ట్ లుక్ రిలీజ్

మాస్ మహారాజా రవితేజ తన 77వ చిత్రం కోసం దర్శకుడు శివ నిర్వాణతో జతకట్టారు. ఈ చిత్రాన్ని ప్రముఖ పాన్ఇండియా బ్యానర్ మైత్రి మూవీ మేకర్స్ నిర్మిస్తున్నారు. రవితేజ పుట్టినరోజును సందర్భంగా ఈ చిత్రం టైటిల్, అద్భుతమైన ఫస్ట్ లుక్ పోస్టర్ రిలీజ్ చేశారు.ఈ చిత్రానికి 'ఇరుముడి' అనే టైటిల్ పెట్టారు. ఈ టైటిల్ ఆధ్యాత్మిక ప్రాముఖ్యతతో అయ్యప్ప స్వామి దీక్షను సూచిస్తోంది. ఈ ఫస్ట్ లుక్‌లో రవితేజ సాంప్రదాయ అయ్యప్ప మాల దుస్తులు ధరించిన ఆధ్యాత్మిక అవతార్ లో కనిపించారు. భక్తులతో నిండిన వేడుక ఊరేగింపులో, గొప్ప ఆనందోత్సాహాలతో క నిపిస్తున్నారు. . రవి తేజ పాపని ఎత్తుకు ని చిరునవ్వుతో కనిపించడం అందరినీ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా రవితేజ తన ఆనందాన్ని షేర్ చేశారు జీవితంలో సరైన సమయంలో కొన్ని కథలు మ నల్ని ఎంచుకుంటాయి. అలాంటి ఒక కథలో మళ్ళీ భాగమైనందుకు అదృష్టంగా భావిస్తున్నాను, నమ్మకమే మార్గదర్శకంగా సాగుతున్నాను. దర్శకుడు శివతో కలిసి ఇరుముడి అనే ఈ కొత్త ప్ర యాణాన్నిప్రారంభిచడం సంతోషంగా ఉందని అన్నారు .మైత్రి మూవీ మేకర్స్ నిర్మాణ సంస్థ, పుట్టినరోజు శుభాకాంక్షలు తె లుపుతూ.ఇరుముడి 'ప్రతి భావోద్వేగం ఒక వేడుకే' మాస్ మహారాజా రవితేజ కు పుట్టినరోజు శుభాకాంక్షలు అయ్య ప్ప స్వామి ఆశీస్సులతో ప్రారంభమవుతుంది అని పేర్కొన్నారు. దర్శకుడు శివ నిర్వాణ పవర్ ఫుల్ స్క్రిప్ట్‌ను రూపొంది ంచారు.ప్రియా భవాని శంకర్ కథానాయికగా నటిస్తుండగా, బేబీ నక్షత్ర ధరితిక కుమార్తె పాత్రను పోషిస్తోంది. సా యి కుమార్, అజయ్ ఘోష్, రమేష్ ఇందిర,స్నాని కీలక పాత్రల్లో న టిస్తున్నారు.విష్ణు శర్మ సినిమాటోగ్రఫీ, సామ సురేష్ ప్రొడక్షన్ డిజైన్, ప్రవీణ్ పూడి ఎడిటర్. శివ ని ర్వాణ కథ, స్క్రీన్‌ప్లే సంభాషణలు రా శారు, నరేష్ బాబు పి స్క్రిప్ట్ కోఆర్డినేటర్ గా వ్యవహరిస్తున్నారు. ఇరుముడి షూ టింగ్ ప్రస్తుతం శరవేగంగా జరుగుతోం ది.నిర్మాతలు: నవీన్ యెర్నేని, వై రవిశంకర్ ఈ చిత్రానికి నిర్మాతలు.



ఇరుముడి ఫస్ట్ లుక్ రిలీజ్

## జాతీయ అవార్డు గ్రహీతతో మోహన్ లాల్ చిత్రం

మోహన్‌లాల్ కథానాయకుడిగా శ్రీ గోకులం మూవీస్ బ్యానర్‌పై నిర్మాత గోకులం గోపాలన్ నిర్మిస్తున్న కొత్త చిత్రాన్ని అధికారికంగా ప్రకటించారు. జాతీయ అవార్డు గెలుచుకున్న తన తొలి చిత్రం 'మెప్పాడియన్'తో బలమైన ముద్ర వేసిన విష్ణు మోహన్ ఈ చిత్రానికి కథ అందించి దర్శకత్వం వహించనున్నారు. భారీ స్థాయిలో నిర్మితమవుతున్న ఎల్ 367, శ్రీ గోకులం మూవీస్ చరిత్రలోనే బిగ్గెస్ట్ మూవీ కానుంది. ఈ ప్రాజెక్ట్‌కు బైజు గోపాలన్, వి సి ప్రవీణ్ సహ నిర్మాతలుగా వ్యవహరించనుండగా, కృష్ణమూర్తి ఎగ్జిక్యూటివ్ నిర్మాతగా ఉన్నారు.భారీ కాన్వాస్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో



ఫారిన్, బాలీవుడ్ ప్రముఖ నటీనటులు, అగ్రశ్రేణి సాంకేతిక నిపుణులు కలిసి పనిచేయనున్నారు. చిత్ర బృందం త్వరలోనే షూటింగ్ ప్రారంభించనుంది. నటీనటులు, సాంకేతిక నిపుణుల గురించిన మరిన్ని వివరాలు త్వరలో తెలియజేస్తారుప్రస్తుతం శ్రీ గోకులం మూవీస్ నిర్మాణంలో సురేష్ గోపి నటించిన ఒట్టకొంబన్, జయరామ్‌కాళిదాస్ జయరామ్ ఆశకల్ ఆయిరం, జయసూర్య నటించిన కథనార్, నివిన్ పోలీబి ఉన్నికృష్ణన్ చిత్రం, ఎస్ జె సూర్య దర్శకత్వం వహించిన కిల్లర్ వంటి అనేక ప్రతిష్టాత్మక ప్రాజెక్టులు ఉన్నాయి. ఈ జాబితాలో ఎల్ 367 కూడా చేరడంతో ఈ బ్యానర్ మలయాళ సినిమా రంగంలో ఒక శక్తివంతమైన నిర్మాణ సంస్థగా తన స్థానాన్ని మరింత పటిష్టం చేసుకుంటోంది.

## సీతారామశాస్త్రి కాంస్య విగ్రహావిష్కరణ

ప్రముఖ సినీ గేయ రచయిత దివంగత సిరివెన్నెల సీతారామశాస్త్రి కాంస్య విగ్రహాన్ని దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ ఆవిష్కరించారు.అనకాపల్లి గాంధీనగర్ శ్రీ వెంకటేశ్వర స్వామి గుడి దగ్గర ఈ విగ్రహాన్ని కుటుంబసభ్యులు,ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సహాయంతో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా త్రివిక్రమ్ మాట్లాడుతూ అనకాపల్లి సిరి వెన్నెల వంటి వారి ఎందరికో పుట్టినిల్లు అన్నారు. మహనీయుల చరిత్ర తర్వాత తరాల వారికి తెలియాలన్న, స్ఫూర్తి పొందాలన్నా ఇలాంటి విగ్రహాలు ఏర్పాటు అవసరమన్నారు. ఏ మనిషిని అయినా తన ఆలోచనలే ఉన్నత స్థితికి తీసుకెళ్తాయన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ, మాజీ మంత్రి మండలి బుద్ధ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



## పాత్రల ఎంపికలో జాగ్రత్త తీసుకుంటా



ఇటీవల విడుదలైన 'దండోరా' లోని తన పాత్రకు చాలా మంది పేరు వచ్చిందని, అలాగే తన నటనకు కూడా మంచి గుర్తింపు లభించిందని హీరో నవదీప్ అన్నారు. ఈ పాత్ర పాత్ర ఆయన కెరీర్‌లోనే అత్యుత్తమ నటనలలో ఒకటిగా ప్రశంసలు అందుకుంటోందని చెప్పారు.ఈ పాత్ర ద్వారా నటుడు కనిపించకుండా, పాత్ర మాత్రమే ప్రేక్షకుల ముందు నిలిచిందని అన్నారు. ఇప్పటివరకు చేసిన సినిమాలు ఒక ఎత్తు ఇక నుంచి సెలక్ట్ చేసుకోబోయే సినిమాలు ఒక ఎత్తు అని అన్నారు. రాబోయే రోజుల్లో పాత్రల ఎంపిక పై తగిన జాగ్రత్తలు తీసుకుంటానని చెప్పారు. పాత్రలు, కథ బలంగా ఉన్నప్పుడే నటుడికి ఎలివేషన్ వస్తుందని అన్నారు. రాబోయే రోజుల్లో చేసే అన్ని పాత్రలను చాలా జాగ్రత్తగా సెలక్ట్ చేసుకుంటానని నవదీప్ పేర్కొన్నారు.

## సంతోషంగా ఉంది: రాజేంద్రప్రసాద్



కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పద్మ అవార్డుల్లో నటుడు రాజేంద్ర ప్రసాద్‌కు చోటు దక్కడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ నా జీవితంలో ఎంతో సంతోషకరమైన రోజు. భారత ప్రభుత్వం నాకు పద్మశ్రీ అవార్డు ప్రకటించిన విషయం తెలిసినప్పటి నుంచి నా కళ్ళు ఆనందంతో నిండిపోయాయి. ఒక నటుణ్ని గుర్తించి, ఇంతటి గొప్ప గౌరవాన్ని అందించిన భారత ప్రభుత్వానికి నా శిరసు వంచి నమస్కరిస్తున్నాను. నా పేరును ఈ పురస్కారానికి సిఫారసు చేసిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి, పెద్దలందరికి నా ప్రత్యేక కృతజ్ఞతలు. కానీ నిజం చెప్పాలంటే ఈ అవార్డు నాది కాదు...మీది. నలభై ఎనిమిదేళ్లుగా నన్ను ఒక నటుడిగా మాత్రమే కాకుండా మీ ఇంట్లో ఒక మనిషిగా, మీలో ఒకడిగా గుండెల్లో పెట్టుకుని చూసుకుంటున్నారు. నేను నవ్వించినా, ఏడిపించిన మా రాజేంద్ర ప్రసాద్ అని మీరు చూపించిన ఆప్యాయత నాకు దక్కిన నిజమైన అదృష్టం. ఆ ప్రేమే ఈ రోజు నను ఇక్కడి దాకా నడిపించింది. ఆంధ్ర, తెలంగాణ ప్రజలు నన్ను సొంత బిడ్డల్లాగా ఆదరించారు. మీ ఋణం ఈ జన్మలో తీర్చుకోలేను అని రాజేంద్ర ప్రసాద్ పేర్కొన్నారు.

## ఓ..సుకుమారిలో యాదగిరిగా తిరువీర్



యంగ్ హీరో తిరువీర్, హీరోయిన్ ఐశ్వర్య రాజేష్ జంటగా వస్తున్న తాజా చిత్రం నూతన దర్శకుడు భరత్ దర్శన్ దర్శకత్వంలో గంగా ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్‌పై మహేశ్వర రెడ్డి మూలి నిర్మిస్తున్నారు. విమర్శకుల ప్రశంసలు పొందిన తొలి సినిమా 'శివం భజే' తర్వాత ఈ బ్యానర్‌లో రూపొందుతన్న చిత్రమిది. ఇప్పటికే దామిని పాత్రలో ఐశ్వర్య రాజేష్ ఫస్ట్ లుక్‌ను విడుదల చేసిన నిర్మాతలు ఇప్పుడు తిరు వీర్ ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేశారు.ఫస్ట్ లుక్‌లో తిరు వీర్ రగ్గడ్, మాస్ విలేజ్ క్యారెక్టర్‌గా యాదగిరిగా పరిచయమయ్యారు. విలేజ్‌లో నడుచుకుంటూ వస్తున్న ఆయన లుక్ వెంటనే అటెన్షన్ గ్రాబ్ చేస్తుంది. స్లీవ్‌లెస్ బనియన్, కట్టుకున్న లుంగీ, భుజాలపై వేసుకున్న తువ్వాలు మొత్తంగా ఒక ఎర్తీ, అన్‌ఫిల్టర్డ్ ఫీల్‌ను క్యాప్చర్ చేశాయి. రజాకార్, పోలిమేర చిత్రాలకు సినిమాటోగ్రఫీ చేసిన సి.హెచ్. కుషేందర్ ఈ చిత్రానికి కెమెరామ్యాన్. ఎం.ఎం. కీరవాణి శిష్యుడు భరత్ మంచిరాజు సంగీతం సమకూరుస్తారు. బలగం ఫేం తిరుమల ఎం. తిరుపతి ఆర్ట్ డైరెక్టర్, క చిత్రానికి ఎడిటింగ్ చేసిన శ్రీ వర ప్రసాద్ ఎడిటర్. పాపులర్ లిరిక్ రైటర్ పూర్ణచారి ఈ చిత్రంలోని పాటలు రాస్తున్నారు. ఈ సినిమా తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో ప్రేక్షకుల ముందుకు రానుంది.

## రైతుల ట్రాక్టర్ ర్యాలీలు

(మొదటి పేజీ తరువాయి)

ట్రాక్టర్ మార్చ్ నిర్వహించారు. ఇది భంగలలోని గ్రెయిన్ మార్కెట్ నుండి ప్రారంభమై భంగల చుంగి, మాతా రాణి చౌక్, షుగర్ మిల్లు, ఎస్‌డిఎం కార్యాలయం గుండా కొనసాగి తిరిగి ప్రారంభ స్థానానికి చేరుకుంది. ముకేరియన్ కమిటీ యూనిట్ అధ్యక్షుడు అవతార్ సింగ్ బాబీ ఈ మార్చ్‌కు నాయకత్వం వహించారు. హోషియార్‌పూర్‌లోని దసుయా వద్ద, ట్రాక్టర్లపై రైతులు వెర్కా చౌక్, ఎస్‌డిఎం చౌక్, గ్రెయిన్ మార్కెట్, చుంగి చౌక్, బాలగన్ చౌక్ గుండా ర్యాలీ నిర్వహించి మియాని రోడ్డులోని బాస్రా హాస్పిటల్ సమీపంలో ముగించారు. అయితే గర్థివాలా వద్ద, రైతులు బస్టాండ్, సర్వాలా మోర్ గుండా బఘ్గో గ్రామంలోని గురు ఆస్రా ఘర్‌కు ర్యాలీ చేశారు. టాండా వద్ద కూడా ఇలాంటి ప్రదర్శన నిర్వహించారు. అక్కడ దోబా కిసాన్ కమిటీ అధ్యక్షుడు జంగ్వీర్ సింగ్ చౌహాన్ నాయకత్వంలో 60కి పైగా ట్రాక్టర్లపై రైతులు కవాతు నిర్వహించారు. తాండా–ఉర్మూర్ వద్ద రైతులను ఉద్దేశించి చౌహాన్, కమిటీ ప్రధాన కార్యదర్శి పృథిపాల్ సింగ్ గుర్జె మాట్లాడుతూ కేంద్ర రైతు వ్యతిరేక నిర్ణయాలను తీవ్రంగా విమర్శించారు. సహకార సంస్థల ప్రైవేటీకరణను ప్రోత్సహిస్తోందని ఆరోపించారు. ఎరువుల అధిక ధరలకు వ్యతిరేకంగా కూడా వారు హెచ్చరించారు. తప్పు చేసిన డీలర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మోగాలో, ధరంకోట్ ప్రాంతంలోనూ ర్యాలీ జరిగింది. అందులో భారతి కిసాన్ యూనియన్ (తోటేవాల్) నుండి సుఖ్ గిల్, హింద్ కిసాన్ సభ నుండి సూరత్ సింగ్, బికెయు (రాజేవాల్) నుండి సుఖ్విందర్ సింగ్ బ్రహ్మకే, బికెయు (పంజాబ్) నుండి మన్దీప్ సింగ్ పాల్గొన్నారు. ట్రాక్టర్ మార్చ్‌లు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా ముగిశాయని అధికారులు తెలిపారు.

## చైనా మాంజా (మొదటి పేజీ తరువాయి)

మాంజా తగిలి పలువురు తీవ్రగాయాల పాలుకాగా, మరికొందరు మరణించిన విషయం తెలిసిందే. పోలీసులు ఎన్ని హెచ్చరికలు జారీ చేసినా, ప్రజల్లో మార్పు రావడం లేదని, కొందరి నిర్లక్ష్యం మూలంగా అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చైనా మాంజా సరఫరాపై నిఘా పెట్టామని, దానిని ఉపయోగించిన వారిపై కూడా కఠిన చర్యలు ఉంటాయని పోలీసులు మరోసారి స్పష్టం చేశారు.



## ట్రెజరీల ద్వారా వేతనాలను చెల్లించాలి

### ఎస్‌టియు డిమాండ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో మోడల్ స్కూల్స్‌లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు ట్రెజరీల ద్వారా వేతనాలను చెల్లించాలని ఎస్‌టియు టిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జి.సదానందం గౌడ్ డిమాండ్ చేశారు. హెల్త్ కార్డులు, మెడికల్ రియంబర్స్‌మెంట్ సౌకర్యాన్ని కల్పించాలని, మరణించిన ఉపాధ్యాయ కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాలు చేపట్టాలన్నారు. హైదరాబాద్, కాచిగూడలోని ఎస్‌టియు భవన్‌లో ఏర్పాటు చేసిన 'మోడల్ స్కూల్ టీచర్స్ యూనియన్ రాష్ట్ర కౌన్సిల్' సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మోడల్ స్కూల్స్ ఆవిర్భావం నుండి ఉపాధ్యాయులు అనేక సమస్యలతో ఇబ్బంది పడు తున్నారని, ఇటీవల బదిలీలు మినహా ఏ ఒక్క సమస్య కూడా పరిష్కారం కాలేదని చెప్పారు. సకాలంలో వేతనాలు కూడా అందడం లేదని, ఆంధ్రప్రదేశ్ తరహా 010 హెడ్ కింద ట్రెజరీల ద్వారా వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న దాదాపు వెయ్యి ఉపాధ్యాయ ఖాళీలను వెంటనే ప్రత్యేక డిఎస్‌సి ద్వారా భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రిన్సిపల్ పోస్టులు ఖాళీగా ఉన్న నేపథ్యంలో ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలన్నారు. 2019 సంవత్సరంలో ఎస్‌టియు టిఎస్‌కు అనుబంధంగా ఈ సంఘాన్ని ఏర్పాటు చేశామని గుర్తు చేశారు. ఈ సమావేశంలో ఎస్‌టియు టిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుట్టు గజేందర్, మోడల్ స్కూల్ టీచర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్. విఠల్, బత్తిని సత్యనారాయణ గౌడ్‌తో పాటు రాష్ట్ర, జిల్లా బాధ్యులు పాల్గొన్నారు.

## సమ్మె (మొదటి పేజీ తరువాయి)

బ్యాంకులు, వరుసగా మూడో రోజు కూడా మూతపడే అవకాశం ఉంది. 'ఇచ్చిపుచ్చుకునే రీతిలో విస్తృత చర్చలు జరిపినప్పటికీ, మా డిమాండ్‌పై ఎలాంటి హామీ లభించలేదు. గత్యంతరం లేని పరిస్థితుల్లో సమ్మెకు వెళుతున్నాం' అని యుఎఫ్‌బియు అనుబంధ ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఎఐబిఇఎ) ప్రధాన కార్యదర్శి సిహెచ్ వెంకటాచలం పిటిఐకి తెలిపారు. ఆల్ ఇండియా బ్యాంక్ ఆఫీసర్స్ కాన్ఫెడరేషన్ (ఎఐబిఒసి) ప్రధాన కార్యదర్శి రూపమ్ రాయ్ మాట్లాడుతూ, వారానికి ఐదు రోజుల పని నిర్ణయాన్ని 2024 మార్చిలో జీతాల సవరణ ఒప్పందం సందర్భంగా పేర్కొన్నప్పటికీ, ఇంత వరకూ ఆ దిశగా ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. కేంద్ర ప్రభుత్వం తాత్సారం చేయడం వల్లే సమ్మె పరిస్థితులు తలెత్తాయని పేర్కొన్నారు. సోమవారం నుంచి శుక్రవారం వరకు రోజుకు అదనంగా 40 నిమిషాలు పనిచేయడానికి తాము అంగీకరించినందున, బ్యాంకింగ్ రంగానికి పనిగంటల నష్టం ఉండదని ఆయన అభిప్రాయపడ్డారు యుఎఫ్‌బియులోని మరో భాగస్వామి నేషనల్ కాన్ఫెడరేషన్ ఆఫ్ బ్యాంక్ ఎంప్లాయీస్ (ఎన్‌సిబిఇ) ప్రధాన కార్యదర్శి ఎల్. చంద్రశేఖర్ మాట్లాడుతూ, ఈ ఉద్యమం వినియోగదారులకి వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు. స్థిరమైన, మానవీయమైన, సమర్థవంతమైన బ్యాంకింగ్ వ్యవస్థ కోసం ప్రయత్నిస్తున్నామన్నారు. సమతుల్యమైన కార్మిక బలం ఆర్థిక స్థిరత్వాన్ని బలపరుస్తుందన్నారు. ఇలావుంటే, మంగళవారం సమ్మె కారణంగా, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బిఐ), పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పిఎన్‌బి), బ్యాంక్ ఆఫ్ బరోడా వంటి ప్రభుత్వ రంగ బ్యాంకుల శాఖల్లో నగదు జమ, ఉపసంహరణలు, చెక్ క్లియరెన్సులు, ఇతరత్రా పరిపాలనా పనులు ప్రభావితమయ్యే అవకాశం ఉంది. అయితే, యుపిఐ, ఇంటర్నెట్ బ్యాంకింగ్ వంటి డిజిటల్ బ్యాంకింగ్ సేవలకు ఎలాంటి ఇబ్బంది ఉండదు. కొన్ని ప్రాంతాల్లో ఎటిఎంలలో నగదు లభ్యతకు స్వల్ప ఇబ్బందులు తలెత్తవచ్చు. ఈ సమ్మెకు సంబంధించిన సమాచారాన్ని ఎస్‌బిఐసహా పలు ప్రభుత్వ రంగ బ్యాంకులు ఇప్పటికే స్టాక్ ఎక్స్ఛేంజీలకు అందించాయి. లావాదేవీల సమస్య తలెత్తే అవకాశం ఉందని ముందుగానే సూచించాయి. సమ్మె రోజున ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ఖాతాదారులకు సేవలు అందించడానికి చర్యలు తీసుకుంటున్నట్టు ఉన్నతాధికారులు ప్రకటిస్తున్నప్పటికీ, అది సాధ్యమయ్యే పరిస్థితులు కనిపించడం లేదు. వారానికి ఐదు రోజుల పనిపై ఒప్పందం కుదిరి సుమారు రెండు సంవత్సరాలు కావస్తున్నా, ఇప్పటి వరకూ కేంద్ర ప్రభుత్వం ఇంకా నోటిఫికేషన్ ఇవ్వలేదు. ప్రస్తుతం బ్యాంకులు ప్రతి నెలా మొదటి, మూడవ, ఐదవ శనివారాల్లో పనిచేస్తున్న విషయం తెలిసిందే.

# ఎన్‌డిఎ ప్రభుత్వం మొండి వైఖరితో లేబర్ కోడ్‌ల అమలు

### ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాజ్యాంగం అమలులోనికి వచ్చిన 1950 జనవరి 26 నుంచి పూర్తిగా అమలు చేసిఉంటే ప్రస్తుతం దేశంలో పేదలు, దారిద్ర్యం, నిరుద్యోగం ఉండేది కాదని ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్ అన్నారు. '77వ గణతంత్ర దినోత్సవం' సందర్భంగా హైదరాబాద్, హిమాయత్‌నగర్‌లోని ఎఐటియుసి రాష్ట్ర కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన జాతీయ జెండాను బాల్‌రాజ్ సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బాల్‌రాజ్ మాట్లాడుతూ కార్మికులు అనేక పోరాటాలు, ఉద్యమాల ద్వారా సాధించుకున్న 44 కార్మిక చట్టాలను రద్దు చేసి, చట్టబద్ధంగా పార్లమెంట్‌లో ఆమోదించని నాలుగు కోడ్‌లను కార్మికవర్గంపై బలవంతంగా ఉపయోగిస్తున్నారని విమర్శించారు. నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని దేశ వ్యాపితంగా ఇప్పటికే 27 సార్లు సార్వత్రిక సమ్మెలు చేసినప్పటికీ ఎన్‌డిఎ ప్రభుత్వం మొండి వైఖరితో లేబర్ కోడ్‌లను అమలు చేసేందుకు నోటిఫై చేయడాన్ని ఆయన తప్పుబట్టారు. ఫిబ్రవరి12న దేశవ్యాపితంగా జరిగే సార్వత్రిక సమ్మెలో కార్మికులందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. ప్రజలకు ఉపయోగకరంగా ఉన్న రాజ్యాంగంలోని ఆర్టికల్స్‌ను ఇప్పటికే ప్రభుత్వాలు 80 సార్లకు పైగా రాజ్యాంగ సవరణ చేశారని, ప్రస్తుత ఎ న్‌డిఎ ప్రభుత్వం రాజ్యాంగాన్నే మార్చే కుట్ర చేస్తోందని విమర్శించారు. దేశానికి స్వాతంత్ర్యం రాకముందే 1920లో ఎఐటియుసి ఏర్పడిందని, ఒక పక్క బ్రిటీష్ ప్రభుత్వంపైన ఎనలేని పోరాటాలుచేస్తూనే, స్వేచ్ఛ, స్వాతంత్ర్యం కోసం, దోపిడీలేని స్వామ్యవాదం కావాలని పోరాటాలు చేసిందని ఆయన వివరించారు. ఎఐటియుసి ప్రస్తావించిన అనేక అంశాలను డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ నాడు రాజ్యాంగంలో పొందుపర్చారని బాల్‌రాజ్ తెలిపారు. ఎఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నర్సింహ్మా మాట్లాడుతూ జాతీయ జెండాగా కాషాయ జెండాను తీసుకొచ్చి, భారతదేశంలో హిందుత్వ విధానాన్ని,నినాదాన్ని ముందుకు తీసుకుపోయే ప్రయత్నాలను ప్రజాస్వామ్యవాదులు, రాజ్యాంగ పరిరక్షకులు పోరాటాలకు, ఉద్యమాలకు శ్రీకారం చుట్టాలని కోరారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఎఐటియుసి రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పి.ప్రేంపావని మాట్లాడుతూ అంబేడ్కర్ ఆలోచన విధానంతో ప్రజలకు ఉపయోగపడే రాజ్యాంగాన్ని మార్చే కుట్ర చేస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శులు ఎన్.కరుణ కుమారి, బి.వెంకటేశం, నళిని, నెర్లకంటి శ్రీకాంత్, చెట్టుక్రింది శ్రీను, కాశయ్యతో పాటు భవన నిర్మాణ, ఆటో కార్మికులు, విద్యార్థి, యువజన నాయకులు పాల్గొన్నారు. ప్రజానాట్యమండలి కళాకారులు పాటలు పాడారు.

## రాజ్యాంగం మారిపోయేది!

(మొదటి పేజీ తరువాయి)

నాయకులు నెల్లికంటి శ్రీకాంత్, సబ్బు రాజమౌళి తదితరులు పాల్గొన్నారు. జెండా ఆవిష్కరణ అంనతరం పల్లా వెంకట రెడ్డి మాట్లాడుతూ రాజ్యాంగంలో పొందపర్చిన ప్రజాస్వామ్యం, లౌకికత్వం, సమాఖ్య స్ఫూర్తికి బిజెపి ప్రభుత్వం తిలోదకాలు ఇచ్చి ఆర్‌ఎస్‌ఎస్ కనుసన్నల్లో పరిపాలన కొనసాగిస్తుందన్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రాలు పూర్తిగా స్వేచ్ఛను కొల్పోయన్నారు. రాజ్యాంగాన్ని పరిరక్షించాల్సిన గవర్నర్లు అందుకు భిన్నంగా ఆర్‌ఎస్‌ఎస్ ఆదేశాల మేరకు ప్రతిపక్ష పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. సమాఖ్య స్ఫూర్తిగా పూర్తిగా విఘాతం కలిగిస్తున్న గవర్నర్ వ్యవస్థను రద్దు చేయాల్సిందేనని సిపిఐ ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తోందని పల్లా వెంకట రెడ్డి గుర్తు చేశారు. మతోన్మాదమే ఏకైక ఎజెండగా బిజెపి పాలన కొనసాగిస్తుండడం గమనించాలని సూచించారు. దేశానికి స్వాంతంత్ర్యం వచ్చి 77 ఏళ్లు గడిచిందని, ఇప్పటివరకు అంతరించిపోవాల్సిన పేదరికం ఇంకా పెరుగుతోందని, పేదల సమస్యలను పరిష్కరించాల్సిన కేంద్ర ప్రభుత్వం బడా కార్పొరేట్ సంస్థలకు వతాస్తు పలకడమే ఇందుకు కారణమన్నారు. రైతులు, కార్మికులు, కర్షకులు, ఉద్యోగులకు ప్రగతి కోసం కాకుండా కేవలం కార్పొరేట్ సంస్థల ప్రయోజనాలను కాపాడే విధంగా వారికి లక్షల కోట్లు రాయితీలను ఇస్తూ బడ్జెట్ ప్రవేశ పెడుతోందని ఆయన విమర్శించారు. ఈ వ్యవస్థ మారితేనే తప్ప సమాజంలో సమానత్వం రాదని, ఇందుకు బిజెపిని గద్దె దించడమే మార్గమన్నారు. ప్రపంచంలో యుద్ధ నీడలు కమ్ముకుని పరిస్థితులు పూర్తిగా భయానకంగా మారగా, కేంద్ర ప్రభుత్వం మాత్రం తమకు ఏమి పట్టనట్లుగా తటస్థ వైఖరిని అవలభించడం భారతదేశానికే ప్రమాదకరమని హెచ్చరించారు. గతంలో అలీన విధానం మేరకు గత ప్రభుత్వాలు మన దేశంతో పూర్తి సఖ్యతగా ఉన్న దేశాలకు మద్దతు ఇచ్చేవన్నారు. ఇందుకు భిన్నంగా బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ వ్యవహరించడం సరికాదని, ప్రభుత్వ వైఖరిని స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. దేశంలోని నిరుపేదలకు ఉపాధి కల్పిస్తూ వారు సగౌరవంగా బతికేందుకు అవకాశం కల్పించిన గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరు మార్చడమే కాకుండా ఈ పథకాన్ని నిర్వీర్యం దశల వారీగా ఎత్తివేసేందుకు కుట్ర చేస్తోందని, ఈ చర్యలను తిప్పికొట్టాలని పల్లా వెంకట రెడ్డి పిలుపునిచ్చారు.



### దేశంలో నెలకొన్న పరిస్థితులపై ప్రతి ఒక్కరూ సమీక్షించుకోవాలి : కె.రామకృష్ణ

77వ గణతంత్రం తర్వాత నేడు ఈ దేశంలో నెలకొన్న పరిస్థితులపై ప్రతి ఒక్కరూ సమీక్షించుకోవాలని కె.రామకృష్ణ కోరారు. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా భారతదేశంలో భిన్నత్వంలో ఏకత్వం గల ప్రాంతమని, ఇదే స్ఫూర్తితో రాజ్యాంగంలో పొందపర్చుకున్న ప్రజాస్వామ్యం, లౌకికతత్వం, సమాఖ్య సూర్తిని కేంద్ర ప్రభుత్వం తుంగలో తొక్కుతోందన్నారు. ఈ నేపథ్యంలో భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ.టి.నరసింహ మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రజలందరిని మత విద్వేషాల వైపు మళ్లిస్తూ అరాచక పాలనను కొనసాగిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలందరికి చెందాల్సిన దేశ సంపదను కొందరి చేతుల్లోనే పెడుతోందని విమర్శించారు. బొమ్మగాని ప్రభాకర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యం, లౌకికవాదం, సామాజిక న్యాయమే లక్ష్యంగా రాసుకున్న రాజ్యాంగం ప్రతి ఒక్కరి చేత ఆమోదింపబడినట్లు పొందపర్చబడిందని, అధికారంలో ఎవరు ఉన్నా రాజ్యాంగాన్ని ఆమోదించాల్సిందేనని, అమలు చేయాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు.

### గిరి ప్రసాద్ భవన్‌లో జెండా ఆవిష్కరణ

గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం నాగోల్ బండ్లగూడలోని గిరిప్రసాద్ భవన్‌లో జాతీయజెండాను నవచేతన విజ్ఞానసమితి కార్యదర్శి బిఎస్ఆర్ మోహన్‌రెడ్డి ఎగురవేశారు. కార్యక్రమంలో విజ్ఞనసమితి జనరల్ మెనేజర్ మధుకర్, కోశాధికారి ఉజ్జిని రత్నాకర్ రావు, ప్రజాపక్షం ఎడిటర్ మక్కెన సుబ్బారావు, పత్రిక సిబ్బంది, విజ్ఞాన సమితి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com